ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

జనవరి 24, 2010

గుట్కా తింటే గుటుక్కే!

హ్యాపీబర్త్‌డే

(2010 జనవరి 24 నుంచి
2010 జనవరి 30 వరకు)

బన్నీ
1సం॥, జనవరి-25
రాజేశ్వరి-సత్యనారాయణ
విజయనగరం

గిరి
1సం॥, జనవరి-2009
పూజ-షణ్ముక
తారకరామనగర్- చిత్తూరు

జి. సుబ్బారెడ్డి
జనవరి
పద్మ-మల్లారెడ్డి
కె.వి. పాలెం

జి. సాయి పావని
జనవరి
పద్మావతి-మల్లారెడ్డి
ఒంగోలు-ప్రకాశం

ఆహ్వానం

మీ చిన్నారులకు కూడా ఇలా పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పాలని ఆశ పడుతున్నారా! అయితే ఆలస్యం ఎందుకండి! వెంటనే పోస్ట్ కార్డు తీసుకోండి. దాని మీద మీ బాబు- పాప పేరు , పుట్టిన తేదీ, నెల, సంవత్సరం, ఊరు , తల్లిదండ్రుల వివరాలు రాసి పోస్ట్ చేయండి. అన్నట్టు కార్డు పై కలర్ ఫొటో అతికించడం మరువకండి. అయితే మీ చిన్నారి వివరాలను 15 రోజుల ముందుగానే మాకు అందేవిధంగా పంపగలరు.

మా చిరునామా
హ్యాపీ బర్త్‌డే, ప్రజాశక్తి ప్లాట్ నెం. 21/1,
ఎం.హెచ్ భవన్
ఆజమాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి,
హైదరాబాద్-500 020
email- venkateshcartoon@gmail.com

ENTERED

మనలో మాట

జ్ఞాన గ్రహణం!



గ్రహాలూ గ్రహణాలూ మనకు కొత్త కాదు.

విగ్రహాలు పుట్టని కాలం నుంచీ అవి ఉన్నాయి.

చాలామంది అనవసరంగా జడుస్తారు కానీ, ఆకాశంలో ఏర్పడే గ్రహణం వల్ల ఏ నష్టమూ లేదు. అదో అద్భుతమైన అంతరిక్ష విన్యాసం. హాయిగా చూడొచ్చు, ఆనందించొచ్చు. పాపం... చాలామందికి గ్రహణమంటే భయం. 'వెర్రిమొర్రి' ప్రమాదాలేవో సంభవిస్తాయని వెరపు. చంద్రుడొక మట్టిముద్దని, సూర్యుడొక అగ్నిగోళమని శాస్త్రజ్ఞులు నిరూపించి చాన్నాళ్లయింది. ఇంకా పాములు మింగితేనే గ్రహణం ఏర్పడుతుందని నమ్మడమంటే అది అజ్ఞానం, కాకుంటే సాంప్రదాయ అభిమానం. సంక్రాంతి రోజున చాలా చోట్ల జనం గ్రహణాన్ని వీక్షిస్తుంటే- కొంతమంది రాహుకేతువుల్లా అడ్డుపడి అభాసు పాలయ్యారు. తమ వెర్రికి తామే పరిమితం కాకుండా విజ్ఞానం మీదా విరుచుకుపడడం విడ్డూరం. సైన్సుకు గ్రహణం పట్టించడం, అరెస్సెస్ చేతితో సూర్యకాంతిని అడ్డుకోవడం సాధ్యం కాని పని.

పట్టించుకోగలిగితే- మన కళ్లముందు అనేక గ్రహణాలు ఉన్నాయి. పాపం... కందిపప్పుకు గ్రహణం పట్టి ఎన్నాళ్లయింది? దాని విడుపుకోసం ఏ మంత్రి ఇంటి ముందో స్నానాదికాలు నిర్వహిస్తే ఎంత బాగుంటుంది! సన్న బియ్యం, దొడ్డు బియ్యం దళారీ రాహుకేతువులకు చిక్కి చాన్నాళ్లయింది. విడుదలకోసం ఉపవాసాలు చేస్తే కాస్తయినా ఉపయోగంగా ఉంటుంది. తెలుగు భాషకు ఆంగ్ల గ్రహణం పట్టింది. కనీసం పట్టిందన్న గ్రహింపు ఎంతమందికి ఉంది? టీవీలకు సా... గిపోయే సీరియళ్ల గ్రహణం, ఎలక్ట్రానిక్ మీడియాకు సంచలనాల గ్రహణం, రాజకీయాలకు అవినీతి, బంధుప్రీతి, కులం, మతోన్మాదం తదితరాల సామూహిక గ్రహణం... ఇలా ఎన్నెన్ని గ్రహణాలు మన కళ్ల ముందు?



వీటివల్ల సమాజానికి ఎంత నష్టం, కష్టం, అరిష్టం!

జనానికి వీటి నుంచి ఉపశాంతి, శాశ్వత శాంతి కావాలి.

అందుకోసం ఏమైనా చేస్తే మంచిది. ★

ఈ సంచికలో....

టపా	...	2
సినిమా కబుర్లు	...	3
కవిత్వమ్	...	6
వికాసం	...	8
కథ	...	10
తనువు తనిఖీ యంత్రం	...	12
అట్టమీది కథ	...	17
సీరియల్	...	20
బాలనేస్తాలు	...	22
క్రైమ్ కథ	...	24
విజ్ఞాన వీచిక	...	25
నవ్వుల్ పువ్వుల్	...	28

ఇంకా...

స్ఫూర్తి ... 4

మహోన్నత విప్లవ కావ్యం

చిన్న కథ ... 7

ఇంతకూ నేనెవరిని?



చూద్దామా ... 26

వెయ్యేళ్ల కోవెల



చక్కగా ఉంది

జనవరి 10 ఆదివారం స్నేహలో 'ఊరూరా సంక్రాంతి' కవర్‌స్టోరీ ఒకనాటి గ్రామాల సౌభాగ్యం నేడు గుర్తు చేసుకోవడానికి చక్కగా వుంది. నాటి భోగిమంటలు, ముత్యాల ముగ్గులు, ఇంటింటా వేడుకలు, పౌరాణిక సాంఘీక నాటకాలు, పిండివంటలతో ఆరగింపులు, హరిదాసుల కీర్తనలు నానాటికీ దూరమైపోతున్నపరిస్థితి సామాన్య ప్రజానీకంలో వేదన కలిగిస్తోంది. అయినా ఆశతో ఈ సంక్రాంతి క్రాంతి ఇస్తుందని ఆశిద్దాం.

ఆచార్య నూతి నారాయణరావు, గడ్డిఅన్నారం, హైదరాబాద్.

అన్ని కోణాలలో...

మనసులో మాట శీర్షికలో కొద్ది అక్షరాలతో ఎన్నో నిజాలను బయటపెట్టారు. అమెరికాలో వర్షం పడితే ఇక్కడ మనకు తుమ్ములు వచ్చే కాలమొచ్చింది అని నమ్ముతున్నారు. ఎంత సంక్షోభం వచ్చిందో తెలిసి కూడా అమెరికా పేరును కూడా ఉచ్చరించలేకుండా వుండలేకపోతున్నారు. చావు ఖర్చులు భరించలేమని తెలిసి శరీరాలను సైన్స్ పరిశోధనలకు దానమిస్తున్నారు. లాభాల కోసం అక్కడ ఏదైనా చేస్తారు. సమాధులను కూడా ముందే కొనుక్కున్న వారే ఇప్పుడు అమ్ముతున్నారు. చావొచ్చేదాకా బతకాలిగా అని బుక్ చేసుకున్నవి అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. అమెరికాకు మించిన స్వర్గం లేదు. వాళ్ల తప్పు చేయరు. ఎందుకంటే డబ్బు ఎక్కువ సంపాదించవచ్చనే భ్రమ తీరిపోయి, ఉద్యోగాలు వున్నా సంపాదన చాలక ఫుడ్ కూపన్లను సిగ్గు విడిచి తీసుకోవడంలో ఆశ్చర్యంలేదు. అంత ఐశ్వర్యం గల దేశం ఎవరిని ఎలా మోసం చేసింది అనేది గుర్తించరు. మరల భూతల స్వర్గం అవుతుందని కలలు కంటున్నారు. ప్రపంచ దేశాలకు పెద్దన్నలా ఆదర్శంగా వుండి ఆర్థిక ప్రమాణాలు పెంచుకుంటే తప్పులేదు. పెద్దన్న పాత్రలో దేశాలను భయపెట్టి వాటి వనరులను కొల్లగొట్టాలంటే ఇక సాగదు. లాటిన్ అమెరికాయే అందుకు ఉదాహరణ. మీ వివరణ అన్ని కోణాలలో చక్కగా ఉంది. ధన్యవాదాలు.

మురళీధర్, వెంకటేశ్వరపురం.

కొత్తేమీ కాదు

మీరు స్నేహలో అమెరికాలో 'ముందస్తు సమాధులు రివర్స్ అమ్మకాలు' అని మనలో మాట రాశారు. అమెరికాలో గత 25 సంవత్సరాల నుండి స్మశానాలలో తమ మృతశరీరాలను పాతి పెట్టడానికి వీలుగా స్థలం కొనుక్కుంటున్నారు. దానిని ఫార్వార్డ్ ట్రేడింగ్‌తో ముడి పెట్టడం, ఫార్వార్డ్ ట్రేడింగ్‌లో ఉండే నష్టాలతో పోల్చడం కొండను పుట్టలతో పోల్చడం లాంటిదే అవుతుంది.

ఎస్.రవికుమార్, విజయవాడ.

అభినందనీయం

జనవరి 10 ప్రజాశక్తి ఆదివారం అనుబంధంలో అట్టమీది కథ 'ఊరూరా సంక్రాంతి' చదివిన తర్వాత నెల రోజుల పాటు సంబరాలు జరుపుకునే పండుగ, అందరినీ ఏకం చేసి ఒకే వేదికపై నిలిపే పండుగ, ధనుర్మాసం నుండి ప్రారంభమై నెల రోజుల వరకు ఉంటుందనీ, సిరిసంపదలతో ప్రతిఒక్కరూ తులతూగాలనీ కాంక్షిస్తూ ఈ పండుగను పిండి వంటకాలతో, పిల్లలు గాలిపటాలు ఎగరేస్తూ సంబరంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ముఖ్యంగా భోగి, మకరసంక్రాంతి, కనుమ అని మూడు రోజుల ప్రాధాన్యతను, పశువులను గౌరవించడం, వాటి పేడతో అలికి గొబ్బెమ్మలను పెట్టడం అభినందనీయం. గోమహాలక్ష్మి అని గోవులను పూజించడం సనాతన ఆచారం. వివిధ ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తూ దూర ప్రాంతాలలో వుండేవారు సంక్రాంతి పండక్కి సకుటుంబ సమేతంగా స్వంత ప్రాంతాలకు వచ్చి పండుగ జరుపుకోవడం, వారి ఆప్యాయతానురాగాలకు నిదర్శనం. కోళ్లపందేలు, ఎడ్ల పందేలు జోరుగా సాగడం పరిపాటే. పెరుగుతున్న ధరలకనుగుణంగా సామాన్యుడు తన స్తోమతకు సంబంధించి పండుగను ఆర్భాటంగా జరుపుకోలేకపోతున్నాడు. మునుపటి ఉత్సాహం కరువవుతుంది. ఎన్ని ఇబ్బందులు వున్నా సరే మనమందరం ఆనంద డోలికల్లో తేలియాడుతూ సంక్రాంతి పండుగను అంగరంగ వైభవంగా జరుపుకుని ఆచార, సాంప్రదాయాలను కనుమరుగవకుండా కాపాడదాం.

కామిడి సతీష్‌రెడ్డి, కాటూరి శ్రీధరాచార్య, పరకాల, వరంగల్.

నిజంగానే స్ఫూర్తినిచ్చింది

వియత్నాం గెరిల్లా అని పేరు చూడగానే అది మగ గెరిల్లా అనిపించింది. కానీ స్త్రీ కూడా గెరిల్లా లాగా పూర్తి స్థాయిలో పని చేయగలదని పుణ్యవతిగారు స్ఫూర్తి పొంది మనకు స్ఫూర్తినిచ్చారు. అంతే కాకుండా ఆదివారం అనుబంధం కూడా స్ఫూర్తి పొంది ఆ నవలను సీరియల్‌గా వేయబోతున్నందువల్ల నాలాంటి వారికి జీవితంలో ఆటుపోటులను ఎదుర్కోవడానికి ఉపయోగపడుతుంది. నేను కోయంబత్తూరులో వున్న కాలంలో అభ్యుదయ రచయితల సంఘం వారు వియత్నాం యుద్ధం సినిమా వేశారు. స్త్రీలు వ్యవసాయం చేస్తుంటారు. అమెరికా యుద్ధ విమానాలు వచ్చినప్పుడు చెట్లలో దాచి వుంచిన ఆయుధాలతో విమానాలపై కాల్పులు జరుపుతారు. విమానాలు వెళ్లి పోయిన తర్వాత తిరిగి వ్యవసాయం చేసుకుంటారు. స్త్రీలు చేసే యుద్ధమూ, వ్యవసాయమూ చూశాను.

శరీరంలోని అన్ని అవయవాలకు పేర్లు పెట్టి చెబుతాము. మనసుకు ప్రత్యేకమైన అవయవం లేదు కానీ పేరుకు మాత్రం మనసు అంటాం.



అది మన గతం, వర్తమానం, భవిష్యత్ చరిత్ర అనుభవాలకు ప్రతిరూపం. దాన్ని బీరువాలో పెట్టిగానీ, పెట్టెలో పెట్టిగానీ వుంచితే కదలిక వుండదు. అది మనతో వుంటుంది. మనతోనే పోతుంది. అందుకే అది 'మనకోసం' రంగనాథ రామచంద్రరావు గారు రాసిన 'ఇది నీ కోసం' కథను అర్థం చేసుకోడానికి అలసిపోయాను.

ఇలిపిల్ల సూర్యనారాయణ, భీమనవారిపేట, విజయవాడ.

భారీ బాధే

జనవరి 3 ఆదివారం అనుబంధంలో ప్రచురించిన అట్టమీది కథలో చాలామంది ఆహారం తీసుకోక పోయినా భారీగా వుంటారు. చాలా మంది ఇలాంటి సమస్యలతో బాధపడుతున్నారు. ప్రతి మనిషికి వ్యాయామం చాలా అవసరం. ఫుట్‌పాత్‌మీద అమ్మే ఆహార పదార్థాలను తిని అనర్థాలను తెచ్చుకుంటున్నారు. 'మనలో మాట' లో పండుగ వచ్చిందంటే కొత్త అల్లుళ్లందరూ చాలా ఉత్సాహంగా వుంటారు. 'తెల్సా' లో రెండు కాళ్ల శునకం గురించి తెలుసుకుని ఆశ్చర్యపోయాం. స్ఫూర్తి లో పుచ్చలపల్లి సుందరయ్యగారి జీవిత చరిత్ర చదవటమంటే గుండెల్లో రైళ్లు పరిగెత్తినట్టే. ఆయన ఆశయాలు నాటి నుండి నేటి వరకు ఆయన స్ఫూర్తితోనే కొనసాగుతున్నాయి. 'కవిత్వమ్'లో శాంతిశ్రీ పుస్తకం, అలాగే రుచి ద్వారా పెసర పప్పు పాయసం తయారు చేసే విధానం బాగుంది.

అనుపోజు సంతోషిరాజు, ఫూల్‌బాగ్ కాలనీ, విజయనగరం. ★

సినిమా కబుర్లు

ఛాయాగ్రహణ స్ఫూర్తి వి.కె. మూర్తి



భారత చలన చిత్ర రంగంలో అత్యున్నతమైన దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు తొలిసారిగా ఒక ఛాయాగ్రాహకుడికి లభించడం, అది కూడా వి.కె.మూర్తి వంటి పాతతరం నిపుణుడికి దక్కడం ఎంతగానో సంతోషించవలసిన విషయం. మౌలికంగా సినిమా దృశ్య కళారూపం, దాన్ని దృశ్యమానం చేసే అద్భుత పరికరం కెమెరా మాత్రమే. అందులోనూ సాంకేతిక పరిజ్ఞానం ఇంతగా అభివృద్ధి కాని రోజుల్లో ఛాయాగ్రాహకులు చాలా కష్టపడవలసి వచ్చేది. విదేశాలలో శిక్షణ పొందడంతో పాటు వున్న పరికరాలతోనే కొత్తదనం చూపించేందుకు వారు ఎంతగానో శ్రమ పడవలసి వచ్చేది. ఆ కోవలో అగ్రగణ్యుడు వి.కె.మూర్తి. దక్షిణ భారతంలోని కర్నాటకకు చెందిన మూర్తి భారతీయ సినిమా చరిత్రలోనే అజరామరంగా నిలిచిపోయిన అనేక కళా ఖండాలకు ప్రాణ ప్రతిష్ట చేశారు. అందులోనూ గురుదత్, శాంతారాం వంటి కళా తపస్వులు ఆయన్నే ఎంచుకున్నారంటే మూర్తి ప్రతిభ తెలుస్తుంది.

1923లో పుట్టిన వి.కె.మూర్తి బెంగుళూరులోని శ్రీ జయచంద్ర పాలిటెక్నిక్‌లో సినిమాటోగ్రఫీ డిప్లొమో తీసుకున్నారు. ఆ చదువులో వారిదే మొదటి బ్యాచ్! అంటే తొలితరం అన్నమాట. తర్వాత ఆయన సినిమా రంగంలో ప్రవేశించింది ఛాయాగ్రాహకుడిగా కాదు, వయలెనిస్టుగా! అలా కొన్ని చిత్రాలకు పనిచేసిన తర్వాత ఆయన గురుదత్ దృష్టిలో పడ్డాడు. అది కూడా చాలా యాదృచ్ఛికంగా జరిగింది. గురుదత్ భారతీయ సినిమాలో కళాత్మకమైన ఇతివృత్తాలు తీసిన ప్రయోక్త. ఆయన వైవిధ్యానికి, లాలిత్యానికి ప్రతీకగా పేరు పొందారు. తన చిత్రాలు "ప్యాసా, కాగజ్‌కే ఫూల్" వంటి వాటిలో వలెనే నిజ జీవితంలోనూ ఆయన సున్నితంగా మెలిగిన వ్యక్తి. ఈ క్రమంలో చిన్న వయసులోనే కన్నుమూశారు. ఇంతకూ గురుదత్‌ను మూర్తి ఆకర్షించడం చాలా తమాషాగా జరిగింది. ఫేమస్ స్టూడియోలో అసిస్టెంటు కెమెరా మేన్‌గా పనిచేస్తున్న మూర్తి ఒక క్లిష్టమైన సన్నివేశ చిత్రణకు సంబంధించి సలహా ఇచ్చారు. మా సాంకేతిక నిపుణులలా చేయలేరని గురుదత్ అన్నారు. "మీరేమీ అనుకోకపోతే మీ వాళ్లను ఈ ఒక్కసారి నేను సూచించినట్టు ప్రయత్నించి చూడమని చెప్పండి" అని మూర్తి జవాబిచ్చాడు. కళాహృదయం గల గురుదత్ అందుకు అంగీకరించారు. కావాలంటే రెండు మూడు సార్లు ప్రయత్నించవచ్చునని కూడా చెప్పారు. అయితే మూర్తి తొలిషాట్‌లోనే అనుకున్న ఫలితం సాధించి చూపారు. సంతోషానికి సంభ్రమానికి కూడా గురైన గురుదత్ ఈ చిత్రానికి మీరే పనిచేయండి అని ఆహ్వానించారు. అయితే ఇప్పుడున్నవారిని అర్ధంతరంగా తొలగించడం మంచిది కాదని మూర్తి వినయంగా తిరస్కరించాడు. కావాలంటే భవిష్యత్తులో తీసేవాటికి తానే పనిచేస్తానని అన్నాడు. ఆ ప్రకారమే వారిద్దరూ విడదీయరాని జంటగా కళా ఖండాలు సృష్టిస్తూ వచ్చారు.

గురుదత్ ప్రతిష్టాత్మక చిత్రాలు 'ప్యాసా, కాగజ్‌కే ఫూల్, సాహెబ్ బీబీ ఔర్ గులాం' వంటి చిత్రాలకు మూర్తి ఛాయాగ్రాహకుడిగా పనిచేశారు. ప్యాసాలో 'వఖ్తనే క్యా కియా' అన్న పాటలో ఆయన కిరణాలు ప్రతిఫలించేలా తీసిన సన్నివేశం ఒక సంచలనం. దానికో ప్రత్యేక స్థానం కేటాయించారు. ఇంతకూ ఈ గొప్ప విజయానికి ప్రేరణ ఒక లైట్ బాయ్ నుంచి లభించిందంటే ఆశ్చర్యం కలగొచ్చు. అతగాడు అద్దం సహాయంతో కాంతిని ప్రతిబింబింపచేయడం చూసిన మూర్తి రెండు మామూలు అద్దాలను పరస్పర అభిముఖంగా ఉపయోగించి అద్భుతమైన దృశ్యం తీయగలిగారు. ఇది 1959లోనే ఆయనకు ఫిలింఫేర్ అవార్డు తెచ్చిపెట్టింది. 'చౌదవి కే చాంద్'లో ఆయన చిత్రీకరణ యువతరాన్ని ఊపేసింది. గురుదత్ వున్నంత వరకూ మూర్తి ఇతరుల చిత్రాలకు పనిచేయలేదు. ఆ తర్వాత కాలంలో మరో కళాస్రష్ట కమల్ అమ్రోహి చిత్రాల ఛాయాగ్రహణం చేపట్టారు. దృశ్య కావ్యంగా ప్రసిద్ధి గాంచిన 'పాకీజా' వారి సంయుక్త కృషికి గొప్ప ఉదాహరణ. చాలా ఏళ్ల తర్వాత వచ్చిన మరో చారిత్రక చిత్రం 'రజియా సుల్తానా'లోనూ ఇదే ప్రతిభ కనిపిస్తుంది. తర్వాత కాలంలోనూ ఆయన శ్యాం బెనగళ్, ప్రమోద్ చక్రవర్తి వంటి సమాంతర దర్శకులతో పనిచేశారు. బెనగళ్ ధారావాహికంగా దూరదర్శన్‌లో ప్రసారం చేసిన నెహ్రూ రచన డిస్కవరీ ఆఫ్ ఇండియా(భారత్ ఏక్ ఖోజ్) ఛాయాగ్రాహకుడు ఆయనే.

మత కలహాల భీబత్సాన్ని చెప్పిన 'తమస్' చిత్రంతో సంచలనం కలిగించిన గోవింద నిహలానీ మూర్తి దగ్గర సహాయకుడుగా సినీ జీవితం ప్రారంభించారు. తర్వాత ఆయనతోనూ పనిచేశారు. 'నయా జమానా, ద్రోహకాల్' వంటి హిందీ చిత్రాలతో పాటు మొత్తం 35 చిత్రాలకు ఛాయాగ్రహణ బాధ్యతలు నిర్వహించారు. మాతృభాష కన్నడంలో రాజేంద్ర కుమార్ బేడి తీసిన 'హోవా హూన్ను'కు పనిచేశారు. శ్రీమతి ఉమారావు కన్నడంలో ఆయన జీవిత చరిత్ర రాశారు. ప్రసిద్ధ హాలివుడ్ చిత్రం గన్స్ ఆఫ్ నెవరోన సాంకేతిక బృందంలో ఆయన సభ్యుడు. భారత దేశంలో తొలి సినిమా స్కోప్‌చిత్రం 'కాగజ్‌కే ఫూల్' కోసం ఆయన విశేషంగా శ్రమించి విజయవంతం చేశారు. ఆ రోజుల్లో సాంకేతికంగా పరిజ్ఞానం తక్కువే, పరికరాలు కూడా పెద్దగా అందుబాటులో వుండేవి కావు. విదేశాల నుంచి తెచ్చుకోవడమో లేక వున్నవాటితో తంటాలు పడటమో అనివార్యమయ్యేది. అలాటి దశలో మూర్తి ప్రతిభా సామర్థ్యాలు ఎంతగానో ప్రశంసలు పొందాయి. రవికాంత్ నగాయి, మార్కస్ భారట్టే వంటివారు ట్రిక్ ఫొటోగ్రఫీపై శ్రద్ధ పెట్టారు గాని మూర్తి మాత్రం సహజ సిద్ధమైన చిత్రణకే ప్రాధాన్యతనిచ్చినట్టు కనిపిస్తుంది.

వి.కె.మూర్తి కేవలం సాంకేతిక నిపుణుడే కాదు. స్వాతంత్ర యోధుడు కూడా. ఆయన 1943లో జైలు శిక్ష అనుభవించారు. ఇప్పుడు ఆయన స్వాతంత్ర్య యోధులకిచ్చే పించను కూడా పొందుతున్నారు. దీర్ఘకాలం పాటు ముంబయిలో వున్నా వృద్ధాప్యంలో బెంగుళూరు చేరారు. తనకు ఈ అవార్డు వస్తుందని ఎప్పుడూ అనుకోలేదని, రావడం చాలా సంతోషమని సవినయంగా వ్యాఖ్యానించారు. "నేనెప్పుడూ అవార్డుల గురించి ఆలోచించలేదు. సినిమాటోగ్రఫీ అంటే నాకు ప్రాణం అంతే" అని ఆయన వెల్లడించారు. అయితే ఈ సమయంలో తనకు గురుదత్ గుర్తుకువస్తున్నాడంటూ ఆయనకు నివాళు లర్పించారు.

1969లో ప్రారంభమైన దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు కింద పది లక్షల నగదుతో పాటు స్వర్ణ కమలం బహూకరిస్తారు. త్వరలోనే రాష్ట్రపతి ప్రతిభాపాటిల్ ఈ బహూకరణ ఉత్సవంలో పాల్గొని శాలువాతో సత్కరిస్తారు.

- పీపీ

స్ఫూర్తి

మంతెన సీతారాం,
సి.పి.ఎం ప.గో. జిల్లా కార్యదర్శి.

మహోన్నత విప్లవ కావ్యం 'అమ్మ'

కాలేజీ గేటు వద్దే సోవియట్ సాహిత్యం అమ్మే ఓముసలాయన నాకో రోజు తారసపడ్డాడు. చాలా పుస్తకాలు అక్కడ పెట్టి అమ్ముతున్నాడు. ఆ పుస్తకాలవైపు ఆత్రంగా చూశాను. "అమ్మ" కనిపించింది. వెంటనే ఆ పుస్తకం తీసి చూశాను. అది రష్యన్ నవల అని తెలిసింది. ఇది చదివితే కమ్యూనిస్టు దేశం రష్యా గురించి తెలుస్తుందనిపించి ఆ పుస్తకం కొనేశాను. దానితోపాటు లెనిన్ జీవిత చరిత్ర, శ్రీశ్రీ మహాప్రస్థానం కూడా కొన్నాను.

"అమ్మ" పుస్తకం కొన్న మరుసటి రోజే రెండు రోజులు వరుసగా శెలవులు వచ్చాయి. ఏకదీక్షగా పరీక్షల్లో చదివినట్లుగా "అమ్మ" నవలను చదివాను. ఆ రెండు రోజులూ రూము వదిలిపెట్టకుండా మొత్తం చదివేశాను. ఆ పుస్తకం ఆసాంతం చదివిన అనంతరం నా మనస్సు పొందిన గొప్ప అనుభూతి మాటల్లో ఇక్కడ నేను చెప్పలేను. నా సత్యాన్వేషణకు సమాధానం దొరికిపోయింది. నా మార్గం స్పష్టమైపోయింది.

నా పదేళ్ళ ప్రాయంలో అభిమాన నాయకుడు అల్లూరి సీతారామరాజు. ప్రాథమిక పాఠశాలలో ఐదవ తరగతి తెలుగు వాచకంలో అల్లూరి జీవితంపై పాఠం నన్నెంతో ప్రభావితం చేసింది. ఆ విధంగా అల్లూరిపై అభిమానం, ఆరాధన పెరిగాయి. ఆ స్ఫూర్తితో సహాధ్యాయులమంతా ఒక కళా బృందంగా "అల్లూరి"పై నాటిక రూపొందించి స్కూలులో ప్రదర్శించాం. నాకు తొలిగా తెలిసిన పోరాట యోధుడు, విప్లవగాథ అల్లూరిదే. ఆయన మా ప్రాంతంవాడే కావడం కూడా నన్ను బాగా ప్రభావితం చేయడానికి ఒక కారణం కావచ్చు. ప్రధానంగా ఆయనలో సమరశీలత, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాట పటిమ నా లేత హృదయంపై ప్రగాఢ ముద్ర వేసింది. హైస్కూల్‌లో ప్రవేశించిన అనంతరం తెలుగులో పాఠ్యాంశంగా ఉన్న గాంధీ జీవితం నాకు నచ్చినా ఆ ప్రభావం ఎంతో కాలం నిలవలేదు. మా ఊళ్ళో నేను చూసిన పేదరికం, అసమానతలు, అంటరానితనం నన్ను చలింప చేశాయి. సమాజ మార్పుకు సత్యాన్వేషణ చేసే ఆలోచన నాలో ప్రారంభమయ్యింది. 1971లో భీమవరం డి.ఎన్.ఆర్. కాలేజీలో విద్యార్థిగా చేరడం నా జీవితానికి ఒక గొప్ప మలుపుగా భావిస్తాను. 1974లో బి.ఎ. రాజనీతి శాస్త్ర విద్యార్థిగా రాజకీయ పార్టీల గురించి పాఠ్య పుస్తకాల ద్వారానే తొలిగా తెలిసింది. 'కమ్యూనిజం' అనే ఒక గొప్ప సిద్ధాంతం మానవాళి దోపిడి, పీడనకు విముక్తి మార్గంగా ఉంటుందనే అభిప్రాయం ఆ పుస్తకాల ద్వారానే రేఖామాత్రంగా నా మనస్సులో నాటుకుంది. అదే నా హృదిలో తొలి కమ్యూనిస్టు బీజం. కమ్యూనిజం గురించి బాగా తెలుసుకోవాలనే తహతహ పుస్తకాలవైపుకు పరిగెట్టించింది. కాలేజీ గేటు వద్దే సోవియట్ సాహిత్యం అమ్మే ఓముసలాయన నాకో రోజు తారసపడ్డాడు. చాలా పుస్తకాలు అక్కడ పెట్టి అమ్ముతున్నాడు. ఆ పుస్తకాలవైపు ఆత్రంగా చూశాను. "అమ్మ" కనిపించింది. వెంటనే ఆ పుస్తకం తీసి చూశాను. అది రష్యన్ నవల అని తెలిసింది. ఇది చదివితే కమ్యూనిస్టు దేశం రష్యా గురించి తెలుస్తుందనిపించి ఆ పుస్తకం కొనేశాను. దానితోపాటు లెనిన్ జీవిత చరిత్ర, శ్రీశ్రీ మహాప్రస్థానం కూడా కొన్నాను.

"అమ్మ" పుస్తకం కొన్న మరుసటి రోజే రెండు రోజులు వరుసగా శెలవులు వచ్చాయి. ఏకదీక్షగా పరీక్షల్లో చదివినట్లుగా "అమ్మ" నవలను చదివాను. ఆ రెండు రోజులూ రూము వదిలిపెట్టకుండా మొత్తం చదివేశాను. ఆ పుస్తకం ఆసాంతం చదివిన అనంతరం నా మనస్సు పొందిన గొప్ప అనుభూతి మాటల్లో ఇక్కడ నేను చెప్పలేను. నా సత్యాన్వేషణకు సమాధానం దొరికిపోయింది. నా మార్గం స్పష్టమైపోయింది.

ప్రజాశక్తివారు స్ఫూర్తినిచ్చిన పుస్తకం గురించి రాయమని గత నాలుగు నెలలుగా పదేపదే వత్తిడి చేయగా, మరలా 36 సంవత్సరాలకు "అమ్మ" నవలను తిరగేశాను. అప్పటికన్నా మరింత ఉద్వేగానికి, ఆర్ద్రతకి లోనయ్యాను. మొదట చదివినప్పుడు నేను కమ్యూనిస్టును కాను. కమ్యూనిస్టు అయిన 30 ఏళ్ళ తరువాత ఈ పుస్తకాన్ని మరల చదివితే ఎంత గొప్పగా ఉందీ, ఎంత అనిర్వచనీయమైన అనుభూతి కలిగించిందీ ఇప్పటికీ మాటల్లో చెప్పలేను. అంత గొప్ప విప్లవ కావ్యం "అమ్మ". ప్రపంచంలో ప్రతి కమ్యూనిస్టు "అమ్మ" పుస్తకం చదవాలి. విప్లవపథంలో పురోగమిస్తున్న రష్యాలో లక్షలాది మంది కార్మికుల్ని, పీడితుల్ని విప్లవోద్యమం వైపు నడిపించడంలో "అమ్మ" గొప్ప పాత్ర నిర్వహించిందని లెనిన్ అన్నారు. ఈ పుస్తకం చదవకుండా ఉండటం కమ్యూనిస్టులు ఎవ్వరికైనా ఎంత లోటో వేరే చెప్పనవసరంలేదు.

"అమ్మ" నవలను అద్భుతంగా సృజించిన మక్సీం గోర్కీ ప్రపంచ కార్మిక వర్గ మహారచయిత. అనన్యసామాన్యమైన, అనితరసాధ్యమైన ఆయన రచనా శైలి ఏ పాఠకుడినైనా తన వెంట తీసుకుపోతుంది. పుస్తకాన్ని మొత్తం చదివిస్తుంది.

ఆ పుస్తకం అయిపోయేంత వరకు చదవ కుండా ఉండనీయదు. ప్రపంచ కార్మికవర్గ మహా రచయితల్లో “సోషలిస్టు వాస్తవికత”ను తన రచనల్లో ప్రపంచంలోనే తొలిసారిగా ప్రతిబింబించిందీ, సుసంపన్నం చేసిందీ అయనే. ‘అమ్మ’ ఇచ్చిన స్ఫూర్తితోనే మక్సీం గోర్కీ రచనలన్నీ ఆ తరువాత చదివేశాను.

‘అమ్మ’ నవలలో ప్రతి పేజీలో అద్భుతమైన మానవ జీవిత విషాదం, పోరాటం ఆవిష్కరించబడింది. పెట్టుబడిదారీ సమాజపు అమానుషత్వం, రాక్షస దోపిడి, పీడిత ప్రజల అధోలోకాన్ని కథనంలో, వర్ణనల్లో, సంభాషణలలో అత్యంత ప్రతిభావంతంగా గోర్కీ చిత్రించాడు. 1905 విప్లవానికి ముందు రష్యాలో విప్లవ పరిస్థితుల్ని కళ్ళకు కట్టినట్లు ‘అమ్మ’ నవలల్లో గోర్కీ చిత్రించాడు. ఆ సజీవ దృశ్యాలన్నీ ఈ వ్యాసంలో ప్రస్తావిస్తే మరల ‘అమ్మ’ నవలే ఇక్కడ పునర్ముద్రించినట్లు అయిపోతుంది. మచ్చుకు కొన్ని సంఘటనలు యథాతథంగా అక్షర రూపంలో ఆవిష్కరిస్తున్నాను.

మిహాయిల్ వ్లాసావ్ భార్య నీలొవ్నాయే ఈ నవలలోని ‘అమ్మ’. ఓ సాధారణ కార్మికుడి భార్య. క్రైస్తవ భక్తురాలు. తాగుబోతు భర్తతో నిరంతరం హింసబడే ఓ ఇల్లాలు. ఆమె కొడుకే విప్లవ కథా నాయకుడు పావెల్. తండ్రిలాగే కొడుకు కూడా మొదట తాగి ఇంటికి వచ్చినప్పుడు ఆ తల్లి ఎంతగా ఆందోళన పడిందీ గోర్కీ ఎంత సజీవంగా చిత్రించాడో చూడండి.

“నువ్వు తాగొద్దు బాబూ .... మీ నాయన మీ యిద్దరి ఓపికకి మించి తాగేశాడు. నన్ను నానా హింసలూ పెట్టాడు. నీకైనా నా మీద కాస్తంత జాలి కలగడంలేదా బాబూ?” అంటుంది తల్లి విచారంగా.

ఆ మాటలు వింటుంటే, తన తండ్రి బతికున్నంతకాలం అమ్మ ఉందో లేదో కూడా తనకు గుర్తులేని సంగతి పావెల్‌కు జ్ఞాపకం వస్తుంది. తండ్రి దెబ్బలకు జడిసి అమ్మ నిశ్శబ్దంగా వుండేది. తన తండ్రి కంటపడ్డం ఇష్టంలేక, చాలా సార్లు ఇంటికి రావడం మానేస్తాడు. అందువల్ల అతను అమ్మకు దూరంగానే గడుపుతాడు. నిషా నెమ్మదిగా దిగిపోయాక పావెల్ అమ్మ వైపు పరిశీలనగా చూస్తాడు.

నీలొవ్నా పొడగరి. కొద్దిగా గూని వుంది. బండచాకిరివల్లా భర్త కొట్టిన దెబ్బలవల్లా అమె కొంచం పక్కకి వంగిపోయి నడుస్తుంది. ముడతలుపడ్డ ముఖం, భయవిషాదాలు నిండిన కళ్ళు, ఒత్తు జుట్టు, అక్కడక్కడా తెల్లగా నెరిసిన వెంట్రుకలు... సౌమ్యత, విషాదం, అణకువ బొమ్మ కట్టాయన్న భావం కలుగుతుంది అమెను చూడగానే.

అమె చెంపలమీద కన్నీరు జారుతోంది. “ఏడవకమ్మా! నాకు కాసిని మంచినీళ్ళివ్వు” అంటాడు పావెల్. ఆమె లోపలికి వెళుతుంది. గ్లాసులో నీళ్లు తెచ్చే సరికే అతను నిద్రపోతాడు. ఒక్క క్షణం ఆమె కొడుకు మొహంలోకి చూస్తుంది. చేయి వణుకుతుంది. గ్లాసు టేబుల్ మీద ఉంచి, గోడకి తగిలించివున్న దేవుడి పటం ముందు మోకరిల్లుతుంది. నీలొవ్నా లేచి వెళ్ళి పడుకుంటుంది.

ఆ సంఘటన తరువాత పావెల్‌లో చాలా మార్పు వస్తుంది.

నిజమే చాలా మార్పు వస్తుంది. విప్లవ కార్మికవర్గ నాయకుడిగా పరిణితి చెందుతాడు. ఒక సందర్భంలో ఆ తల్లితో, విప్లవ సహచరులతో ఎంతో ఉద్వేగంతో ఏమన్నాడో చూడండి.

“కడుపునిండా తిండేనా మనకు కావాల్సింది?.... కానే కాదు. మన భుజాలనెక్కి స్వారీ చేస్తూ మన కళ్లకు గంతలు కడుతున్నవాళ్లకు, మనం అంతా చూస్తూనే వున్నామని గుర్తించేలాగా చెయ్యాలి. మనం మూర్ఖులం కాదనీ, తిండితప్ప మరింకేమీ అక్కర్లేని పశువులం కాదనీ, మనుషుల్లాగా బతకాలని కోరుకుంటున్నామనీ వాళ్లకు రుజువు చెయ్యాలి. మనం కూడా మానవుల్లాగా జీవించాలని వాంఛిస్తున్నాం. మన శత్రువులు మనల్ని బండచాకిరితో ఎంత కుంగదీస్తున్నా, బుద్ధిలో వాళ్లకే విధంగానూ తీసిపోమనీ, తెలివితేటల్లో వాళ్లకన్నా మనం పైచెయ్యేనని కూడా మనం ధ్రువపర్చాలి” అని ఆ ముగ్గురి వైపు చూస్తూ నిదానంగా చెప్తాడు. అతనంత బాగా మాట్లాడినందుకు తల్లి బాగా గర్వపడుతుంది.

పావెల్‌కు విప్లవ కార్మికోద్యమంలో పరిచయమైన వనిత సాషా. పావెల్‌ని ప్రేమిస్తుంది. ఆమెను పావెల్ కూడా ప్రేమిస్తాడు. ఒక సంఘటనలో ప్రేయసి కోరినదానికన్నా విప్లవ కర్తవ్యమే మిన్నని ఉదాత్తంగా చాటుతాడు.

“జెండాని మీరు పట్టుకుని ముందు నడుస్తారా ?” అనడుగుతుంది సాషా మెల్లగా.

‘అవును’ అంటాడు పావెల్.

‘తుది నిర్ణయమేనా’

‘అవును. అది నా ప్రత్యేక హక్కు’

అంటే మళ్లీ జైలు పాలవడమన్నమాటేనా?’

పావెల్ జవాబివ్వలేదు.

‘పోనీ మీరు మానేసి...’

‘ఏమిటి?’

‘ఇంకెవరినైనా ఆ పని చెయ్యనివ్వకూడదా ?’

‘కూడదు’ అన్నాడు పావెల్ కచ్చితంగా.

‘బాగా ఆలోచించండి. మీరు ప్రజల్లో బాగా పలుకుబడి ఉన్నవారు. మీరన్నా, ఆన్‌ద్రేయ్ అన్నా ప్రజలకు చాలా అభిమానం. మీరిద్దరూ యిక్కడుంటే మీరెంత పని చేయగలుగుతారో ఆలోచించండి. మీరు జెండా పట్టుకుంటే, ప్రభుత్వం మిమ్మల్ని ప్రవాసం పంపుతుంది. చాలా కాలం పాటు ప్రజలకు మీరు దూరం కావాల్సి

ప్రజాశక్తివారు స్ఫూర్తినిచ్చిన పుస్తకం గురించి రాయమని గత నాలుగు నెలలుగా పదేపదే వత్తిడి చేయగా, మరలా 36 సంవత్సరాలకు “అమ్మ” నవలను తిరగేశాను. అప్పటికన్నా మరింత ఉద్వేగానికి, ఆర్ద్రతకి లోనయ్యాను. మొదట చదివినప్పుడు నేను కమ్యూనిస్టును కాను. కమ్యూనిస్టు అయిన 30 ఏళ్ళ తరువాత ఈ పుస్తకాన్ని మరల చదివితే ఎంత గొప్పగా ఉందీ, ఎంత అనిర్వచనీయమైన అనుభూతి కలిగించిందీ ఇప్పటికీ మాటల్లో చెప్పలేను.



వస్తుంది”.

తల్లికి ఆ అమ్మాయి స్వరంలో భయం, ఆపేక్ష ప్రత్యక్షంగా గోచరించినట్లయింది. సాషా చెప్పిన చివరి వాక్యాలకు తల్లి గుండెల్లో రాయి పడుతుంది.

‘నేనొక నిశ్చయానికొచ్చేశాను. ఇక దానికి తిరుగుండదు”

‘నేను కోరినా కూడానా ?’

‘అలాంటి కోరిక మీరు కోరకూడదు’

‘నాకెంతో ఆప్తురాలు మీరు. అంచేత మీరలాంటి మాటలు చెప్పకూడదు’ అంటాడు పావెల్.

అమ్మ నీలొవ్నా ఎంతో ఎదిగిపోయింది. విప్లవా కార్మికోద్యమంలో తన బిడ్డతోపాటు తాను ఓముఖ్య పాత్రధారి అయ్యింది. నవల చివరిలో జారు ప్రభుత్వపు పోలీసులను ఉద్దేశించి “ఓరి తెలివితక్కువ దద్దమ్మల్లారా, మీరు అసహ్యాన్ని, ద్వేషాన్ని మూటగట్టుకొంటున్నారు. ఇంతకింతా మీరనుభవిస్తారు!” అంటుంది అమ్మ. అమ్మ అన్నట్టే అయ్యింది. బోల్షివిక్ పార్టీ నాయకత్వంలో 1917లో జారు ప్రభుత్వం కూలిపోయింది. కార్మికవర్గం రాజ్యాధికారం చేపట్టింది. అనంత చరిత్ర ప్రపంచాన్నే ప్రభావితం చేసింది. ప్రపంచ గతినే మార్చివేసింది.

★

కవిత్వమ్

ఆంక్షల హరివిల్లు

- కడెం లక్ష్మీప్రశాంతి

విభిన్న ధృవాల సహజీవనం
నిరంతర ఆకర్షణా వికర్షణాల భ్రమణం
దగ్గరవుతున్నట్టనిపిస్తూనే
భర్తీ చేయలేని దూరపు లోయలు
మన ఆలోచనల సాలెగూళ్లెప్పడూ
తూర్పు పడమరలే!!
నీతో సమానంగా నడవాలనే తపన నాది!
నీ అడుగులను అనుసరించాలనే
శాసనం నీది!!
హెచ్చుతగ్గుల కొలబద్దపై
తగ్గుదలే నాకందించే నజరానా
ఆశల రహదారిలో బాసటగా నిలుస్తావనే నా కాంక్ష
నీ ఆంక్షల తూటాలతో విచ్ఛిన్నమైంది
బంధాలన్నీ బంధనాలైతే
మనిషి మనిషిగా మిగలడం గగన సుమం!!

నీ జ్ఞాపకం

- సునంద

ఉషోదయానికి సంకేతాలు
ఉలిక్కిపడి లేచాను
అవును మరి సూర్యాస్తమయం దాకా
ఎన్నో పాత్రలు ధరించాలికదా!
అందుకే మేకప్ సామాను
సిద్ధం చేసుకుంటూ....
ఇంకా ఏ మేకప్పూ వేయని సమయంలో
అంతర్ముఖమైంది మనసు
మలియ మారుతంలా నీ జ్ఞాపకం
హఠాత్తుగా నన్ను చుట్టుకొంది
హృదయమంత చిరుహాసమై
పెదాలపై పాకింది
మల్లెల జడివానతో
ఒడలంతా తడిమింది
కంటికొస పలకరింపులు
కొంటె మాటలు, చిలిపి తగాదాలు
బాధలు, బాధ్యతలు తెలియని
అందాల లోకంలో
స్వచ్ఛతకు చిరునామాలు
వెన్నెల్లో విహారాలు
సహజ దరహాసాలు
ఒకదాని వెంట ఒకటి
మన చుక్‌చుక్‌రైలు ఆటల్లా
బుజబుజ రేకుల పాటల్లా
అనుభూతుల అలల్లో
తేలియాడుతుండగా....
పసివాడి కదలిక తార
మరోమారు ఉలిక్కిపడుతూ...
నీ - జ్ఞాపకానికి మంచుతెర వేసి
అనేకానేక పాత్రల్లో జీవించడానికి
జీవిత నాటకంలోకి వెళ్తున్నా....

ధాన్య ప్రణామం

- దాకరపు బాబూరావు

నేను మట్టిమనిషిని
నమ్మకమే పెట్టుబడిగా
జీవన క్షేత్రంలో
ఆశల విత్తనాలు చల్లుకునే
అనాది అమాయకత్వాన్ని

'ఆదర్శరైతు' అనే తలపాగా చుట్టుకున్న
మకుటంలేని మహారాజుని కాదునేను
పంటలని రూపాయలుగా
మారకం వేసే వ్యాపార సూత్రమూ నాకు తెలీదు

పచ్చపచ్చటి బతుకు పొలాలలోకి
వెచ్చవెచ్చటి నెత్తుటి ధారలు మళ్లించి
ఆకలి ధాత్రికి
ధాన్య ప్రణామం వినమ్రంగా చేసేవాడిని

అన్ని కాలాల్లోనూ
దళారీ అమీబాలను భరిస్తూనే

సేద్య సంగీతంలో పొలం పాటలకి
పాడి పంటల శృతీ లయ కూర్చినవాడిని

మారిన కాలంలో
మారని వ్యవసాయ పనిముట్టుని
కాంప్లెక్స్ ఎరువులు చేస్తున్న కోలాహలానికి
భయపడి... నాగేటి చాళ్లలో మౌనంగా దాగిన సేంద్రియతనాన్ని

ఇప్పుడు నన్ను వెదకాలంటే
నా చిరునామా కనుగొనాలంటే
దయచేసి పొలాల పొలిమేరల్లోకి వెళ్లకండి

అంతరించిపోతున్న వృత్తుల వెబ్‌సైట్‌లో
సెజ్ డాట్‌కామ్‌ను క్లిక్ చేయండి
సీడీలో వెన్నెలని వెదికినట్లుగా
చలువగ్లాసుల షోకేసుల షాపింగ్‌మాల్స్‌కి
వెళ్లండి

అప్పటికీ నేదొరక్కపోతే
రైతు ఆత్మవ్యధలు ప్రచురిస్తున్న
ఏ పెట్టుబడి విషపత్రికలోనైనా
ఏ ఆత్మహత్య పేజీ తిప్పినా...
ఓడిపోయిన రైతు తనువు
పార్థివ దేహాన్నై మీకు కన్పిస్తాను.

★

చిన్నకథ

ఇంతకూ నేనెవరిని?

(మరో చీమకథ)

"అదిసరే, ఇన్నిసార్లు ఇన్ని రకాల పేర్లతో పిలుస్తున్నారు గదా! ఇంతకీ అసలు నేనెవరిని?" అని మళ్లీ రెట్టించి అడిగింది.

అప్పుడు నేనామెతో "అమ్మా! భారతదేశంలో పుట్టిన ప్రతి మనిషీ కొన్ని ప్రత్యేక సందర్భాలలో రకరకాల వివక్షలకు గురి కావచ్చు.

లక్షల రకాల జంతు జాలంలో నువ్వు ఒక "మనిషి"వి. మరికొంత స్పష్టత కావాలంటే 'భారతీయురాలి'వి. ఆ తర్వాత 'తెలుగు మహిళ'వు. ఇతరులు ఏయే సందర్భాలలో, ఏయే పేర్లు పెట్టి నిన్ను పిలిచినా ఇంతకు మించిన గుర్తింపు నీకు అవసరం లేదు. మనలో ఎవరికైనా ఆ గుర్తింపును దాటి, కులమత, ప్రాంతాల పేర్లతో "గుర్తింపు" అక్కర్లేదు అని చెప్పాను.

ఈరోజు ఉదయం ఆరున్నరకే ఫోన్ వచ్చింది. పలకరింపులు లేవు. పండుగ ప్రస్తావన లేదు. కుశల ప్రశ్నలూ లేవు. కొంత ఆతృత, ఆందోళన, విసుగు కలిసిన గొంతుతో "అన్నయ్యా ఇంతకూ నేనెవర్నిరా?" అని మా చెల్లెలు అడిగిన ప్రశ్నతో ఉలిక్కిపడ్డాను. "అదేమిటే, 50 ఏళ్ల క్రిందట పుట్టావు. నీ ఇద్దరు పిల్లల్నీ బాగా చదివించావు. పెద్ద ఉద్యోగం చేస్తున్నావు. ఎన్నో ప్రాంతాలు తిరిగావు. మరి ఇన్నాళ్ల తర్వాత ఇదేం ప్రశ్నమ్మా" అన్నాను.

అవునన్నయ్యా! 50 ఏళ్లనాడు ఆంధ్రప్రాంతం తల్లిదండ్రులకు పుట్టాను. కులమతవర్గ భేదాలేవీ తెలియకుండా పెరిగాను. నిశ్చింతగా విద్యాభ్యాసం జరిగిపోయింది.

1988లో కులాల ఘర్షణ వచ్చినప్పుడు, "నువ్వు ఫలానా కులం మనిషివి" అనే కారణం చెప్పి మా ఇంటి మీద దాడి చేశారు. కొంత ఆస్తి నష్టపోయి, ఎలాగో తప్పించుకుని బయట పడ్డాను.

ఆ తరువాత, నా ఉద్యోగం బదిలీ మీద తెలంగాణ వెళ్లాం. సుమారు 20 ఏళ్లు తెలంగాణలోనే ఉండడం వల్ల మా పిల్లలిద్దరూ తెలంగాణ తెలుగే మాటాడతారు. పాప తిరుపతిలో ఇంజనీరింగ్ చదవడం వల్ల నాలుగేళ్లు రాయలసీమలో ఉన్నది.

ఈ మధ్య ఉద్యోగరీత్యా మీ బావగారు ఉత్తరాంధ్రలోని విజయనగరంలో ఐదేళ్లు ఉన్నారు కదా! అబ్బాయేమో పై చదువుల కోసం మూడేళ్ల క్రిందట ఆస్ట్రేలియా వెళ్లాడు. అక్కడ వాడున్న రెండేళ్ల కాలంలో జాతి వివక్షతో భారతీయ విద్యార్థుల మీద దాడులు జరుగుతుండడంతో ప్రతిరోజూ ఫోన్ చేసి తన క్షేమ సమాచారం తెలుసుకోవలసి వచ్చేది.

కొన్ని సంవత్సరాల క్రితం ఉద్యోగాలలో, చదువులలో రిజర్వేషన్స్‌కు సంబంధించిన ఉద్యమం పెద్ద ఎత్తున సాగింది. అప్పుడు నన్నొక 'గ్రూపు'లో జమ కట్టారు.

ఇప్పుడేమో ఒక నెలరోజులుగా ప్రత్యేక తెలంగాణ అనీ, సమైక్య ఆంధ్ర అనీ ఉవ్వెత్తున హింసాత్మక ఉద్యమాలు జరుగుతున్నవి. ఈ ఉద్యమాలు కూడా పెడదారులు పట్టి, మళ్లీ నాకేదైనా కొత్త పేరు పెట్టి ఆంధ్ర మనిషివని తెలంగాణలోనో, తెలంగాణదానివని మరొక చోటనో ఎప్పుడు దాడి జరుగుతుందోనని ప్రతి నిమిషం ఆందోళన చెందుతున్నాను.



"అదిసరే, ఇన్నిసార్లు ఇన్ని రకాల పేర్లతో పిలుస్తున్నారు గదా! ఇంతకీ అసలు నేనెవరిని?" అని మళ్లీ రెట్టించి అడిగింది.

అప్పుడు నేనామెతో "అమ్మా! భారతదేశంలో పుట్టిన ప్రతి మనిషీ కొన్ని ప్రత్యేక సందర్భాలలో రకరకాల వివక్షలకు గురి కావచ్చు.

లక్షల రకాల జంతు జాలంలో నువ్వు ఒక "మనిషి"వి. మరికొంత స్పష్టత కావాలంటే 'భారతీయురాలి'వి. ఆ తర్వాత 'తెలుగు మహిళ'వు. ఇతరులు ఏయే సందర్భాలలో, ఏయే పేర్లు పెట్టి నిన్ను పిలిచినా ఇంతకు మించిన గుర్తింపు నీకు అవసరం లేదు. మనలో ఎవరికైనా ఆ గుర్తింపును దాటి, కులమత, ప్రాంతాల పేర్లతో "గుర్తింపు" అక్కర్లేదు అని చెప్పాను.

"అమ్మయ్య" అని ఒక్కసారి నిట్టూర్చింది. వెనకటికొక పిపీలికం తానెవరో తెలియక, ఎక్కడెక్కడో తిరిగి, ఎవరెవరినో కలిసి సమాధానం అన్వేషించి, చివరికొక మునీశ్వరుడు "నువ్వొక చీమవు" అని చెప్పినప్పుడు అది ఎంత సంతోషపడిందో అంతకు మించిన సంతోషంతో ఫోన్ పెట్టేసింది మా చెల్లెలు.

డా॥డి.ఆర్.కె.ప్రసాద్.

వికాసం



చిన్నవేగానీ... చికాకు పెట్టేవి

కొన్ని పనులు మనకు చిన్నవిగానే తోచినా అవి ఎదుటివారికి చాలా పెద్దగా, అగౌరవపరచినట్టుగా కనిపిస్తాయి. ఎక్కడ పడితే అక్కడ చెవిలో గులిమి తీసుకోవడం, ముక్కుల్లో వేలు పెట్టుకోవడం, అవే చేతులతో షేక్ హేండ్ ఇవ్వడం, నోటికి అడ్డం పెట్టుకోకుండా ఆవలించేయడం, ఎదుటివారి మీద తుమ్మడం, దగ్గడం, పళ్లల్లో పుల్లలు పెట్టి కెలకడం వంటివి మనం రోజూ ఎన్నో చూస్తూ ఉంటాం. కొన్నిటితో ఎదుటి వారు మనల్ని బాధపెడితే మరికొన్నిటితో మనం వారిని బాధపెడతాం.

ఆ... ఏముంది మన సౌఖ్యం మనది. ఎవరేమనుకుంటే మనకేంటి అనుకునేవాళ్లు కొందరుంటారు. కానీ అవే పనులు ఎదుటి వాళ్లు చేస్తే మాత్రం మనకు రోతగా అనిపిస్తుంది. ఇటువంటి చిన్న చిన్న విషయాలవల్ల రాజకీయ నాయకులు, ఇంకా పెద్దవారు సైతం పెద్ద పెద్ద పరిణామాలను ఎదుర్కొన్న సందర్భాలున్నాయి.

ఎదుటివారికి ఇబ్బంది కలగకుండా ఉండే మన ప్రవర్తనే సత్ప్రవర్తనకు కొలబద్ద. అలా చూస్తే చాలా మంది సత్ప్రవర్తన లేనివారి జాబితాలోకే చేరిపోతారు.

బిగ్గరగా...మరింత బిగ్గరగా...

బేవ్ బేవ్‌మని తేన్చుతూ పరమానందాన్ని పొందుతారు. ఆ తేన్పులను ఎదుటివారు చచ్చినట్టు భరించాలి. కొందరు (పెద్ద పెద్ద హోదాలలో ఉన్నవారూ దీనికి అతీతులు కారు) మాట్లాడుతుంటే తుంపరలు ఎదుటి వారి మీద పడుతుంటాయి. దానివల్ల వారు ఎంత ఇబ్బంది పడుతున్నారో ఆలోచించరు. ఇక కొందరు మాట్లాడుతుంటే సహించలేని దుర్వాసన వచ్చేస్తుంది. తట్టుకోలేక వెనక్కు జరుగుతున్న కొద్దీ మరీ దగ్గరికి వచ్చి మాట్లాడతారు. మరి కొందరు బిగ్గరగా మాట్లాడుతుంటారు. పక్కనే కూర్చున్నా ఆమడ దూరంలో ఉన్నట్టుగా మాట్లాడుతుంటారు. దీని వల్ల పక్కనున్న వాళ్లకు ఒక్కోసారి తలనొప్పి కూడా వస్తుంది. ఇంకొందరు ఎక్కడపడితే అక్కడ చేతులు వేసి రుద్దుతూ మాట్లాడుతుంటారు. మధ్య మధ్యలో వీపుమీద చరుస్తుంటారు. ఎదుటి వారి వీపు వాచిపోవలిసిందే ఇంక. అదొక సరదా వారికి. ఆ సరదా ఎదుటివారిని ఎంత ఇబ్బంది పెడుతుందో ఆలోచించరు వాళ్లు. పక్కన చిన్న పిల్లలు, మహిళలు ఉన్నారు, వారికి వినిపిస్తే బాగోదు అన్న జ్ఞానం లేకుండా మాట్లాడుతుంటారు మరికొందరు. ఎదుటివారికి వికారం కలిగి అక్కడి నుంచి వెళ్లిపోవాలనిపించేంత రోతగా ఉంటాయా మాటలు.

జీడిపాకం

కొందరు పట్టుకుంటే వదలరు. వారు మాట్లాడేదానిలో అవసరమైన విషయమేమీ ఉండదు. కానీ గంటల తరబడి మాట్లాడుతూనే ఉంటారు. వాక్చాతుర్యంలో నిజంగా పండితులు కూడా అలా మాట్లాడరేమో అనిపిస్తుంది. 'వీరికి పని ఏమైనా ఉందేమో, నేను వీరి పనిని చెడగొడుతున్నానేమో' అనే ధ్యాస కాస్తయినా ఉండదు వీరికి. అలా ఉంటే ఇంక వారి గురించి ప్రత్యేకంగా చెప్పుకోవలసిందేముంది!

ఒకటా రెండా...

ఎక్కడపడితే అక్కడ ఉమ్మి వేయడం, కళ్లను నలుపుని పుసులు తీయడం, పెదాలను చేతితో తడిమి శుభ్రం చేసుకోవడం, నోట్లో వేళ్లు పెట్టి కెలకడం, గోళ్లు కొరకడం, ఎవరింటికైనా వెళ్తే చెప్పులు విప్పకుండానే లోపలికి వెళ్లడం, పెద్దగా పరిచయం లేకపోయినా ఇల్లంతా తిరగడం, వారి వస్తువులు అనుమతిలేకుండా ముట్టుకోవడం, వెళ్లిన దగ్గర శుభ్రత పాటించకుండా వారు ఇచ్చిన తినుబండారాలను ఇంటినిండా చేయడం, ఇల్లంతా స్టూళ్లు, కుర్చీలు పరవడం, చనువు తీసుకుని నడుం వాల్చడం, వెళ్లిన చోట తలుపులు దబాదబా బాదేయడం, ఇంటికి వచ్చిన అతిథులు గుమ్మం దాటకముందే దబాలున తలుపులు వేసుకోవడం, నిద్రపోతున్న వారిని లేపి డిస్టర్బ్ చేశానా? అని అడగడం, బస్సులు, రైళ్లు ఎక్కేప్పుడు తోటి ప్రయాణికులతో అమర్యాదగా ప్రవర్తించడం, మోచేతులతో కుళ్ల పొడవడం, కాళ్లు తొక్కడం, స్త్రీలకు, వికలాంగులకు కేటాయించిన సీట్లను వారికే వదిలేద్దాం అనే మర్యాద లేకపోగా స్త్రీలను ఎ్కడబడితే అక్కడ తాకడం, బస్సు ఎక్కగానే పక్కవారిమీద తలవాల్చి గురక పెట్టి మరీ నిద్రపోవడం, కాస్త పరిచయానికే వయసు, జీతం దాకా మాటలు సాగదీయడం, ఎప్పుడైనా మన స్కూలు ఉపాధ్యాయులు కనపడితే కనీసం నమస్కరించకపోవడం, ఎంత మంది ఉన్నా సరే ముక్కులనిండా నస్యం పెట్టుకుని తుమ్ములు తుమ్మడం, లైబ్రరీల్లోనూ, ఆసుపత్రుల్లోనూ సెల్‌ఫోన్లను సైలెంటు మోడ్‌లో పెట్టుకోకుండా పక్కవారికి చికాకు కలిగించడం, ఎదుటి వారి సహాయం తీసుకుని కృతజ్ఞతలు తెలియజేయకపోవడం, మనవల్ల ఎదుటి వారికి ఇబ్బంది కలిగినప్పుడు సారీ చెప్పకపోవడం, వారాల కొద్దీ అవే బట్టలు, సాక్సులు వేసుకుని చెమట గబ్బుతో ఎదుటివారిని బెదరగొట్టడం, తాగేసి నానా బూతులు మాట్లాడడం, సిగరెట్టు తాగి గుప్పుగుప్పుమని ఎదుటివారి మీద పొగ వదలడం, ఎక్కడపడితే అక్కడ ముక్కు చీదేసి దేనికిపడితే దానికి రాసేయడం వంటివి ఎన్నో ఎదుటి వారికి అసహ్యం పుట్టించే పనులు చేస్తుంటారు.

ఇటువంటివన్నీ ఒకరు చెప్పరు. ఏ పుస్తకాల్లోనూ ఉండవు. మనంతట మనమే నేర్చుకోవాలి.



పసివయసులోనే...

అయితే ఇటువంటి విషయాలను చాలా వరకు తల్లి పిల్లలకు నేర్పించగలదు. వారు చిన్నప్పుడు ముక్కులో వేళ్ల పెట్టుకున్నా, పది మందిలో తాకకూడని అవయవాలను తాకినా అది తప్పు అని మందలిస్తుంది. అయితే ఇటువంటి విషయాలను చిన్నప్పుడు చెప్తేనే ఉపయోగం. పెరిగిన తర్వాత అంతగా అబ్బవు. ఇటువంటి విషయాలను అంతకుముందైతే స్కూల్లో కూడా చెప్పేవారు. కానీ ఇప్పటి కాన్వెంటుల్లో డ్రెస్, టై, షూస్ సరిగా వేసుకున్నారా లేదా అని చూస్తారే తప్ప అటువంటివేవీ పట్టించుకోరు. అందుకే కాబోలు ఎంత చదువుకున్నా కొంతమందిలో ఈ వెకిలి చేష్టలు కనపడుతుంటాయి. ఎదుటి వారికి ఇబ్బంది కలుగుతుందేమో అన్న స్పృహ వారికి ఉండనే ఉండదు. మనం జంతువుల నుంచి పరివర్తన చెంది మానవులుగా మసలుతున్నా ఆ చేష్టలు వదిలించుకోకపోతే ఎలా! నలుగురిలో తక్కువ చేసే గుణాలను ప్రయత్నపూర్వకంగా సంస్కరించుకోవాలి.

మర్యాదను ఇంగ్లీషులో ఎటిక్వెట్టి అని అంటారు. గ్రీకు భాషలో ప్రోటోకల్లన్ అనే పదం దీనికి సమానార్థం వచ్చే పదం. దీని నుంచే ప్రొటోకాల్ అనే మాట పుట్టింది. ఆయా సందర్భాలకు తగ్గట్టుగా ప్రవర్తించే తీరును చెప్పే నియమావళిని చెప్పేదాన్ని ప్రొటోకాల్ అంటారు. సంస్కృతి సంప్రదాయాల నుండే ఇవి పుట్టాయి. ఆధునిక పాశ్చాత్య సాంప్రదాయాల్లో అతిథులనూ, స్నేహితులనూ గౌరవించడం చాలా ముఖ్యమైన విషయం. ఆయా సందర్భాలకు తగ్గట్టుగా దుస్తులు వేసుకోవడం, అతిథులకు ఎటువంటి లోపాలూ లేకుండా చూసుకోవడం, మాట్లాడడం ఆ మర్యాదల్లో ఒక భాగం. వారి సమావేశస్థలాల్లో, వేడుకల్లో, క్లబ్బుల్లో పాటించవలసిన నియమాలు ఎన్నో ఉన్నాయి.

క్రీస్తు పూర్వం నుంచే మర్యాదలు

నలుగురిలో ఎలా ఉండాలి? అనే విషయంపై ఇప్పుడు కాదు, క్రీస్తు పూర్వం నుంచే చర్చలు సాగుతున్నాయి. ఈజిప్టులో క్రీస్తు పూర్వమే డీడకేర్ పరిపాలనా ఆస్థాన ఉన్నతాధికారి ప్రవర్తనా నియమావళిని రూపొందించాడట. గ్రీసు, రోమ్ నాగరికతలన్నింటిలోనూ ఈ స్పృహ ఉంది. క్రీస్తు పూర్వం 5వ శతాబ్దికి చెందిన చైనా తత్వవేత్త కన్ఫ్యూషియస్, మనిషి నడవడి ఎలా ఉండాలో నిర్దేశించాడు. మనిషి ఎలా తినాలి? ఎలా మాట్లాడాలి? ఎలా ప్రవర్తించాలి? అనే విషయాల గురించి ఆయన ఉపదేశాలలో మనం చూడొచ్చు. బుద్ధుడు కూడా ప్రవర్తన విషయంలో ఎన్నో జాగ్రత్తలు చెప్పేవాడు. ఇక ఆధునిక కాలంలో జెంటిల్‌మేన్ అంటే ఎలా ఉండాలో కొందరు రాశారు. బాల్డస్సరె కాస్టిగ్లియోన్ అనే ఆయన 16వ శతాబ్దంలో రాసిన ప్రవర్తనా నియమావళి గ్రంథం మొదటి ప్రపంచయుద్ధం వరకూ ప్రామాణికమై ఉంది. పద్నాల్గవ లూయి ఆస్థానప్రవర్తనా నియమావళిని రూపొందించారు. అయితే తాను మాత్రం దానిని పాటించేవాడు కాదట. బెంజమన్ ఫ్రాంక్లిన్, జార్జ్ వాషింగ్టన్ వంటివారు పిల్లల కోసం ప్రవర్తనా నియమావళిని రాశారు. ఎలియాస్ రాసిన పుస్తకాలు ఐరోపా మర్యాదలకు అద్దం పడతాయి. జుడిత్ మార్టిన్ రచనలు కూడా బాగా పేరుపొందాయి. బ్రిటీషువారి సాంగత్యం వల్ల మనకూ వారి అలవాట్లు కొన్ని అబ్బాయి. మన కోర్టులు, శాసనసభలు, పార్లమెంటు వంటి వాటి చోట్ల మనం పాటించే నియమావళి ప్రధానంగా ఇంగ్లీషు వారి నుండి నేర్చుకున్నదే. డబ్బున్నందువల్లో, చదువున్నందువల్లో మంచీ మర్యాదా అలవడాలని లేదు. సమయపాలన కూడా మంచీ మర్యాదల కోవలోకి చెందినదే. వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడే సత్ప్రవర్తన, మర్యాద వంటివి చదువుతోపాటు శ్రద్ధగా నేర్చుకోవలసినవి.

మంచి అలవాట్లు

♦గట్టిగట్టిగా మాట్లాడడం, బిగ్గరగా అరవడం మంచి అలవాటు కాదు.

♦అంగవైకల్యం కలవారి పట్ల, బలహీనుల పట్ల ఆదరణగా ఉండాలి.

♦ఇంటికి వచ్చినవారికి ముందు మంచినీళ్లు ఇవ్వడం, ఇంకా ఇవ్వగలిగిన వాళ్లు మజ్జిగ, జూస్ లాంటివి ఇవ్వడం మంచి అలవాటు.

♦ఎవరినైనా ఏదైనా అడగవలసి వస్తే 'దయచేసి' అనిగానీ, ప్లీజ్ అని గానీ 'ఫలానాది ఇస్తారా' అని మర్యాదగా అడగాలి.

♦ఎవరి దగ్గరైనా సాయం పొందినప్పుడు కృతజ్ఞతలు తెలియజేయాలి. లేదంటే థాంక్యూ అని చెప్పాలి.

♦ఎదుటివారు కృతజ్ఞతలు తెలియజేసినప్పుడు తప్పకుండా ఫర్వాలేదు అని చెప్పాలి.

♦ మన నడవడిక వల్ల ఎవరికైనా ఇబ్బంది కలిగినప్పుడు 'క్షమించండి' అని గానీ 'మన్నించండి' అని గానీ చెప్పాలి.

♦ఎదుటివారికి బాధ కలిగే విధంగా మాట్లాడకూడదు. ర్యాగింగు చేయడం వల్ల చేసేవారికి ఆనందం కలుగుతుందనుకుంటారు. కానీ అవతలివారిని బాధపెడుతూ ఆనందిస్తే అది పైశాచికమవుతుంది.

సినిమాల్లోనూ...

మన తెలుగు సినిమాల్లో చాలా వాటిల్లో అమ్మాయిలను ఏడిపించడం, ర్యాగింగు చేయడం, బలవంతంగా లాగి ముద్దు పెట్టుకోవడం, రెండర్థాల మాటలు మాట్లాడడం, సిగరెట్టు తాగడం, మందు కొట్టడం వంటి వాటిని హీరోయిజంలా చూపిస్తారు. వావివరుసలు లేకుండా అల్లుళ్లతో అత్త పాత్రల మీద వెకిలి చేష్టలు చేయించడం చేస్తున్నారు. హీరో విలన్ ఇంటికెళ్లి అదో వింత భాషలో డైలాగులు చెప్పడం వంటివి ప్రస్తుతం ప్రతి సినిమాలోనూ చూస్తున్నాం.

నోరు మంచిదైతే ఊరంతా స్నేహితులేనంటారు. మంచి ప్రవర్తనే మనిషికి అలంకారమంటారు. నోటి దురుసుతో ఏమీ ఆలోచించకుండా మాట్లాడడం వల్ల స్నేహితులను కోల్పోతారు. ఎన్నో ఇబ్బందులను ఎదుర్కోవలసి వస్తుంది. అందుకే సత్ప్రవర్తనను అలవరచుకుందాం.

★

తరిగిపోతున్న అనుబంధాలు

- తమ్మెర రాధిక

ప్రవీణను పురిటికి తీసుకొస్తున్నారు. ఆమె పడుకోవడానికి వీలుగా భాస్కరమూర్తి గదిలో నవారు మంచం వేసి, పక్కన చిన్న బల్ల వేశారు. మందులూ అవీ పెట్టుకోడానికి వీలుగా. ఇంట్లో వున్న చిన్న స్టోర్రూముని భాస్కర్ వాళ్ల పడకగదిగా సర్దుకున్నారు. చెల్లెలికి తొమ్మిదో నెల వస్తుందని సూడిదలు చేసి అత్తగారింట్లో ఒడి నింపాక పురిటికి వెంట పెట్టుకొస్తున్నది తల్లి. భాస్కర్‌కి ఇదంతా ఏంటో నాన్సెన్స్ అనిపిస్తోంది. "హాయిగా ఆస్పత్రిలో డెలివరీ అయి ఎవరింటికి వాళ్లు వెళ్లక ఏంటీ పుట్టింట్లో మూణ్ణెళ్ల రెస్టూ, ఇంట్లో వాళ్లకీ చాకిరీని. చేసే వాళ్లకు చిరాకులూ పరాకులూను" అని భాస్కర్ మనసులో అనుకుంటూ వుండగానే ఫోన్ మోగింది.

"హలో" అన్నాడు.

"హలో మూర్తీ, నేన్రా అమ్మని. ప్రవీణకు వాళ్లింట్లోంచి బయలు దేరినప్పుడు బానే వుంది. మనూళ్లోకి వచ్చేసరికి నొప్పులు మొదలయ్యాయి. అందుకని జిన్నా సెంటర్ దగ్గర దిగాము. హాస్పిటల్ ఇక్కడికి దగ్గరేగా! డాక్టర్‌గారు పురుడు వస్తుందని చెప్పి లోపలికి తీసుకుపోయారు. అందుకే నీకు ఫోన్ చేస్తున్నా" అంది తల్లి. హాస్పిటల్ పేరు కనుక్కుని ఫోన్ పెట్టేసి ఫ్లాస్కు వెతికి వేణ్ణీళ్లు పెట్టి దాన్లో పోసుకుని బయలుదేరాడు.

భాస్కర్ వెళ్లేసరికి ఆడపిల్ల పుట్టిందనే కబురు రెడీగా వుంది. వెళ్లి చెల్లెల్ని, చంటి పిల్లని చూసి తల్లిదగ్గరికి వచ్చాడు.

"రమకి ఫోన్ చేశాన్రా. సాయంకాలం ఆఫీసు నుంచి వస్తూ, ఇటొచ్చి చూసి పోతానంది" కొడుకుని చూసి అంది సీతమ్మ.

"వారం రోజులు ఇక్కడే వుంచి, పదోనాడు ఇంటికి తీసుకొచ్చి బారసాల చేసి వెంటనే పంపేస్తే సరిపోతుంది కదమ్మా" అన్నాడు. కొడుకు ఆలోచనకు ఆవిడ ఆందోళన పడింది. వీడేంటిలా పిల్ల పురిటికొస్తుందని చెప్పిన దగ్గర్నించీ తొందరగా పంపించేద్దాం, మూడు నాలుగు నెలలు రెస్టు అని చాదస్తం పెట్టుకోకు, మమ్మల్ని ఇబ్బంది పెట్టకు అంటున్నాడు అనుకుంది. తండ్రికి పక్షవాతం వచ్చి తగ్గింది. ఆయన్ని రోజూ అటూ ఇటూ నడిపించాలి. సపర్యలు చేయాలి. అది పోనూ చెల్లెలి చాకిరీ వుంది. ఆమె కోసం, చంటిపిల్ల కోసం ఆమె అత్త వారింటి బంధువులు వచ్చి పోతుంటారు. అదో చాకిరీ. వీటన్నింటి వల్ల తల్లి ఆరోగ్యం ఎక్కడ అపసవ్యం అయిపోతుందోనని అతని భయం. సీతమ్మ ఏం మాట్లాడలేదు. ఇంటికెళ్లాక ఇదంతా కోడలి చేతిలో నిర్ణయించబడుతుందని ఆమె ఊహ. ఒక రకంగా కొడుకు మాటల్లో నిజం లేకపోలేదు. కానీ కూతురి అత్తగారేమనుకుంటుందో! తననెలా అర్థం చేసుకుంటుందో! ఎక్కడా లేని విడ్డూరమని అందర్లో దెప్పితే ఎలా జవాబు చెప్పగలం? అమ్మాయినెలా సముదాయించగలం?

సమస్యలు వేధిస్తున్నా కాలం ఆగలేదు. వారం రోజులు గడిచిపోయాయి. ప్రవీణని తీసుకొచ్చి భాస్కర్ గదిలో పక్క వేశారు. రోజూ ఆఫీసునుండి ఇంటికొస్తూనే చెల్లెలి బంధువులెవరు వచ్చారు? ఏం వండి వార్చారు? ఇంట్లో మార్పులు చేర్పులేంటని? కళ్లతోనే ఎంక్వయిరీ చేసేవారు భార్యాభర్తలిద్దరూ. సీతమ్మ గుండె బితుకూ బితుకూమనేది, ఎవరైనా ఇంటికి వచ్చిపోయిన రోజు. మొత్తానికి బారసాల అయిపోయింది. "ప్రవీణా! నాన్న ఆరోగ్యం చూశావు కదా! ఆయనకు చాకిరీ చెయ్యలేక అమ్మ సతమతమవుతున్నది. ఇటు చూస్తే నువ్వు బాలింతవు. కాస్తో కూస్తో నీపనీ తప్పదు. మధ్యలో వచ్చిపోయే నీ అత్తింటి వాళ్లు... ఎవరికేం మర్యాద లోటయినా నువ్వూ, నీవాళ్లూ బాధపడక తప్పదు. కనుక నీ ఇంటికి వెళ్లే విషయం బావతో చర్చించుకో. నేనిలా అంటున్నానని తప్పుగా అనుకోకు" అన్నాడో రోజు. తలుపు చాటునుంచి ఇదంతా విన్న సీతమ్మ వంటింట్లోకి వెళ్లి కళ్లు తుడుచుకుంది బాధగా. ప్రవీణ అన్నయ్య మాటలకు బిత్తరపోయినట్లయి ఎర్రగా కందిపోయిన ముఖంతో చంటి పిల్లని ఒళ్లో పెట్టుకుని అలాగే కూర్చుండిపోయింది.

"ప్రవీణా, మారుతున్న కాలంతో పాటు మనం మారడం నేర్చుకుంటేనే బతకగలుగుతాం. అమ్మ శ్రద్ధ తీసుకుని నాన్నకు చేస్తేగానీ ఆయన త్వరగా కోలుకుని ఈ పిల్లలకు ట్యూషన్లు చెప్పగలుగుతాడు. దాంతో నేను ఇంకో పని చేసుకోగలుగుతాను. అమ్మ రమకూ కాస్త పన్లో సాయపడితే ఆమె కూడా ఆఫీసు పనే కాక ఇంకేమయినా చేసి నాలుగు రాళ్లు సంపాయిస్తే మా పిల్లలకు ఆసరాగా వుంటుంది.

అన్నా వదినలు భోజనాలు చేసి ఆఫీసుకు వెళ్లాక, మనవరాల్ని చూస్తానంటే చంటిదాన్ని పొత్తిళ్లలోకి తీసుకుని భర్త దగ్గరికి తీసుకుని పోయింది సీతమ్మ. ప్రవీణ అక్కడే కుర్చీ లాగి కూర్చుని ఆలోచిస్తోంది భాస్కరన్నయ్య మాటల్లోని గాఢతని.

"ఇంట్లో బామ్మలాంటి పెద్దవాళ్లు వుండివుంటే ఇప్పుడు మూర్తిగాడన్న మాటలకు తల వాచేలా చీవాట్లు పెట్టేవాళ్లు. ఇంకోసారలా మాట్లాడ్డానికి ధైర్యం చెయ్యకుండా" అంది కూతురితో సీతమ్మ.

"మీరు కాదా పెద్దవాళ్లు?" ప్రశ్నించింది ప్రవీణ. గతుక్కుమందావిడ. చెల్లెల్ని అలా ఎందుకన్నావని నిలదీయలేదని పిల్లగానీ మనసులో పెట్టుకుందా ఏంటని సీతమ్మ ఒక్క క్షణం ఊర్కొని-

"మా రోజుల్లో పురిటి కోసం పుట్టింటికి వస్తే ఎంత అపురూపం చేసేవారో" అంది. ఈమెకు గతంలోని తన పురిటి రోజులు గుర్తొచ్చాయి. తను నెలలు నిండి పురిటికి పుట్టింటికి వస్తానంటే ఇంటి ముందు ఎడ్లబండి నిలిపి, దాంట్లో అమ్మాయి కూర్చుంటుందని మెత్తటి బూరుగు దూది పరుపు వేసి, నీళ్ల మరచెంబూ, ఫలహారాల గంపా, పళ్లబుట్టా పంపేవారు. పుట్టింటిముందు బండి ఆగడమాలస్యం రావమ్మగారు వచ్చి ఎర్రనీళ్లతో దిష్టి తీసేది. దిగడానికి చెక్కబల్ల వేసి చెయ్యి పట్టుకుని జాగ్రత్తగా దింపి ఈడైన వాళ్లంతా సరసోక్తులు ఆడేవారు. సున్నిపిండితో నలుగుపెట్టి వేడి వేడి నీళ్లతో కుంకుడుకాయ పులుసుపోసి తలంటి స్నానం చేయించి, లోపలికి తీసుకుపోయి మంచం మీద పడుకోబెట్టి, కొబ్బరి చిప్పలో గుగ్గిలం వేసి మంచం కింద పెడితే ఆ వాసన తలవెంట్రుకల్లో

చిరు వేడిగా కమ్ముకొస్తుంటే ఒళ్లు గాల్లో తేలిపోయి స్వర్గం కనపడేది. ఇదంతా అయ్యేలోగా బామ్మ మడికట్టుకుని వంట చేసేది. రావమ్మగారూ, అమ్మా ఇద్దరూ కలిసి బాదమాకులు కోసి పది పదిహేను దాకా విస్తళ్లు కుట్టేవారు. వరుసగా వసారాలో విస్తళ్లు వేసి వడ్డన చేసేవాళ్లు. సీతకు మాత్రం చల్ల చిలకడానికి వేసుక్కూర్చునే పీట వేసి, ఆరోగ్యానికి మంచిదని అరిటాకు వేసేవారు. వేడి వేడి అన్నం, చింత చిగురు పప్పూ, వంకాయ పూర్ణం, బచ్చలాకు వేసిన చల్లపులుసూ వేసి నెయ్యి వడ్డిస్తుంటే నిదానంగా తినేది. ఎవరో ఆమె చెయ్యి కడుక్కోడానికి విస్తరి పక్కన గిన్నె పెడితే కడుక్కుని వక్కపొడి నోట్లో వేసుకుని పోయి పడుకునేది. బడలిక వల్లో, కమ్మని భోజనం వల్లోగానీ గాఢ నిద్రపట్టేది. ప్రతిరోజూ ఆమె పడుకునే గదిలో బామ్మో, రావమ్మగారో సీతకు తోడు పడుకునేవారు. బామ్మ మంచి మంచి కథలు చెప్పుండేది రోజూ రాత్రిపూట. రావమ్మగారు ఎప్పుడడిగినా కమ్మగా పాటలు పాడేది. మధ్యలో ఎప్పుడైనా మావగారూ, భర్తా వస్తే చిన్న సైజు హంగామా ఆర్భాటమూనూ. ఊళ్లో చుట్టాలందరూ ఇంట్లో పోగు పడేవారు. ఆడపడుచులూ, అత్తగారూ, ఆవిడ అత్తగారూ... ఇలా విరామం లేకుండా సీత పురుడుపోసుకునే వరకు మధ్య మధ్యలో వస్తూనే వుండేవారు.

పురుడు, పదకొండోరోజు, బారసాల అయ్యాక ఎక్కడి వారక్కడికి వెళ్లి పోయాకనే ఇంట్లోవాళ్లకి విశ్రాంతి. భాస్కర్ పుట్టాక అత్తారింటికి పోవాలంటే ఒక బండ్లో తనూ చంటాడు, ఇంకో బండ్లో బారసాలకు వచ్చిన బట్టలూ, కానుకలూ, పిండివంటలూ, రకరకాల మూలికలు వేసి తయారు చేసిన పత్యాలు, ఔషధాలూ వుండేవి. అత్తవారింటికి పోతుంటే చంటి పిల్లాడితో ఎలా చేసుకుంటుందోనని బాధపడ్డారే కానీ ఏనాడు ఇంత చాకిరీ ఎందుకని విసుక్కోలేదు. సీత వెళ్లిన పదిరోజులకే బామ్మ రకరకాల పచ్చళ్లు పట్టించుకుని రావమ్మగార్ని తీసుకుని వచ్చేది. చంటి పిల్లాడికి కుళ్లాయిలూ, చొక్కాలూ తను స్వయంగా కుట్టి తెచ్చేది. ఆముదాలు దంచి చేయించిన వంటాముదం, ఇంట్లో చేసిన సాదు ఇలా ఎన్ని తెచ్చేదో! అత్తగారు వాళ్ల బామ్మని ఎంత మర్యాదగా చూసేవారు. ఒకరికొకరు అండగా ఆప్యాయంగా వుండేవారు. రెండో కాన్పులో ప్రవీణ పుట్టాక సీత అత్తగారూ మావగారూ యాత్రలకెళ్తూ మార్గం మధ్యలో చనిపోయారు.

సీత భర్త రాఘవకు ఆస్తి వివరాలు పెద్దగా తెలియవు. చాలా వరకు ఆస్తి అప్పుల్లో, తాకట్టులో వుందని తెలిసి బామ్మగారు, వాళ్లూ నెత్తీనోరూ కొట్టుకున్నారు. ఇల్లు తప్ప ఏమీ మిగల్లేదు. ఆ అఘాతానికి సీత తండ్రి గుండెపోటు వచ్చి పోయాడు. పెద్దగా చదువులేని రాఘవ పిల్లల పెంపకానికీ, చదువుకూ ఎన్నో కష్టాలు పడ్డాడు. ఏ చుట్టమూ ఆదుకోలేదు. బామ్మ కాలం చేశాక ఉన్న కొద్ది ఆస్తి అమ్మి తల్లి వచ్చి సీత పంచన చేరింది. ఆ సొమ్ముతోనే ప్రవీణ పెళ్లి చేయగలిగారు. కష్టాల రాపిడిలో రాటుదేలిన భాస్కర్ మనిషిని ముంచే సాంప్రదాయాలూ, ఎదుటి వాళ్లను ఇబ్బందుల్లో పడేసే ఆచారాలూ ఇష్టపడడు. ముందు మనం బాగుండాలి, ఆ తర్వాత బాగుపడ్డ మనం ఎదుటి వాళ్లను ఆదుకోవాలనే మనస్తత్వం వున్నవాడతను. కొడుకు గురించి పూర్తిగా తెలిసినా ఎందుకో సమాధాన పడలేకపోతోంది సీతమ్మ.

"అమ్మా నాన్నని రెండ్రోజుల్నుంచి నడిపించడం లేదు నువ్వు. ఎంతసేపూ మనవరాలి సేవలో మునిగిపోతే ఎలా? నాన్నని కూడా చూసుకోవద్దా?" ఎంతో విసుగ్గా అన్నాడో రోజు భాస్కర్. అతనికి ఆఫీసు టైం అవుతోంది. మార్కెట్ నుంచి కూరగాయలు తెచ్చి ఫ్రిజ్ ముందు కుమ్మరించాడు. రమ వంటకాలు టేబుల్ మీద సర్దుతూ అత్తగారి వైపు సీరియస్‌గా చూసింది.

"కాస్త ఇలా వచ్చి సాయం చేయొచ్చుగా. మాకు లేటయితే అవతల బస్సులు దొరకవు" అంది. ప్రవీణ అసహాయంగా చూసి, తల్లి చేతుల్లోంచి పిల్లని అందుకుని – "పోమ్మా, పని చూసుకోపో. చంటి దాన్ని దగ్గరికి తీస్తే రేపటి రోజున కష్టం. పెరిగి పెద్దయి నీ దగ్గరే వుంటానంటుంది" అంది విసురుగా.

"ఆ మాటా నిజమేలే... అన్నీ అమ్మమ్మ చూస్తుంది లెమ్మని సోమరిగా తయారైతే కష్టం" అంది రమ ఆడబిడ్డ మాట తిప్పికొడుతూ. సీతమ్మకు రమను చూస్తుంటే ఈ మధ్య ఆశ్చర్యం వేస్తోంది. రమ తన పెదనాన్న కొడుకు కూతురు. వాళ్లమ్మ తనను సొంత ఆడపడుచులా ఎంతో గౌరవించేది. భయభక్తులతో మెలిగేది. ఆ పద్ధతి చూసే భాస్కర్‌కి చేసుకున్నారు. తీరా ఇప్పుడిలా అసహనంగా ప్రవర్తిస్తుంది.

భాస్కర్ ముందు గదిలో ఇరవైమంది పిల్లలకు ఇంగ్లీషు ట్యూషన్ చెప్తున్నాడు. ఆఫీసు నుండి రాగానే కాఫీ తాగి పిల్లల దగ్గర కూర్చుంటే రాత్రి ఎనిమిదింటికి లేస్తాడు. ఇంటి ముందు ఆటో ఆగింది. దాంట్లోనుండి ప్రవీణ భర్త దిగడం చూసి లేచి గేటు దగ్గరికొచ్చాడు. "రండి బావగారు.. ఫోను చెయ్యకుండానే వచ్చారే" అంటూ నవ్వాడు.

"ఆఁ... ఆఁ... ముందుగా చెప్తే రానిస్తారో రానివ్వరోననీ" అనంతరాం మాటలకు నవ్వుతూ చెయ్యిపట్టి లోనికి తీసుకొచ్చాడు.

రాత్రి భోజనాల సమయంలో చెప్పాడు అల్లుడు. ప్రవీణను రేపు తీసుకుపోతున్నాను. నాకు తను లేకపోతే భోజనానికి ఇబ్బంది అవుతుంది" అన్నాడు.

"ఇంకా చంటి పిల్లకదా! సవరించుకోవడం రావద్దూ దానికి" కొడుకు వైపు భయంగా చూస్తూనే కూతురుకు సపోర్టుగా అంది సీతమ్మ.

"బావుంది... మా అమ్మ నాకు వండిపెడుతూ నా దగ్గర కూర్చుంటే ఊళ్లో పాడీ పొలం ఎవరు చూసుకుంటారు? నాన్న ఒక్కడు ఏం వండుకు తింటాడు? మీ అమ్మాయైనా ఒక్కత్తి పిల్లని పెంచడం నేర్చుకుంటే రేపు ఆఫీసుకెళ్లినా ఆయాకప్పచెప్పి అయిదారు గంటలు వుండగలుగుతుంది"

అల్లుడి మాటలకు "ఆయాకా!" అంటూ ఆశ్చర్యపోయింది సీతమ్మ.

"అదే అత్తయ్యా, ఆఫీసుల్లో ఇప్పుడు పిల్లల్ని చూసుకోవడానికి ఆయాల్ని వుంచుతున్నారు. మనం నెలకింతని ఇస్తే మన కళ్లెదుటే ఉంటుంది పాప. మనం మధ్యమధ్యలో వెళ్లి చూసుకోవచ్చు" అంది రమ. మర్నాడు ప్రవీణ ప్రయాణమై పోతుంటే గదిలోకొచ్చాడు భాస్కర్. అన్నయ్యను చూస్తుంటే మనసులో కోపం వున్నా మౌనంగా బట్టలు సర్దుకుంది.

"ప్రవీణా!" చిన్నగా పిల్చాడు. అతని చేతిలో చిన్న కవరుంది. దాన్ని ఆమెచేతిలో వుంచి "ప్రవీణా, మారుతున్న కాలంతో పాటు మనం మారడం నేర్చుకుంటేనే బతకగలుగుతాం. అమ్మ శ్రద్ధ తీసుకుని నాన్నకు చేస్తేగానీ ఆయన త్వరగా కోలుకుని ఈ పిల్లలకు ట్యూషన్లు చెప్పగలుగుతాడు. దాంతో నేను ఇంకో పని చేసుకోగలుగుతాను. అమ్మ రమకూ కాస్త పన్లో సాయపడితే ఆమె కూడా ఆఫీసు పనే కాక ఇంకేమయినా చేసి నాలుగు రాళ్లు సంపాయిస్తే మా పిల్లలకు ఆసరాగా వుంటుంది. ఇంతమందిమి కష్టపడితేనే అందరం బాగుంటాం. ప్రస్తుత రోజులు ఆర్థిక మాంద్యం కోరల్లో చిక్కి శల్యమైపోతున్నాయి. అందుకని సాంప్రదాయం పేరిట ఎవ్వరినీ బాధపెట్టొద్దు. అందరికీ అనువైన, వీలైన రోజుల్లో కలుసుకుని సంతోషపడడమే ఇప్పటి ఆచారం. ఈ రోజుల్లో పురుడు పోయడం మా బాధ్యత. బారసాల చెయ్యడం సాంప్రదాయం. నెలలోపు పంపడం ఆచారం. ధరలు పెరిగిన ఈ రోజుల్లో కిరాయి కొంపల్లో మందులకూ, తిండికీ తప్ప సామాన్య సరదాలు సైతం ఊహించలేని బతుకుల్లో ఇంతకంటే నేను ఏం చెయ్యలేనమ్మా!" చెల్లెలి చేతులు పట్టుకున్నాడు భాస్కర్. రమ కళ్లలో సన్నటి నీటిపొర.

"నిన్ను బాధ పెట్టుంటే క్షమించు... బావగారికి పరిస్థితంతా చెప్పి ఆయన్ని రమ్మన్నాను. మహానుభావుడు.. అర్థం చేసుకున్నాడు. సుఖంగా వెళ్లిరా!" భాస్కర్ గొంతులోని నిజాయితీ, ప్రేమా ప్రవీణలోని రక్త సంబంధాన్ని తట్టిలేపాయి. అన్న మీదున్న కోపం మంచులా కరిగిపోయింది. నిజమే. ఇవి కరువు రోజులు. ఎవరింటికి వారే బరువైన రోజులు. ఈ ఆర్థిక మాంద్యం ఎవరికి వార్ని ఏకాకిని చేస్తున్నది. దీని బారిన పడకూడదంటే భాస్కరన్న చెప్పినట్టు జీవితంలో క్లుప్తత నేర్చుకుంటే మంచిదని అనుకుంది.

★

తనువు తనిఖీ యంత్రం



పుట్టినపుడు లేదు గిట్టినపుడు లేదు నడుమ బట్టకట్ట నగుబాటు కాదా అన్నాడు నాటి వేమన్న!
అవును తీసివేయాల్సిందే, కనీసం విమానాల్లో అయినా అంటున్నాడు నేటి అమెరికా ఒబామన్న!!
పోయినరోజులే ఎంతో మంచివి. తనిఖీ పేరుతో ఒకప్పుడు ఒళ్లంతా తడుముతుంటే ఇదేం ఖర్మరా బాబూ అనుకొనేవారట. తరువాత పైబట్టలు, బూట్లు విప్పించి నఖశిఖ పర్యంతం చూస్తే సిగ్గుతో చచ్చిపోయారు. ఇప్పుడు వాటితో పాటు లోదుస్తులు(అండర్‌వేర్) కూడా విప్పి చూడకుండా వదిలేది లేదనే రోజులు వచ్చాయ్. అందుకు సిద్ధపడే వారే ప్రయాణాలు పెట్టుకోవాలి మరి. కుటుంబ సభ్యులందరూ కలిసి ప్రయాణించాలంటే మరింత కష్టం. అందర్నీ వరుసపెట్టి విప్పమంటే అంతకంటే అవమానం ఉంటుందా? స్కానర్లలో 3డి రకాలు కూడా ఉన్నాయటండోయ్!!

అవమానం గివమానం జాన్తా నై, బట్టలిప్పుకు తిరగటం మాకేం కొత్తకాదు ఎవరైనా సరే విప్పి చూపాల్సిందే అని చిందులేసిన ఒబామా చివరకు కొంత శాంతించారు. ప్రపంచంలో ఇంకా సిగ్గూ ఎగ్గూ మిగిలి ఉన్నాయని చెబుతున్నారు గనుక మర్యాదస్తులైన ఆడా, మగవారిని లోదుస్తులు విప్పమంటే తేడా వస్తుందనుకుంటే విప్పకుండానే మొత్తం శరీరాలను స్కాన్ చేసి చూడాల్సిందే అని ఆదేశాలు జారీచేసి "తాంబూలాలిచ్చాం తన్నుకు చావండి" అని లుబ్ధావధానుల మాదిరి ప్రకటించేశాడు. ఆయన నందంటే నంది పందంటే పంది అనే బ్రిటన్ ప్రధాని గార్డన్ బ్రౌన్ తదితర కొన్ని ధనికదేశాల నాయకులు స్కాన్ చేయాల్సిందే, స్కాన్ చేయాల్సిందే అని వంత పలికారు. ఇంతకూ ఈ ఘోరకలి ఏమిటయ్యా అంటే ఉగ్రవాదవ్యతిరేక పోరాటంలో ఇలాంటి పనులు తప్పవని సెలవిస్తున్నారు. ఇవన్నీ చూసిన కొంతమంది అసలు విమానాల్లో ఎక్కేవారు బట్టలు వేసుకోకూడదంటే పోతుంది కదా! ఖర్చు తప్పుతుంది అని మండిపడుతున్నారు.

ఈ తీరుతెన్నులను చూసి బట్టలు(వళ్లు) మండిన జర్మనీలోని పైరేట్ పార్టీవారు అక్కడి ముఖ్యమైన విమానాశ్రయాలలో కేవలం పీలికల వంటి దుస్తులను ధరించి "చూసుకోండి ఇంక మాకు స్కానెందుకు ఇప్పటికే పూర్తి నగ్నంగా ఉన్నాం" అని నిరసన ప్రదర్శనలు జరిపారు. "బలవంతంగా మమ్మల్ని స్కాన్ చేస్తే ఉన్నదుస్తులను కూడా విప్పేస్తాం జాగ్రత్త" అని విప్పబోతుండగా మన ఛాన్సలర్ ఏంజలమ్మ వెంటనే అమలు జరపటం లేదు లెమ్మని అధికారులు సముదాయించటంతో అంతటితో ఆగారు. ఈ పార్టీవారికి గత ఎన్నికలలో రెండుశాతం ఓట్లు కూడా వచ్చాయండోయ్.

ఇంతకీ ఈ లోదుస్తుల గురించి ఇంత బహిరంగంగా చర్చించుకోవాలా సిగ్గు సిగ్గు అనుకోకండి. వీటికి ఏటా ప్రపంచంలో 30బిలియన్ డాలర్ల మార్కెట్ ఉంది. అంటే దాదాపు లక్షకోట్ల రూపాయలని చెబుతున్న మన రాష్ట్ర బడ్జెట్‌కు ఒకటిన్నర రెట్లకు సమానం. ఒబామా బృందం నిర్ణయంతో ఇప్పుడు లోదుస్తుల వ్యాపారులంతా చింతా క్రాంతులయ్యారట. ఎందుకంటే విమానాశ్రయాలతో ప్రారంభించిన వారు చివరికి రేపు ఎర్రబస్సుల్లో కూడా స్కానర్లను ఏర్పాటు చేస్తే అసలు అండర్‌వేర్లు వేసుకొనే వారెవరన్నది వారి ఆందోళన.

అసలిదంతా డిసెంబరు25న ఆమ్‌స్టర్‌డామ్ నుంచి అమెరికాలోని డెట్రాయిట్ నగరానికి వస్తున్న ఒక విమానాన్ని అండర్‌వేర్ బాంబుతో పేల్చివేయటానికి ప్రయత్నించి విఫలమైన ఒక నైజీరియన్ యువకుడితో వచ్చిపడిందని చెబుతున్నారు. అతగాడు పేలుడు పదార్ధాలను తన డ్రాయర్‌లో దాచి తేవటాన్ని విమానాశ్రయాల్లో పసిగట్టలేకపోయారట. వాటిని పేల్చేందుకు చేసిన ప్రయత్నాన్ని తోటి ప్రయాణికులు గమనించి పెద్ద ప్రమాదాన్ని నివారించారని అమెరికా పోలీసులు చెబుతున్నారు. అసలు దీన్ని నమ్మటానికి వీల్లేదనేవారు కూడా ఉన్నారు. అసలిదంతా స్కానర్ల కంపెనీలవారి కోసమే అని అనేక మంది కుండబద్దలు కొడుతున్నారు. దీన్ని చూస్తే మన రాష్ట్రంలో ద్విచక్రవాహనాల వారు హెల్మెట్లు పెట్టుకోవాలంటూ చేసిన హడావిడి తీరా కొన్నిలక్షల మంది కొనుగోలు చేసిన తరువాత వాటి గురించి పట్టించుకోకపోవటమూ గుర్తుకు రావటం లేదూ?

ఒబామా నోటంట బాడీ స్కానర్లనే మాట వచ్చిందో లేదో దొరికిందిరా మనకు ఛాన్సు దోచుకుందాం రండి అంటూ "మాదెంత స్పష్టంగా చూపుతుందో చూడండి, అసలు ముందు కొన్నింటిని పెట్టి జనాన్ని చూసిన తరువాత బాగా కనిపిస్తేనే డబ్బులివ్వండి లేకుంటే మా స్కానర్లు మేం తీసుకువెళతాం" అని కంపెనీలవారు బట్టలేసుకొని బారులు తీరారు. ఒక్కొక్క స్కానర్ ఖరీదు కోటి నుంచి కోటిన్నర రూపాయలుంటుంది. ఒక్క అమెరికాలోనే కేవలం విమానాశ్రయాలలోనే కనీసం రెండువేలు కావాలట. అందువల్ల ప్రపంచం మొత్తంలో వాటి మార్కెట్ ఎంత పెద్దదో ఊహించుకోండి. అసలు ఈ స్కానర్లకు ప్లాస్టిక్ వంటి పలుచగా ఉండేవాటిని పసిగట్టే శక్తి లేదని, గతంలో అవి విఫలమయ్యాయన్న 'నగ్న సత్యాలు' వెలుగులోకి వస్తున్నాయి. మన ప్రభుత్వశాఖల మాదిరి కాసుల కోసం కక్కుర్తి పడి అసలు ఉపయోగించకుండా గోడవున్లలో పడేసినవి కూడా ఎన్నో ఉన్నాయట.

స్కానర్ల తయారీ కంపెనీల వారిలా మూగుతుంటే అసలు మా సిగ్గూ ఎగ్గూ సంగతేంటని అనేక మంది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అబ్బే అనవసరంగా ఆందోళనపడకండి ఏమైనా అభ్యంతరకరమైన వస్తువులుంటే అవే తప్ప శరీరం కనపడదని కొందరు సర్ది చెబుతున్నారు. మొహమాటం ఎందుకు స్కాన్ అంటే మర్మాంగాలతో సహా అన్నీ కనిపిస్తాయని మరికొందరు చెప్పేశారు. అయితే ఒకపని చేద్దాం బొమ్మలను చూసేవారిని బయటికి రాకుండా చేద్దాం అని కొందరు, వచ్చినా మనుషుల మొహాలు చూడనీయకుండా చూద్దాం అని మరికొందరు, ఎవరి శరీరం ఏ మొహం వారిదో తెలియకుండా చూద్దాం అని సలహాలివ్వటం ప్రారంభమైంది.

ఇవన్నీ చూసిన అనేక మందికి ఎక్కడెక్కడో మండుతోంది. ఆపండెహె మీ చచ్చు సలహాలు, అసలు ప్రపంచంలో ఉగ్రవాదులెంత మంది, వారిలో విమానాలెక్కేవారెందరు, ఎక్కినా పేలుడుపదార్థాలను అండర్‌వేర్లలో తెచ్చేవారెందరు? ఒకరూ అరా కోసం కోట్లాది జనం సిగ్గుతీస్తారా? మీ మెదళ్లు మోకాళ్లలో ఉన్నాయా తలలో ఉన్నాయా? అంటూ ఇంటర్నెట్‌లో వాయించేస్తున్నారు. ఇదంతా చూస్తుంటే పరమానందయ్య శిష్యులు సూదిని మోసుకువచ్చిన తీరు గుర్తుకు రావటం లేదూ!!

- సత్య

ములగాకు మసాలా

కావలసిన పదార్థాలు

ములగాకు - 3 కప్పులు
పెసరపప్పు - పావుకప్పు
కారం - కొంచెం
జీలకర్ర - కొంచెం
ఉప్పు - తగినంత
ఆవాలు - 1స్పూన్
మినప్పప్పు - 1స్పూన్
కొబ్బరి - సగం చిప్ప
నూనె - 2స్పూన్లు
వెల్లుల్లి - 2 రెక్కలు
పసుపు - చిటికెడు

తయారుచేసే విధానం

ములగాకు శుభ్రంగా కడిగి ఎక్కువ నీళ్లల్లో వుడకబెట్టాలి. పసరంతా దిగిపోతుంది. నీళు తీసేసి ములగాకును ఒక పాత్రలో వుంచాలి. పెసరపప్పు వేయించి ఒక మాదిరిగా ఉడకబెట్టాలి. వుడుకుతున్నప్పుడే ములగాకు వేసి వుప్పు, కారం, పసుపు, కొబ్బరి కోరు వెయ్యాలి. అలా కొద్దిసేపు ఉడికించి దింపెయ్యాలి. మినప్పప్పు, తురిమిన ఎండు మిర్చి, ఆవాలు, జీలకర్ర, చితక్కొట్టిన వెల్లుల్లి నూనెలో వేయించి, అందులో ములగాకు, పెసరపప్పును వేసుకోవాలి. ఇలా చేస్తే ములగాకు పసర వాసన రాదు.

పెరుగు వడ

కావలసిన పదార్థాలు

మినప్పప్పు - అరకిలో
పచ్చిమిర్చి - 50గ్రా
ఉల్లిపాయలు - 200గ్రా
జీలకర్ర - కొంచెం
ఎండుమిర్చి - 4
అల్లం - అంగుళం ముక్క
ఉప్పు - రుచికి తగినంత
కొత్తిమీర - 1కట్ట
ఆవాలు - 1టేబుల్ స్పూన్
మెంతులు - కొంచెం
నూనె - వేయించడానికి సరిపడా
పెరుగు - 1లీటర్

తయారు చేసే పద్ధతి

మినప్పప్పు నానబెట్టి పొట్టు లేకుండా కడిగి కొంచెం గట్టిగా రుబ్బుకోవాలి. అందులోనే ఉల్లిపాయ, పచ్చిమిర్చి, అల్లం చిన్న చిన్న ముక్కలుగా చేసుకుని కలపాలి. ఉప్పు, జీలకర్ర కూడా కలపాలి. ఈ పిండిని గారెలు చేసుకోవాలి. వేరే పెద్ద పాత్రలో కొద్దిగా నూనె తీసుకుని ఆవాలు, ఎండుమిర్చి, జీలకర్ర, మెంతులతో పోపు పెట్టుకుని పెరుగులో వేయాలి. ఈ పోపు వేసుకున్న పెరుగులో గారెలను వేడిగా వున్నప్పుడే వేసుకోవాలి. ఇవి ఒక గంటసేపు నానితే చాలా రుచిగా వుంటాయి.

టొమాటో ఆమ్లెట్

కావలసిన పదార్థాలు

టొమాటోలు - 4
ఉల్లిపాయలు - 2
పచ్చిమిర్చి - 4
బియ్యంపిండి - 1టేబుల్ స్పూన్
జీలకర్ర - కొంచెం
ఉప్పు - తగినంత
నూనె - 2టేబుల్ స్పూన్లు

తయారుచేసే పద్ధతి

బియ్యంపిండి తడిపి నానబెట్టాలి. టొమాటోలు చిన్న ముక్కలుగా కోసుకోవాలి. పచ్చిమిర్చి, ఉల్లిపాయలు ముక్కలుగా కోసుకోవాలి. ఉల్లిపాయ, టమాటో, పచ్చిమిర్చి ముక్కలు, జీలకర్ర, ఉప్పు కలిపి గట్టిగా పిసికి దానిని నానబెట్టిన బియ్యంపిండిలో వేసి బాగా గిలక్కొట్టాలి. పెనం వేడెక్కిన తర్వాత నూనె రాసి పిండిని గరిటెతో తీసుకుని పెనం మీద దోసెలా వేసుకోవాలి. దీనిని పల్చగా చేసుకుంటే తిరగేయనవసరంలేదు. ఒకవేళ తిరగేస్తే మళ్లా నూనె రాయాలి. ఇష్టమైన వాళ్లు కోడిగుడ్డు సొన కూడా వేసుకోవచ్చు.

బెల్లం అటుకులు

కావలసిన పదార్థాలు

అటుకులు - 1కప్పు
బెల్లం - 200గ్రా
కొబ్బరి - 1కాయ
యాలకులు - 5
పాలు - 1కప్పు

తయారుచేసే విధానం

ముందుగా కొబ్బరి కోరి పెట్టుకోవాలి. బెల్లం పొడి చేసి పాలల్లో కలిపి పానకంలా తయారు చేయాలి. అటుకులు కడిగి బెల్లం కలిపిన పాలల్లో నానబెట్టాలి. కొబ్బరి, యాలకుల పొడి కూడా కలపాలి. ఈ మిశ్రమాన్ని పావుగంట నాననిస్తే చాలు. తినొచ్చు. దీనికి స్టౌ వాడనవసరంలేదు. పిల్లలు వీటిని ఇష్టంగా తింటారు. కొత్త అటుకులతో చేస్తే మరింత రుచిగా వుంటాయి.

ప్రభుత్వ పథకాలు... దళితుల సంక్షేమానికి సాక్ష్యాలు

డా॥ కె. రోశయ్య
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి

"రాష్ట్ర జనాభాలో 16.25% ఉన్న దళితులకు అభివృద్ధి ఫలాలు దక్కాలన్నదే తమ ప్రభుత్వ ధ్యేయమని ముఖ్యమంత్రి డా॥ కె. రోశయ్య పేర్కొన్నారు. దళితుల సంక్షేమమే లక్ష్యంగా తమ ప్రభుత్వం నూతన విధానాలకు రూపకల్పన చేసిందనీ, పటిష్ఠమైన పథకాలకు తోడుగా కట్టుదిట్టమైన కార్యాచరణతో సాగిపోతోందనీ రోశయ్య అన్నారు. తమ కృషిలో అంకితభావం ఉందనీ, అది డా॥ అంబేద్కర్ కలల్ని సాకారం చేయగలదనీ ఆకాంక్షిస్తూ - దళిత సంక్షేమమే రాష్ట్ర సంక్షేమానికి దిశానిర్దేశం చేయగలదని ముఖ్యమంత్రి నొక్కి వక్కాణించారు. ఆ దిశగా గత అయిదున్నర సంవత్సరాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన పథకాల గురించి రోశయ్య ప్రస్తావించారు. ఆ దళితుల ఉన్నతే ప్రధాన ఆశయంగా ప్రభుత్వం కంకణం కట్టుకుందని చెప్పటానికి తనకెంతో సంతోషంగా ఉందని ముఖ్యమంత్రి చెప్పారు."

2004-05 నుంచి 2008-09 వరకు దళితుల సంక్షేమం కోసం సాధించిన లక్ష్యాలు - సాధనలు :

- 2004-05 కొత్తగా 44 ప్రీ-మెట్రిక్ హాస్టళ్లు, 48 కాలేజీ హాస్టళ్ళు, అలాగే 2008-09లో 400 కాలేజీలు, హాస్టళ్ళ మంజూరు చేయబడినాయి.
- 2006-07లో 25% పెంచిన మెస్ ఛార్జీలను 2007-08లో 40% కు పెంచారు.
- 'సంక్షేమ బాట' కార్యక్రమం క్రింద హాస్టళ్ల మరమ్మత్తులకు 2007-08లో రూ. 27 కోట్లు, 2008-09 లో రూ. 50 కోట్లు కేటాయింపు జరిగింది.
- హాస్టల్ వాసులకు ఉచిత దుస్తులు 2 నుంచి 4 జతలకు పెంచడమైనది.
- 8-10 తరగతులు చదువుతున్న హాస్టల్ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ కోసం 5,336 మంది విద్యావాలంటీర్లను ప్రభుత్వం నియమించింది.



- ఒక్కొక్క సంక్షేమ హాస్టలు కాంప్లెక్సు కు 400 మంది విద్యార్థుల చొప్పున రూ.1.68 కోట్ల వ్యయంతో 120 సంక్షేమ హాస్టళ్ళ నిర్మాణానికి అనుమతించారు.. 2008-09లో 200 మంది హాస్టలు సంక్షేమ అధికారాల నియామకానికి అనుమతి.
- ఇందిరమ్మ ఇళ్ళ పథకంలో ఇల్లు లేని ఎస్. సి. / ఎస్.టి. /బి.సిల కోసం ప్రత్యేకంగా ఇళ్ళ స్థలాలను కేటాయింపు చేసింది.
- 2005-2008 మధ్య దళితులపై సాగిన ఎట్రాసిటీ కేసులను విచారించేందుకు 15 సెషన్స్ కోర్టులను ఏర్పరచింది. ఇంకా అన్ని జిల్లాలలోనూ కోర్టులు ఏర్పాటు చేస్తోంది.

పథకాల వారీగా ప్రయోజనాలు:

పావలావడ్డీ పథకం: ఈ పథకం క్రింద రాష్ట్రంలో 9,33,585 స్వయంసహాయక సంఘాల్లో 28,46,316 మంది దళితులు సభ్యులుగా ఉండటం విశేషమైతే 2008-2009 ఆర్థిక సంవత్సరంలో 6,558కోట్ల పావలావడ్డీ రుణాల్లో దళితులకు రూ. 1,237 కోట్ల పెద్ద మొత్తం అదించడం చెప్పకోదగ్గ అంశం.

ఇందిరా జీవితభీమా (అమ్ ఆద్మీ యోజన): ఈ పథకం క్రింద మొత్తం 38 లక్షల మంది పేదవారికి బీమా సౌకర్యం కల్పించగా, అందులో 13.12 లక్షల దళితులు లబ్ధిపొందారు.

ఇందిరప్రభ (సమగ్ర భూమి అభివృద్ధి పథకం): ఈ పథకం క్రింద భూమిలేని నిరుపేదలను భూమికి యజమానులుగా చేస్తున్న ప్రభుత్వం గత 5 సం॥లుగా రూ. 377.19 కోట్ల వ్యయంతో 3,51,366 ఎకరాల భూమిని వినియోగంలోకి తీసుకువచ్చింది. లబ్ధిదారుల్లో 1,72,900 దళిత కుటుంబాలు ఉన్నాయి. వీరి కోసం రూ. 184.20 కోట్లు ప్రభుత్వం వెచ్చించింది. అదే విధంగా జాతీయ గ్రామీణ

ఉపాధిపథకం ద్వారా 39.63 లక్షల దళిత కుటుంబాలకు చెందిన భూముల అభివృద్ధి కోసం రూ. 935.14 కోట్లు కేటాయించి దళితప్రగతిదిశగా ప్రభుత్వం ముందడుగు వేసింది.

రుణమాఫీ పథకం: రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ పరిధిలోని ఎస్.సి. ఫైనాన్స్ కార్పోరేషన్ వివిధ పథకాల క్రింద దళిత కుటుంబాలు తీసుకున్న రుణాలను మాఫీ చేయడం మరో ముఖ్యమైన అంశం. 17,80,842 మంది దళితులు రూ. 1176.82 కోట్ల రుణమాఫీ లబ్ధిని పొందుతున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 2,40,194 మంది దళితులు రూ. 386.23 కోట్ల రుణమాఫీ లబ్ధిని పొందబోతున్నారు.

ఇందిరాక్రాంతి పథకం: 22 జిల్లాల్లో 128 మండలాల్లో గత 5 ఏళ్ళలో 4,539.24 ఎకరాల భూమిని కొనుగోలు చేసి 5303 మంది కుటుంబాలకు గత 5 ఏళ్ళుగా ప్రయోజనం అందగా, ఇందులో దళిత లబ్ధిదారుల కుటుంబాలు 2799.

జాతీయ ఉపాధి హామీ పథకం: ఈ పథకం ద్వారా 2,65,26,000 మందికి పని లభిస్తే అందులో రూ.1649.29 కోట్ల విలువైన పనులు పొందిన దళితుల సంఖ్య 69,69,162.

పింఛన్లు: 71 లక్షల మందికి ప్రభుత్వం రూ. 800 కోట్లు పింఛన్లు అందించగా వారిలో అధికశాతం అంటే 12,61,124 మంది దళితులే కావడం రాష్ట్ర ప్రభుత్వం దళితుల సంక్షేమానికి సాగిస్తున్న కృషికి తార్కాణం.

ఉపాధి కల్పన: 2008-09 ఆర్థిక సంవత్సరంలో 21,296 మంది దళిత నిరుద్యోగయువతకు ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించింది.

దళిత పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం: పరిశ్రమలు స్థాపించే దళితులకు ఎలాంటి హామీలూ లేకుండా రూ. 5 కోట్ల వరకు రుణాల మంజూరుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తోడ్పడుతోంది.



ప్రభుత్వపరంగా దళితుల సర్వతోముఖాభివృద్ధికి సాగుతున్న కృషిని వివరిస్తూ భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ పథకాలకు రూపకల్పన చేసే దిశగా తమ ప్రభుత్వం ముందడుగు వేస్తోందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కె. రోశయ్య తెలియచేశారు.

ఎత్తుమడాల చెప్పులేసుకొని...తాడాట!

చైనాలో మహిళలూ ఈ మధ్య సాంప్రదాయక ఆటలపోటీల్లో పాల్గంటున్నారు. ఆటల పోటీలు ఆరోగ్యానికి మంచిదని కాబోలు! ఈ పోటీల్లో యుక్తవయస్కులు, మధ్య వయస్కులు పాల్గని తమ ముచ్చట తీర్చుకున్నారు. తాడాట దగ్గరి నుంచి షటిల్ వరకు ఈ పోటీల్లో ఉన్నాయి. నాంజింగ్ పట్టణంలోని మహిళలు తాడాట ఆడారు. 'ఇందులో వింతేముంది? మనం చిన్నప్పటినుంచి ఆడుతూనే వున్నాం' అనుకుంటే మాత్రం తాడు తొక్కినట్టే. మామూలు తాడాట మనమే కాదు. చైనావాళ్లే కాదు.ఎవరైనా ఆడేయొచ్చు. అయితే ఇక్కడ ఈ చైనా చిన్నమ్మలు ఎత్తుమడాల చెప్పులు వేసుకుని మరీ తాడాట ఆడారు. మరి రొటీన్‌కు భిన్నంగా ఆడితేనేకదా కిక్కొచ్చేది. అంత కిక్కు రావాలంటే మనం కూడా హైహీల్స్ తొడగాల్సిందే. తాడు పట్టాల్సిందే. ఎప్పుడూ పనులతో బిజీగా ఉండే మహిళలకు ఈ విధంగానైనా కొంత రిలీఫ్ దొరికినట్టైంది.

పొడవాటి కనురెప్పలు

అమ్మో ఏంటీ అమ్మాయి చూడ్డానికే అదోలా ఉంది అనుకుంటున్నారా? ఈ వయ్యారి పేరు స్కాల్ప్ మాయ్య. అది సరే. ఈ వేషం ఏంటో చెప్పండంటారా! మీ ఆతురత సహజమైనదే. మనం అప్పుడప్పుడు వింటుంటాం కదండీ. కొన్ని మందులు వేసుకుంటే సైడ్ ఎఫెక్ట్స్ వస్తాయని. అదే ఈమె పరిస్థితి. తనేదో అనారోగ్య రీత్యా దానికి తగిన మందులు వేసుకుందట. ఫలితం ఆమె కనురెప్పలు ఇలా విపరీతంగా పెరిగిపోయాయి. ఏదైనా చూడాల్సిన ప్రతి సారీ వాటిని పైకి లేపాల్సిందే. ఎంత ఇబ్బందో కదా. ఏం మందులో ఏమో!

తెలుసా!

చేపల వేట పండుగ

దక్షిణ కొరియాలో హ్వాచియోన్ అనే అతి చల్లని ప్రాంతం వుంది. అక్కడ ఒక వింత పండుగను జరుపుకుంటారు. ఆ పండుగ ఏంటబ్బా...అని బుర్ర పట్టుకుని ఆలోచించక్కర్లా. మేమున్నాం కదా చెప్పడానికి. మంచులో చేపలు వేటాడ్డమే ఆ పండుగ. అక్కడ వేలాది మంది మంచులో చేపలను పట్టుకోవడంలో పోటీ పడుతుంటారు. ఈ పండుగను జనవరి నెల మొత్తం జరుపుకుంటారు. దీనిని చూడడానికి ప్రతి సంవత్సరం దాదాపు 10,00,000 మంది సందర్శకులు వస్తుంటారు. అంతేకాదు ఇక్కడ జోక్‌బే పండుగను జులై చివరలో, టమాటాల పండుగను ఆగస్టు మధ్యలో, డ్రాగన్ పండుగను కూడా జరుపుకుంటారు. మంచును తొలగిస్తూ గేలాలతో, బరిసెలతో చేపలను పడతారు. గడ్డ కట్టిన మంచుమీద స్టూలు వేసుకుని గానీ, వేడి క్యాబిన్‌లోగానీ ఉండి వీరు చేపలను పడుతుంటారు. కెనడా, ఫిన్లాండ్, ఈస్టోనియా, లాత్వియా, నార్వే, పోలండ్, రష్యా స్వీడన్, ఉక్రెయిన్, జర్మనీ దేశాలలోనూ ఈ పండుగను జరుపుకునేవారు.

మంచులో ముష్టియుద్ధం

ప్రేక్షకులను, పర్యాటకులను సంతోషపెట్టేందుకు బాక్సర్లు ముష్టి యుద్ధం చేస్తుంటారు. ఇది అందరికీ తెలిసిన విషయమే. అయితే చైనాలో ఈ మధ్య వెరైటీ బాక్సింగ్ జరిగింది. ఔనా! ఎక్కడో చెప్పేయండంటారా? కొత్త తరహా బాక్సింగ్ జరిగింది మరెక్కడో కాదు. జియాంగ్ ప్రావిన్సులోనే. ఏంటా కొత్త తరహా బాక్సింగ్ అనుకుంటున్నారా? మనకు కొత్త తరహానే కానీ బాక్సింగు చేసేవారికి మాత్రం చుక్కలు కనపడతాయి. ఇంతకూ అసలు విషయం ఏంటంటే అక్కడ స్విమ్మింగ్ రిసార్టులో నీటిపై తేలియాడుతున్న మంచుమీద బాక్సింగ్ పోటీ పెట్టారు. అది కూడా చేతులకు కాస్త పెద్ద గ్లౌజులు, షార్టు తప్ప ఒంటిమీద మరేమీ లేకుండా! ఒక పక్క ఎముకలు కొరికే చలి, మరో పక్క ప్రత్యర్థి తాకిడికి మంచుమీద నుండి నీళ్లలోకి పడతామేమోనన్న భయం. ఆటగాళ్లకెలా ఉన్నా ప్రేక్షకులకు మాత్రం ఓ పక్క వినోదం.... మరోపక్క ఉత్కంఠ. కిక్కే కిక్కు.

అట్టమీది కథ



శీతల పానీయాలు తాగే ప్లాస్టిక్ గొట్టంతో ఎప్పుడైనా భోజనం చేశారా? పాతికేళ్ల మాధవ్ ప్రతిరోజూ ఆ పనే చేస్తాడు.

పాత పేపర్ల షాపు యజమాని ఒకరు రోజూ ఒక పాత్రలో జావ మాత్రమే పోసుకుని తాగుతాడు. ఇలాగని ఇతనికేం వయసైపోలేదు. కేవలం 36 ఏళ్లే. మరి జావే ఎందుకు తాగుతాడంటే...ఆయన నోటి వెడల్పు చొక్కా గుండీ సైజుకి మించదు. నోటి కండరాలు కుంచించుకుని బిగుసుకుపోవడంతో ఆయన తనకిష్టమైన సమోసాలు, పానీ పూరీ తినలేకపోతున్నాడు. అందుకు కారణం కూడా చెప్పలేడు. పెదవులు బాధతో వణుకుతాయి. ఇదివరలో ఎంతో చక్కగా మాట్లాడిన అతను ఇప్పుడు గొణగడం మినహా ఏం చేయలేడు.

నాల్గవ తరగతి చదివే వెంకట్ నోరు తెరవలేడు. తొమ్మిదేళ్లకే ఇంత కష్టమెందుకొచ్చిందో తెలీక తల్లిదండ్రులు వాడిని రాజధానిలోని ఆసుపత్రికి తీసుకొచ్చారు. పరీక్షించిన వైద్యులు నోటి క్యాన్సర్ అని చెప్పారు. ఇంత చిన్న వయసులో ఈ జబ్బెందుకొచ్చిందని ఆశ్చర్యపోతారెవరైనా. అయితే వాడికి క్యాన్సర్ ఎందుకొచ్చిందో తెలిస్తే మరింత ఆశ్చర్యపోతారు. వెంకట్ అమ్మానాన్నలు గుట్కాతినేవారు. వారిని చూచిన ఆ చిన్నారి కూడా సరదాగా దాన్ని తినసాగాడు. చివరికి అదే వాడి పాలిట శాపమైంది. మొదట పేర్కొన్న ఇద్దరి బాధకు కారణం కూడా మాయదారి గుట్కానే. మహారాష్ట్రను శాసించి దేశ ప్రధాని పదవికి పోటీపడిన ఓ కేంద్ర మంత్రికి కూడా గుట్కా వల్ల నోటి క్యాన్సర్ వచ్చిందంటే నమ్ముతారా!

ఇలాంటి గాథలు, కథలు, బాధలు చెప్పకోడానికి ఎన్నెన్ని పేజీలు చాలవు. మరి ఇవాళ్టి అట్టమీది కథ అలాంటి వివరాలెన్నిటినో తీసుకొచ్చింది. ఓమాలి చదివిపెట్టండి.

- కె. సాహిల్



గుట్కా తింటే గుటుక్కే

మూడు వేళ్ల వెడల్పున్న తళుకు కాగితం సంచులు ఏ కిళ్లీ కొట్టులో చూసినా, పాన్ డబ్బాలలో చూసినా దర్శనమిస్తుంటాయి. పల్లె పట్నం అన్న తేడా లేకుండా అన్ని ప్రదేశాలకూ వ్యాపించిన ఈ చిన్ని పొట్లాం గుట్కా. దీనిని తీసుకెళ్లడం తేలిక. అంతేకాక అన్ని చోట్లా దొరుకుతుంది. మారు మూల గ్రామాలలోకీ చొచ్చుకుపోయింది. ఇందులో వక్క, పచ్చి వక్క, సున్నం, పొగాకు తదితర పదార్థాలు వుంటాయి. దీని మూలంగా అనేక రకాల క్యాన్సర్లు వస్తాయని, వైద్యులు మొత్తుకుంటున్నా ఆగేదెవరు?

రోడ్డు పక్కన ఏ బడ్డీకొట్టు దగ్గరైనా సరే కాసేపు నిలబడితే చాలు! చిన్న చిన్న పిల్లలు సైతం వచ్చేసి 'అంకుల్! ఒక చాంపియన్ ఇవ్వండి' అంటూ రూపాయి బిళ్ల డబ్బామీద పెట్టేస్తారు. కూలి పని చేసుకునేవారు సైతం పని మధ్యలో వచ్చేసి 'రెండు పాన్ పరాగ్ ఇవ్వు' అంటూ డబ్బులు అందిస్తుంటారు. షాపతను ఇంత పొడుగు దండలోంచి గుట్కా పాకెట్లు చించి ఇస్తుంటాడు. కొట్టు ముందు నుంచి కదలకుండానే నోటితో పాకెట్‌ను ఓ మూల చించేస్తారు. లేత గోధుమ, తెలుపు రంగుల్లో నిక్షిప్తమైన పదార్థాన్ని ముందుగా అరచేతిలో వేసుకుంటారు. తర్వాత ఇలా నోట్లో వేసుకుని బుగ్గన పెట్టేస్తారు.

ఇలా ఒక పొట్లాం తర్వాత మరొకటి...వేస్తూనే వుంటారు. ఏళ్ల తరబడి దీన్ని తినడం వల్ల నోరు ముఖ్యంగా బుగ్గలు, నాలుక బండబారిపోతాయి. నోటి లోపలి పొరల్లో ఫైబ్రోసిస్ అనే వ్యాధి వచ్చి తిష్టవేస్తుంది. ఇది సోకిన వారికి నోరు తెరవడం కూడా బాధగా వుంటుంది. సాధారణ వ్యక్తులకు క్యాన్సర్ సోకే అవకాశం కన్నా ఫైబ్రోసిస్ వ్యాధి పీడితులకు క్యాన్సర్ వచ్చే అకవాశం 400 రెట్లు ఎక్కువ. ఫైబ్రోసిస్ మొదలైన అయిదేళ్ల నుంచి పదేళ్ల లోపల క్యాన్సర్ వస్తోంది. నోటి లోపల ఎంత ఎక్కువ సేపు వాటిని పెట్టుకుంటే అంత ఎక్కువగా క్యాన్సర్ వచ్చే అవకాశం వుంది. ఈ వ్యాధి రోగి నోటినీ, ముఖాన్నీ వికారం చేస్తుంది. నానా రకాల బాధలతో తీసుకుని తీసుకుని మరణించేలా చేస్తుంది. తమాషా ఏంటంటే...ఎంతో ప్రమాదకరమైందిగా భావించే సిగరెట్ కంటే గుట్కా మరింత ప్రమాదకరమైంది. ఇందులో పొగాకు కలిసి వుండడమే అందుకు కారణం. పొగాకులో వందల కొద్ది విష పదార్థాలున్నాయి. కాల్చే ప్రతి సిగరెట్‌లో నికోటిన్, కార్బన్ మోనాక్సైడ్, తార్ వుంటాయి. పొగాకులోని కార్బన్ మోనాక్సైడ్ రక్తానికి

సరఫరా అయ్యే ఆక్సిజన్ మోతాదు తగ్గిస్తుంది. పొగాకులోని తారు క్యాన్సర్ వ్యాధిని కలిగిస్తుంది. క్యాన్సర్ వ్యాధిని కలిగించడానికి సిగరెట్‌కు పట్టే సమయంలో సగమే గుట్కాకు పడుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఓ తండ్రి తన కొడుక్కి సిగరెట్ ఇవ్వలేకపోయినా గుట్కా పాకెట్టును మాత్రం సులభంగా చేతిలో పెట్టేస్తాడు. దీనిలో దాగిన ప్రమాదం తెలీకనే ఇదంతా. మొత్తం క్యాన్సర్ రోగుల్లో నోటి క్యాన్సర్ రోగులు దాదాపు పదోవంతు మంది వున్నట్టు గణాంకాలు చెప్తున్నాయి. విదేశాల్లో ఈ క్యాన్సర్ రావడం చాలా అరుదు. నోరు పండించే తాంబూలం స్థానాన్ని పాన్‌మసాలాలు, గుట్కాలు ఆక్రమిస్తున్నాయి. వీటి బాధితులంతా 35 ఏళ్ల లోపు వారే. వీటిని అరికట్టలేకపోతే ఈ శతాబ్దాంతానికి నోటి క్యాన్సర్ రోగుల సంఖ్య తారాస్థాయికి చేరుతుందని వైద్యులు ఆందోళన చెందుతున్నారు.

ఎందుకు వాడతారు?

అసలు ప్రాణాంతకంగా మారే పొగాకును వివిధ రకాలుగా ఎందుకు వాడతారు? అసలు ఆ అలవాటును ఎందుకు చేసుకుంటారు? ఇందుకు సామాజిక, ఇతర అనేక కారణాలున్నాయి. స్నేహితులు షోకుగా, జాలీగా తాగడం, తీసుకోవడం చూసి వాటి ఆకర్షణలో పడతారు. పార్టీలలో వక్కపొడి, సిగరెట్లు ఇవ్వడం వల్ల కొంత మంది వాటిని అలవాటు చేసుకుంటారు. ఇక మరికొందరు రాత్రిపూట నిద్ర మేలుకోవడానికో, విశ్రాంతి తీసుకోవడానికో పొగతాగడం, జర్దాలు, పాన్‌పరాగ్‌లు వేసుకోవడం అలవాటు చేసుకుంటారు. రాత్రి పూట డ్రైవర్లు ఎక్కువసేపు మేల్కొని వుండడానికిగాను వక్కలు, జర్దాలు, పాన్‌పరాగ్‌లు నోటిలో పెట్టుకుంటుంటారు. సిగరెట్లు కాలుస్తుంటారు. పెద్దలను చూసి పిల్లలు కూడా మొదలెడతారు. ఇలా ఒక ప్రమాదకర వలయంలా ఇది అలవాటౌతుంటుంది.

దగ్గరకు చేరరు

గుట్కా, పాన్ మసాలా, జర్దాలు తినేవారి దగ్గరకు చేరడానికి ఎవరైనాసరే తటపటాయిస్తారు. ఆఖరుకు స్నేహితులు, బంధువులు, కట్టుకున్నవారు కూడా. ఆ విధంగా అందరి ఛీత్కారాలకు గురవుతారు. ఆ వాసనను అందరూ అసహ్యించుకుంటారుకూడా. అలాంటి వారిని అమ్మాయిలు పెళ్లి చేసుకోవడానికి ఇష్టపడరు. కొందరు తెలియకుండా పెళ్లి చేసుకున్నా ఆ తరువాత సంసారంలో వారి మధ్య చీదరింపులు, చీత్కారాలతో ముద్దు ముచ్చట్లు కూడా కరువవుతాయని చెబుతారు. 16-18 ఏళ్ల ప్రాయంలో చుట్టు పక్కల స్నేహితులతో సరదాగా గుట్కా, పాన్‌మసాలాతో ప్రారంభమయ్యే స్నేహం దురలవాట్లకు బానిసలుగా మార్చేస్తుంది. పళ్లన్నీ గారపట్టి ఎర్రగా అసహ్యంగా తయారై ఎవ్వరూ దగ్గరకు చేరనంతగా తయారవుతారు. చిన్న వయసులోనే క్యాన్సరుకు గురయి మరణిస్తుంటారు. అలా పదిమందిలో 9 మంది నోటి క్యాన్సరుతో మరణిస్తున్నారని నివేదికలు చెబుతున్నాయి. ముఖ్యంగా చదువుతలేని వారు, కొద్దిపాటి చదువుకున్నవారు, కొందరు బాగా చదువుకున్న మధ్యతరగతి కుటుంబాల వారు గుట్కా, పాన్‌మసాలా, జరదాలకు అలవాటుపడి క్రమేణా క్యాన్సర్ వ్యాధి బారిన పడిపోతున్నారు. సరదాగా ప్రారంభమైన గుట్కా నమిలే అలవాటు క్యాన్సర్ వ్యాధి ప్రారంభం కాగానే పళ్లు ఊడిపోవడం, ఆహారం జీర్ణంకాకుండా పోవడం దగ్గర నుంచి ఆ తర్వాత మాట్లాడే స్థితి కూడా లేకుండా పోతుంది. జీర్ణవ్యవస్థ పాడవుతుంది. రాత్రుళ్ల నిద్ర సరిగా పట్టదు. కొన్నాళ్లకు నోరుకూడా తెరుచుకోలేని స్థితి వల్ల ద్రవపదార్థాలను గొట్టాల ద్వారా కడుపులోకి పంపించే స్థితికి చేరిపోతారు. అలా క్రమేణా స్వల్ప కాలంలోనే గుట్కాలు, జర్దాలు, పాన్‌మసాలాల కారణంగా క్యాన్సర్ వ్యాధితో మరణిస్తున్నారు. రూపాయి, రెండు రూపాయల గుట్కా లక్షలాది రూపాయల ఖర్చును, క్యాన్సర్ జబ్బును మోసుకొచ్చి ప్రాణాలను హరిస్తుంది.

ప్రభుత్వానికి పట్టదా!

ఇన్ని కోట్ల మంది ఆరోగ్యాలతో చెలగాటమాడే గుట్కాల గురించి ప్రభుత్వానికి పట్టదా? అనిపించొచ్చు. గతంలో మన కేంద్ర ప్రభుత్వం గుట్కాల ఉత్పత్తినీ, విక్రయాన్ని నిషేధించింది. కానీ ఏ మూలకెళ్లి ఏ చిన్ని బడ్డీ కొట్టులో చూసినా గుట్కా పాకెట్ల దండలు మెరుస్తూ కనిపిస్తాయి. నిషేధం విధిస్తే సరిపోతుందా! అమలులో చిత్తశుద్ధితో అమలు జరపాలిగాని!! దేనిపైనైనా నిషేధం విధిస్తే సరిపోదు. దానిపై నిఘా అత్యంత అవసరం. ఈ విషయమై

క్యాన్సర్ కేరాఫ్ అడ్రస్

గుట్కాలో పొగాకు కూడా వుంటుంది. ఒక్కమాటలో చెప్పకోవాలంటే ఇదో మాదకద్రవ్యం వంటిది. టొబాకోలో క్యాన్సర్ కారకాలుంటాయి. ఇది సిగరెట్ తాగడం లాంటిదే. దీనిని తీసుకోవడం వల్ల నోటిలో పుళ్లు, అల్సర్, లంగ్ క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్ వచ్చే అవకాశం వుంది. దీర్ఘకాలం గుట్కా తినడం వల్ల పురుషుల్లో పునరుత్పత్తి సామర్థ్యం తగ్గుతుంది. వీర్యకణాల సంఖ్య పడిపోతుంది. అందుకే... గుట్కాను నిషేధించడంతోనే సరిపోదు. దీనిపై ప్రభుత్వ నియంత్రణ వుండాలి.

డాక్టర్ ప్రభావతి, వరంగల్







ప్రజల్లో చైతన్యం కలిగించడం మరింత అవసరం. మరో ముఖ్యమైన విషయం వుంది. పొగాకు పండించే రైతులకు ప్రత్యామ్నాయ పంటలు పండించేలా చైతన్య పరచాలి. అందుకు ప్రోత్సాహకరంగా సబ్సిడీలు, విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహార మందులు అందించాలి.

భయంకర జబ్బు

నోటి క్యాన్సర్ డబ్బు పోసి మరీ కొనుక్కునే భయంకర జబ్బు. ఏ అవయవానికి క్యాన్సర్ వస్తే దాన్ని కోసి తీసేయడమే. నాలుకకు వస్తే నాలుకను కోసిపారేస్తారు. బుగ్గకొస్తే బుగ్గను కోస్తారు. పెదవికొస్తే పెదవిని కోసేస్తారు. నోటి క్యాన్సర్ బుగ్గకు వస్తే బుగ్గకు రంధ్రం పడుతుంది. నోటి క్యాన్సర్ వచ్చినవారి ఫొటోలను చూస్తేనే ఒళ్లు జలదరిస్తుంది. మరెప్పుడూ నోటి క్యాన్సర్ కారకాలైన పాన్‌పరాగ్, గుట్కా, జర్దా, పాన్‌మసాలా, చుట్ట, బీడీ, సిగరెట్, పచ్చి వక్కపొడి వగైరా వాటి జోలికి ఎన్నడూ పోకూడదన్న భయం కలగజేస్తుంది. కానీ చాలామందిలో ఆ భయం శాశ్వతంగా వుండదు. అలవాటును మానలేరు. అందుకే తెలిసి తెలిసీ నోటి క్యాన్సర్ బారినపడతారు. భయాన్ని శాశ్వతం చేసుకున్నవారు ఆ ప్రాణాంతక అలవాటును శాశ్వతంగా మానివేసి తమను తాము కాపాడుకోగలుగుతారు.

నోటి క్యాన్సర్ వచ్చినవారిలో 90 శాతం మంది పొగాకు, వక్క ఏదో ఒక రూపంలో వాడేవారే. దీన్ని బట్టి అవి ఎంత ప్రమాదకరమైనవో చెప్పాల్సిన పనిలేదు. కానీ మన దేశంలో మాత్రం గుట్కాలు, పాన్‌లు, పాన్‌పరాగ్‌లు సేవించేవారి సంఖ్య పెరిగిపోతోంది. మహిళలు, పిల్లలు, యువకులు వాటిని ఒక ఫ్యాషన్‌గా తీసుకుంటూనే వున్నారు. ముఖ్యంగా యువతరం ఈ వ్యసనానికి బానిసవుతోంది. అందుకేనేమో ఏదేశంలోనూ లేనివిధంగా 10-12 సంవత్సరాల లోపువారే నోటి క్యాన్సర్ బారిన పడుతున్నారు.

భయంకరమైన నోటిక్యాన్సర్ నుంచి ప్రజలను ముఖ్యంగా యువతను విముక్తి చేయడానికి ప్రయత్నాలు జరుగుతూనే వున్నాయి. మన రాష్ట్రంలో కూడా గుట్కాలు, జర్దాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు జరిగాయి.

కట్టడి చేయాలి

రూపాయి చేతిలో వుంటే చాలు! ఆ ప్రాణాంతక పొట్లాన్ని కొనుక్కొని నోట్లో వేసుకోవచ్చు. చవగ్గా వుండడం వల్ల కూడా దాన్ని ఎక్కువగా తింటున్నారు. మరి ఇంత ప్రమాదకరమైన గుట్కాలను నిషేధించొచ్చు కదా అనిపిస్తుంది ఎవరికైనా. నిషేధం సంగతి తర్వాత. సిగరెట్ విషయంలోనే అది సరిగ్గా అమలు జరగడం లేదు. ప్రభుత్వాలు ఆ విషయంలో ఎన్నిసార్లు విఫలమవలేదు! అందుకే ముందు కనీసం దీనిపై ప్రభుత్వ నియంత్రణ అయినా గట్టిగా వుండాలి. భారీగా పన్నులు వడ్డించడం ద్వారా కూడా ప్రభుత్వం దాని ఉపయోగాన్ని తగ్గేలా చేయవచ్చు. ఆ విధంగా లభించే సొమ్మునే తిరిగి దాని దుష్ఫలితాలను ప్రజలకు తెలియచేసే ప్రచారానికి ఉపయోగించవచ్చు. ప్రభుత్వం వైపు నుంచి ఇంతవరకు అలాంటి చర్యలేవీ లేవు. రూపాయి నుంచి ఎనిమిది రూపాయలు పెడితే పొట్లాం వచ్చి చేతిలో పడుతోంది. మొదట మనం చెప్పుకున్న బాధితుల మాదిరిగా కోట్లాది మంది ప్లాస్టిక్ గొట్టాలలో ఆహారం తినకుండా వుండాలంటే... గుట్కాలపై నిషేధం విధించాలి. అదీ చేతకాదనుకుంటే కనీసం నియంత్రణ అయినా చేయగలగాలి. [illegible] గుటుక్కే. ★



మానడానికి చిట్కాలు

పాఠశాలలకెళ్లే విద్యార్థుల నుంచి పనిపాటలు చేసుకునే వారి వరకు గుట్కా నములుతూనే వుంటారు. గుట్కా మానాలనుకునే వారికి కొన్ని చిట్కాలు ....

♦ఎంత త్వరగా గుట్కా బారి నుండి బయట పడతామనే విషయం వారు ఎంతకాలంగా దీనికి బానిసగా ఉన్నామనే దాని మీద ఆధారపడి ఉంటుంది.

♦అన్నిటికంటే ముఖ్యమైంది మనలో గుట్కాను మానాలనే దృఢ నిశ్చయం కలిగివుండడం.

♦ఒక్కసారిగా కాకుండా నమిలినప్పుడల్లా నెమ్మదిగా, రోజుకు, వారానికి కొంత తగ్గిస్తూ ఉండాలి. అదే సమయంలో లవంగాలను, ఇలాచీలను నములుతూ ఉండాలి.

గుట్కా నమలడం ఒక్కసారిగా మానకూడదు. నెమ్మదిగా మానాలి. లేకపోతే నమిలేప్పుడు ఉపయోగపడే కండరాలకు ప్రమాదం. అరుగుదల కూడా మందగిస్తుంది. నోటిలోని కండరాలు గుట్కా నమలడం వల్ల గట్టిపడతాయి. కాబట్టి ఆ కండరాలకు రోజూ వ్యాయామం అవసరం. అందుకే గుట్కాకు బదులు ఎండిన ఉసిరి, ఇలాచీలను నమలడం అలవాటు చేసుకోవాలి. గుట్కాను నమలడం మానడానికి కొంత సమయం పడుతుంది ఎందుకంటే అందులో నికోటిన్ అనే పదార్థముంటుంది. అందుకే మొదట్లో రెంటినీ నములుతూ ఉండాలి.

♦తక్కువ నికోటిన్ ఉండే గుట్కాను ఎంపిక చేసుకోవాలి. తక్కువ ఖరీదున్న గుట్కాలో ఎక్కువ నికోటిన్ ఉంటుంది.

♦గుట్కా ప్యాకెట్ కొనుక్కున్న వెంటనే తినకుండా కాసేపు కోరికను అణచుకోవాలి. దీని కంటే ఇష్టమైన వాటి వైపు (సంగీతం, పుస్తకాలు చదవడం, టీవీ చూడడం వంటివి) ధ్యాసను మరల్చాలి. అయినా దానివైపే మనసు లాగితే ఎప్పుడూ తీసుకునేదానిలో సగం గుట్కాను తీసుకోవాలి.

♦పీచు పదార్థాలు ఉన్న ఆహారం (బజ్జీలు, ఉల్లిగడ్డలు... వంటివి), జ్యూసులు ముఖ్యంగా పైనాపిల్, నారింజ రసాలు గుట్కా తిన్నన్ని రోజులు ఎక్కువగా తీసుకోవాలి. దీనివల్ల జీర్ణవ్యవస్థ బాగా పనిచేస్తుంది.

♦గుట్కాలు మానేయడం పెద్ద కష్టమైన పనేంకాదు. ఓపికగా ఉంటే ఒక ఆరు నెలల్లో ఆ అలవాటును మానేయగలరు.

సీరియల్

వియత్నాం గెరిల్లా

జరిగినకథ:

హావ్ ఒక పేద కుటుంబంలో పుట్టింది. తన చిన్నతనంలోనే తల్లిదండ్రులిద్దరినీ కోల్పోయింది. దాంతో అమ్మమ్మ దగ్గరకు చేరింది. అదీ కొద్దిరోజులు మాత్రమే. బొగ్గు కొట్టే కూలీగా పనిచేసేదామె. ఆమె చనిపోయాక ఆ పని చేయడానికి కుదిరింది. ఇక అప్పటినుంచి ఏకాకిగానే జీవన యాత్ర సాగించింది. చిన్న పిల్లయినా సూర్యోదయం మొదలు సూర్యాస్తమయం వరకు కష్టపడేది. అలా పెరిగిన హావ్ ఓ యువకుడి ప్రేమలో పడి పెళ్లాడుతుంది. అతను నావికుడు. తర్వాత వారికి ఆడపిల్ల పుడుతుంది. ఆ తర్వాత కొద్ది రోజులకు ఓ సంఘటన జరుగుతుంది. అది వేసవి కాదు. మే నెలా కాదు. కానీ గాలి పీల్చుకోవడమే కష్టమవడంతో జనాలంతా బీచ్ దగ్గరకు చేరారు. అప్పుడు....

మూలం: బుయ్‌డక్ ఆయ్

తెలుగు: కొల్లి సత్యనారాయణ

(2వ భాగం)

పాపను రొమ్ములకు అదిమి పట్టుకుని మా మామ పక్కన నిలబడ్డాను. మల్బరీ తోటలు మండిపోతున్నాయి. పచ్చని చెట్లు కాలి మసిబొగ్గులుగా తయారౌతున్నాయి. ఆకాశమంతా నల్లని పొగకమ్మింది. నిప్పురవ్వలు, కాలిపోయిన ఆకులు ఆకాశంలో సుళ్లు తిరుగుతూ దూర ప్రాంతాలకు కొట్టుకుపోతున్నాయి. మంటలకు మండుటెండ తోడై వచ్చిపడుతున్న మండుతున్న కట్టెలు సముద్ర జలాలపై పడి సముద్రమే మండుతున్నట్లుగా వుంది. పాపను గట్టిగా అదిమిపట్టుకున్నాను. వేడి తగలకుండా దుప్పటితో పాప ముఖం కప్పాను. చాలా మంది తమ పడవల్ని సముద్రంలోకి నెట్టేయసాగారు. అక్కడున్న వారిలో ఎక్కువ మంది పురుషులు, సముద్రం లోపలికి పారిపోవాలని వారికి లేదు. కానీ తమ పడవల్ని శత్రువులు నాశనం చేస్తారని భయపడుతున్నారు. స్త్రీలు, పిల్లలు బీచ్‌లో గుంపులుగా చేరారు. ఆదుర్దాగల తల్లులు తమ పిల్లల్ని పక్కనే అట్టిపెట్టుకున్నారు. కొంతమంది పిల్లలు భయపడి ఏడుస్తున్నారు. మరికొందరు అటూఇటూ పరుగులు తీస్తున్నారు. ఇంకా దురదృష్టం తమను వెన్నాడుతుందని భయాందోళనలు చెందుతున్నారు. ముందు ముందు ఏం జరుగుతుందో ఊహించలేకపోయాను. చుట్టూ మంటలు, చేతిలో పాప, పాప భవిష్యత్తు ఏమిటన్న ఆందోళనతో వున్నాను.

తుపాకి గుండ్లు పేలిన శబ్దం బీచ్‌కి దగ్గరగా విన్పించసాగింది. అంతలోనే ఇసుక దిబ్బలమీద శత్రు సైనికులు కనిపించారు. మేము ఎక్కడివాళ్లమక్కడ గుంపులుగా చేరి పిల్లల్ని ఎత్తుకుని, కొంతమందిని ఊడ్చుకుంటూ పరుగులెత్తాం. బీచ్ అంతా గందరగోళంగా వుంది.

♦♦♦

"పాపను నాకిచ్చి పారిపో" అని మామ కేకవేశాడు. పాపను ఎత్తుకున్నాడు. ఇద్దరం పరుగెత్తుతూనే పాప ముఖాన్ని దుప్పటితో కప్పాను. దుప్పటి వాసన పాపను ఉక్కిరి బిక్కిరి చేసింది. అయినా ఏడవలేదు. అప్పటికి పాప వయస్సు మూడు నెలలు మాత్రమే. పాప పుట్టిన రోజు పండుగ చేయాలని అనుకున్నాను. కానీ పరిస్థితి తారుమారు అయింది. అనుకున్నదొక్కటి, జరిగింది మరొకటి. శత్రువు మమ్మల్ని వెంటపడి తరుముతున్నాడు. మా ప్లానంతా భగ్నమైంది. ముందు మామయ్య, వెనుక నేను పరిగెత్తుతున్నాం. ముఖమంతా చెమటపట్టి కారిపోతోంది. బీచ్ చాలా పెద్దది. శత్రువు కాలుస్తున్న తుపాకి గుళ్ల శబ్దం ఆ ప్రాంతమంతా ప్రతిధ్వనిస్తోంది. పారిపోతున్న వారిపై వారు కాల్చటం లేదు. నా తలపైగా సముద్రంలోకి తప్పించుకుపోతున్న వారిపై వాళ్లు కాల్పులు జరుపుతున్నారు. దగ్గరలో వున్న నావలకు గుండ్లు తగిలిమునిగి పోతున్నాయి. తమ నావల్ని సముద్రంలోకి నెట్టివేసే ప్రయత్నం మానివేసి కొంతమంది ప్రాణాల్ని గుప్పిటలో పెట్టుకుని పారిపోయారు. శత్రుమూకలు ఒడ్డునవున్న నావలకు నిప్పంటించారు. నావలే వారికి జీవనాధారం. అటువంటివి కాలిపోతుంటే వారు భరించలేకపోయారు. మేము నిలబడిపోయాం. పాపనెత్తుకునే మామయ్య నావ దగ్గరకు వెళ్లి నిలబడ్డాడు. ఫ్రెంచి సైనికులు, వారి తొత్తులు, నావలు తగలబెట్టేవారు మిగిలిన వారు బీచ్ వెంట తిరగసాగారు. అలసిపోయి సిగరెట్లు ముట్టించి ఇసుక తిన్నెలపై కూర్చున్నారు. ఫ్రెంచ్ కమాండర్ 'థామస్' భుజాన కెమెరా తగిలించుకుని ఒక చేతిలో రివాల్వర్‌తో మామను తేరిపార చూడసాగాడు. అతడు మేధావి అని ప్రతీతి. మొదట గ్రామానికి వచ్చినప్పుడు పెద్ద పెద్ద పుస్తకాలు తీసుకొచ్చాడు .బాగా చదువుకున్నవాడు. ఫ్రెంచ్ భాష నేర్చుకోవాలనుకున్న వారికి నేర్పేవాడు. సాయంత్రం భోజనం చేసిన తర్వాత పియానో వాయించేవాడు.

నేను నిలబడిన చోటుకు వచ్చాడు. నావంక తేరిపార చూసి, పక్కనున్న సైనికుణ్ణి పిలిచి, ఏదో గుసగుస లాడాడు. నాకు భయం వేసింది. కొంత సేపైన తర్వాత "థామస్" భుజాన వున్న కెమెరా తీసి నావైపు ముందుకు రెండడుగులు వేశాడు. కెమెరాను నాకు గురిపెట్టాడు. వెంటనే నేను ముఖం పక్కకు తిప్పుకున్నాను.

"అమ్మాయి, వెళ్లిపో" అని మామయ్య కేక వేశాడు.

రెండడుగులు వెనుక్కువేసి ఇసుక దిబ్బల మీదుగా ఇళ్లవైపు పరిగెత్తసాగాను. నన్ను వెంబడిస్తున్నారన్న భయంతో వెనక్కి తిరిగి చూడలేదు. కొంతదూరం పరుగెత్తి కొంతదూరం నడచి ఇళ్ల దగ్గరకు చేరిన తర్వాత నిలబడి వెనక్కి తిరిగి చూశాను. ఎవరూ రావడంలేదు. మండుతున్న నావల్ని చూస్తూ నిలబడ్డాను. ఆకస్మాత్తుగా ఇద్దరు తొత్తులు వచ్చి నా ఎడం పక్క నిలబడ్డారు. పరుగెత్తడం ప్రారంభించాను. వారు నా వెంటబడ్డారు. ఎండు చేపల్ని నిల్వచేసే పాకలో దాక్కుంటే తప్పించుకోవచ్చునని భావించి ఆ పాకలో జొరబడ్డాను. ఆ ప్రాంతంలో నరసంచారం లేదు.

గుడిసెలో దూరి ఎండు చేపల గుట్ట వెనుక దాక్కున్నాను. గుండె దడదడా కొట్టుకుంటోంది. బయట భయంకర నిశ్శబ్దం. కాలం గడిచిన కొద్దీ ప్రశాంతత భయంకరంగా తోచసాగింది. అక్కడ వాళ్లంతా పారిపోవడంతో, ఆ ప్రాంతమంతా శ్మశానంలో వుండే ప్రశాంతతలా వుంది. అక్కడే ఆ చేపల గుట్ట పక్కనే చాలాసేపు పడుకున్నాను. లేచి కూర్చుందామనుకుంటూ వుండగా బైట పరుగెత్తుతున్న అడుగుల శబ్దం విన్పించింది. అంతలోనే ఆ ఇద్దరు తొత్తులు గుడిసెలో జొరబడ్డారు. కదలకుండా పడుకున్నాను. మొదట్లో వారు నన్ను చూడలేదు. నేను కనపడకపోయేసరికి ఒకడు నా కోసం వాకిట్లోకి వెళ్లాడు. అది గమనిస్తూ వుండగా రెండవవాడు చేపలగుట్ట ఎక్కాడు. నన్ను చూశాడు. భయంతో బిక్కుబిక్కుమంటూ లేచి నిలబడ్డాను.

"నీ పేరు 'హోవ్'యేనా?" అడిగాడు చిన్న కమాండరు.

నేను అవునన్నట్లు తలూపాను. అతను నవ్వి "నిన్ను అధికారి క్యాంపుకు తీసుకురమ్మన్నాడు" అని చెప్పాడు.

నేను వెనక్కి జరిగితే వాడు ముందుకు జరిగాడు. వెనకనున్న చేపలగుట్టలో కాలుజారి తూలిపోయాను. వెంటనే నిలదొక్కుకుని నిలబడ్డాను. పెద్ద ప్రమాదం ఏదో జరగబోతుందని నాకు తెలుసు. తెగించాను. ధైర్యం చిక్కబట్టుకుని నిటారుగా నిలబడ్డాను. ముఖం మీద పడుతున్న వెంట్రుకలను వెనక్కునెట్టి, "నాతో మీకేం పని? పొండి" అని అరిచాను. ఆ సైనికుడు నా వంక పైకి కిందకి చూసి, "త్వరగా నా వెంటరా!" అన్నాడు.

"నేను రాను!"

"నీవు అందంగా వున్నావు. అవునా" అంటూ అరచి నన్ను పట్టుకోమని పక్కవానికి సైగ చేశాడు. పెద్ద ఎండు చేపను తీసి అతనిపై విసరివేశాను. పక్కకు తప్పుకున్నాడు. రెండోది తీసి విసరబోతుంటే దానిని పట్టుకుని అవతల పారేసి, నన్ను పట్టుకున్నాడు. తీవ్రంగా పెనుగులాడాను. అతను బలవంతుడు. పైగా నన్ను బాలింతను. నన్ను కిందపడదోశాడు. మూడుసార్లు లేచి నిలబడ్డాను. చివరకు ఇద్దరూ కలిసి కింద పడేసి గట్టిగా అదిమి పట్టుకున్నారు. అరిచాను. ఎంతో పెనుగులాడాను. "గుండెలు పగిలేటట్లు అరిచినా లాభంలేదు. నిన్ను ఆదుకునే వారు ఇక్కడ ఎవరూ లేరు" అన్నాడు నన్ను పట్టుకున్నతను.

"పోరా కుక్కా!"

"తిట్టు, త్వరలో ఎవరు కుక్కో అర్థమౌతుందిలే"

అతని చెయ్యి పట్టుకుని కరిచాను. బాధతో అరిచి నా ముఖమ్మీద గుద్దాడు.

"నన్ను కరిచింది. తాడు చూసి దాన్ని కట్టెయ్" అంటూ అరిచాడు. తాడుకోసం రెండవ వాడు బైటకు వెళ్లాడు. తాడు దొరకలేదని త్వరగానే తిరిగొచ్చాడు. బలంగా పడుతున్న అడుగుల చప్పుడు దగ్గరగా వినపడసాగింది.

"లెఫ్టినెంట్ వస్తున్నాడు" అని చిన్న ఉద్యోగి చెప్పాడు.

ఆ మాట వినగానే నా తల తిరిగిపోయింది. 'థామస్' రొజుకుంటూ లోనికి వచ్చాడు. మేధావి అని పేరుపడ్డ అతనిని వివరంగా చూసే అవకాశం కలిగింది.సామాన్య ఎత్తు వుంటాడు. ఎరకోసం దెవులాడే గద్దలాగా అతని కళ్లు నా చుట్టూ తిరుగుతున్నాయి. కళ్లకు జోడు వుంది. ఆకలి గొన్న అడవి జంతువు కళ్లలా అతని కళ్లు వున్నాయి. నన్ను విడిచి పెట్టమని తొత్తును కేకవేశాడు. బైటకు పొమ్మని సైగ చేశాడు.

నాకు దగ్గరగా నిలబడి "నన్ను గుర్తు పట్టావా?" అని అడిగాడు.

భుజం మీద్ద చినిగిన జాకెట్‌ని పైకి లాక్కుంటూ మౌనంగా నిలబడ్డాను.

"నన్ను మర్చి పోయావన్నమాట!" అన్నాడు గంభీరంగా.

"నీ మొగుడు నన్ను ఎరిగివుంటాడు. పట్టణంలో ప్రతివాళ్లు నన్ను ఎరుగుదురు. నీవు నా చేతిలో చిక్కావు. నేను చెప్పినట్లు నడుచుకో. అర్థమైందా? నీకు కూతురుందని తెలిసింది. మంచిది. నీ భర్త తరచూ ఇంటికి వస్తూ వుంటాడా?" అని అడిగాడు.

రాయిలా మౌనంగా నిలబడ్డాను.

"ఇంటికి వచ్చినప్పుడు నన్ను కలుసుకోమని చెప్పు, భయపడవలసిన పనిలేదని కూడా చెప్పు".

"నా భర్త విషయం విడిచి పెట్టండి".

"ఓ! తన భర్తను స్త్రీ సమర్థించడం మెచ్చదగిందే. అతనిని నేనేమీ ఇబ్బంది పెట్టను. నీ విషయం కమాండర్ చూస్తాడు."

తన క్రూర స్వభావాన్ని థామస్ బయట పెట్టేసరికి భయంతో వణికిపోయాను. నన్ను పట్టుకోగానే ముఖం మీద కొట్టాను. తనకేమీ దెబ్బ తగలలేదన్నట్లు నవ్వాడు. ఆ నవ్వు చాలా భయంకరంగా వుంది. మరో రెండు సార్లు అతని ముఖంపై గుద్దాను. గోడకానుకుని నిలబడ్డాను. తన దగ్గరకు గుంజాడు. శక్తి కొలది పెనుగులాడాను. అరిచాను. ఆయాసం వచ్చింది. ఒళ్లంతా చెమటలు పట్టాయి. అయినా, ఆ పశువు నన్ను బాహువుల్లో బంధించాడు. నా శక్తి ఉడికిపోసాగింది. కళ్లు తిరగసాగాయి. అతని కళ్లల్లో కామం సుళ్లు తిరుగుతోంది.

నన్ను నేలమీద పడవేయబోయే సమయానికి సైనికుడొకడు వాకిట్లోకి వచ్చి, "అయ్యా! ముసలివాడు వచ్చాడు" అని చెప్పాడు.

"అక్కడే నిలబెట్టు" అని అరిచాడు.

"నన్ను పోనియ్యి! నాన్నా నాన్నా" అని అరిచాను.

నా శక్తి కొలదీ అరిచాను సహాయం కొరకు. తండ్రి కేక పెట్టడం, పాప ఏడ్పు వినిపించాయి.

♦♦♦

చేపల గుట్టమీద తలపట్టుకుని ఏడుస్తూ కూర్చున్నాను. ఆ రాక్షసుడు తన కామదాహం తీర్చుకుని వెళ్లిపోయాడు. మామయ్య లోనికి వచ్చాడు. చేతిలో పాప వుంది. నా వంక చూస్తూ మౌనంగా నిలబడ్డాడు. అయినా తలవంచుకునే బిగ్గరగా ఏడవసాగాను. మామయ్య ఏదో చెప్పాలనుకున్నాడు. కానీ సమయం కాదేమోనని ఊరుకున్నాడు. పాప ఏడవసాగింది. అప్పుడు మామయ్య నాదగ్గరకు నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ వచ్చి, "అమ్మాయ్! ఏడవకు, పాప కూడా ఏడుస్తుంది" మీ ఇద్దరూ ఏడుస్తుంటే ఎవరిని ఓదార్చాలో తెలియడం లేదు. ఉదయం ఎప్పుడో పాలిచ్చావ్. పాలు ఇవ్వు".

పాప విషయం చెప్పగానే పాలిచ్చే విషయం అప్పుడు గుర్తుకు వచ్చింది. శరీరమంతా మట్టి కొట్టుకుని, బట్టలు చినిగిపోయిన విషయం అప్పుడు గుర్తుకు వచ్చింది. చుట్టూ అసహ్యంగా వుంది. ఎండు చేపలు చిందరవందరగా పడి వున్నాయి. భరించరానంత కంపు కొడుతోంది. నాకు జరిగిన అవమానపు గుర్తులు ప్రతి వస్తువుమీదా కనపడుతున్నాయి. అవి చూడగానే మరింత అవమాన పడిపోయాను. ఏడ్చి సొమ్మసిల్లిన బిడ్డ, మామయ్య నా మీద చూపించిన దయ గుర్తుకు రాగానే ఏడుపు ఆపుకోలేకపోయాను. మళ్లీ బిగ్గరగా ఏడ్చాను. లేచి బయటకు వెళ్లి, బీచ్‌వెంట పరుగెత్తసాగాను. సూర్యుడు పడమటి దిక్కుకు చేరుకున్నాడు. సూర్య కిరణాలు సముద్ర అలలపై పడి రాగరంజితం చేస్తున్నాయి. ఆకాశమంతా చీకట్లు అలముకుంటున్నాయి.

(తన శరీరానికి, మనసుకు అంత పెద్ద గాయం అయ్యాక హోవ్ ఏం చేసింది? ఆమె మామయ్య ఏమన్నాడు? పాప ఏమైంది? వంటి వివరాలు తెలియాలంటే... మరో ఏడు రోజులు వేచి చూడాల్సిందే)

తేడాలేంటో చెప్తారా?

హాలో నేస్తాలూ! ఈ రెండు ఫొటోలు చూడ్డానికి ఒకేలా వున్నా వీటిమధ్య ఆరు తేడాలున్నాయి. అవేంటో చెప్పేయండి.

దారి వెతకాలోచ్



నిఖత్ ఖాతున్,
7వ తరగతి,
ఈడెన్ హైస్కూల్,
మౌలాలి,
హైదరాబాద్.

ఎక్కడున్నాయో...

హాయ్ నేస్తాలూ... కింది బొమ్మలో కొన్ని వస్తువులు, ప్రాణులు వున్నాయి. అవేంటంటే అగ్గిపుల్ల, నిచ్చెన, పుట్టగొడుగు, దువ్వెన, పక్షి, చేప, సాక్సు, బాల్, కొవ్వొత్తి, ఫాంట్, ఎన్వలప్ కవర్. అవి ఎక్కడున్నాయో కనిపెట్టి సున్నా చుట్టండే.

బాలనేస్తాలు

నేర్చుకుందాం





చుక్కలు కలిపేద్దామా...



ఏమున్నాయ్...

ఫ్రెండ్స్... ఇక్కడ మీకు కనిపించిన జంతువు ఏదో చెప్పండి. ఏంటీ ఏం అర్థం కావడంలేదు కదూ. "ఇక్కడ ఒక్క జంతువు కాదు బోలెడు జంతువుల శరీర భాగాలు కనిపిస్తున్నాయిగా" అంటున్నారా. మరైతే ఏభాగం ఏ జంతువుదో చెప్పేయండి.

కరెక్టుగా రాసేద్దాం

ఫ్రెండ్స్.... మీకు టీవీలో కార్టూన్ చానళ్లు చూడడమంటే చాలా ఇష్టం కదా. దానికి సంబంధించిన పదాలు కింద వున్నాయి. వాటిని సరైన క్రమంలో రాయండి. 1.OCUHC, 2.ORONPCP, 3.PHERSOURE, 4.MTRORE, 5.ESAWRNPEP, 6.SEAHTUMC. రాసేశాక మాజవాబులు చూస్తారుగా.



జవాబులు

తేడాలేంటో చెప్తారా... : 1. ఎడమవైపు ఉన్న వ్యక్తి మీసాలు. 2. నిద్రపోతున్న ఆమె చేతిలోని హ్యాండ్‌బాగ్. 3. పాప్‌కార్న్ పట్టుకున్న ఆమె జుత్తు. 4. పాప్‌కార్న్ పాకెట్ పట్టుకున్న ఆమె చెవి రింగు. 5. కుడివైపు కూర్చున్న ఆమె నోరు. 6. కూల్‌డ్రింక్ తాగుతున్న పిల్లవాడి కళ్లు.

ఏమున్నాయ్. : జీబ్రా చర్మం, కంగారు దేహం, పొటేలు కొమ్ములు, గాడిద ముఖం.

కరెక్టుగా రాసేద్దాం... : 1.Couch, 2.Popcorn, 3.Superhero, 4.Remote, 5.Newspaper, 6.Mustache.

ఎక్కడున్నాయో...



క్రైమ్ కథ

డీల్

- యర్నాగుల సుధాకరరావు

శ్యామ్‌లాల్ ఠాణాలోంచి బయటికి వచ్చి మోటార్‌బైక్ ఎక్కి వెడుతుండగా అక్కడ సమీపంలో ఆగి ఉన్న లారీ కదిలింది. శ్యామ్‌లాల్ చూశాడు. ఎందుకో ఆ లారీని అనుమానించి, రోడ్డుపక్కనే మోటార్‌బైక్ ఆపాడు. లారీ కూడా ఆగింది.

ఠాణాలోకి వస్తున్న శ్యామ్‌లాల్‌ని చూసి పెద్దగా ఆవులిస్తూ "మళ్లీ ఫోన్లు వస్తున్నాయా? ఇప్పుడు మాత్రం నిన్ను ఏదో చేస్తే ఏమవుతుంది? నువ్వు ఆరోజు చెప్పబట్టి కోర్టు హంతకుడిగా గుర్తించి అజీజ్‌కు యావజ్జీవ శిక్షవేసింది. ఇప్పుడు వాడు సెంట్రల్ జైల్లో మగ్గుతున్నాడు. ఇప్పుడు నిన్నేం చేసినా వాడికి శిక్ష తగ్గదు. ఎవరో ఫోన్లు చేసి నిన్ను ఆట పట్టిస్తున్నారు" అని ఇన్‌స్పెక్టర్ చెప్పాడు.

"సాక్ష్యం చెప్పినందున నాకు తెలియకుండానే నన్ను చంపే ప్రయత్నం ఒకటి నా చుట్టూ జరుగుతోంది. గతవారం కోర్టులో నా సాక్ష్యం రికార్డు అవుతుండనగా ఆ రోజు నాకు ఒక విచిత్రమైన ఫోన్ వచ్చింది. 'నువ్వు సాక్షిగా కోర్టుకు వెళ్లడమే తప్పు. సరే పోలీసులు నిన్ను సాక్షిని చేశారు. ఇప్పటికైనా మించిపోయింది లేదు. నువ్వు ఆ హత్య చూడలేదు అని చెప్పి తప్పించేసుకో! నిన్ను కోర్టులో నిలిపిన అప్పటి పోలీసులు ఇప్పుడు లేనేలేరు. నిన్ను ఎవరూ బలవంతం చేయరు' అని ఆ ఫోన్‌కాల్. అయితే నేనేమి బదులీయలేదు. తీరా కోర్టులో జడ్జి కలుగజేసుకుని ప్రశ్నలు కురిపిస్తే నేను బదులిచ్చాను. ఒకరకంగా ఆ హత్య నేను చూశాను అని చెప్పక తప్పింది కాదు" అని చెప్పాడు శ్యామ్‌లాల్. ఇన్‌స్పెక్టర్ అసహనంగా చూశాడు.

"నిజం సార్! నా చుట్టూ ఏదో వుచ్చు బిగుసుకుంటోంది. నేను రోడ్డుమీద నుంచి వెడుతుంటే ఒక మినీ లారీ నా పక్కనుంచి దూసుకుపోయింది. తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నాను. లేకుంటే ఈపాటికి చచ్చేవాడిని. అలాగే ఒక విందుకు హాజరై మెట్లు ఎక్కుతుంటే నన్ను పై అంతస్తులోంచి ఎవరో నెట్టేశారు. అప్పుడూ లక్కీగా నేను గజాలలో చిక్కుకుని బతికాను. ఉదయం లేచిన దగ్గరి నుంచి ఏదో ఒక అనర్థం దాపురిస్తూనే ఉంది"

"అయితే మమ్మల్ని ఏం చేయమంటావు? ఇక్కడ పోలీస్ ఠాణాకు తాళాలు వేసి నీవెంట తిరగమంటావా? నువ్వు చెప్పిందంతా ఎలా ఉందంటే నీవో రాకుమారుడిలా దినదినగండం దీర్ఘాయుష్షులా ఉంది. అవన్నీ కాకతాళీయంగా జరిగాయి. జాగ్రత్తగా ఉండు. నిన్ను పైఅంతస్తులోంచి నెట్టేసినవాణ్ణి చూశావా? లేదా?"

"చూడలేదు సార్!"

"అదీ నేనే కనిపెట్టాలా? నీకెవడిపైన అనుమానం ఉందో చెప్పు. తెచ్చి సెల్‌లో పడేసి ఒకగంట నాది కాదనుకుంటే మొత్తం నిజాలు కక్కుతాడు"

"ఎవరిమీదా అనుమానం లేదు సార్!"

"అయితే నీకు ఎవడిమీదైనా అనుమానం వస్తే వచ్చి అప్పుడు ఇక్కడ ఫిర్యాదు చెయ్. అంతవరకు ఇలా ఆట కబుర్లతో వచ్చి మమ్మల్ని విసిగించకు. నా సెల్‌నెంబర్ నోట్ చేసుకో!" చెప్పి పంపేశాడు.

శ్యామ్‌లాల్ ఠాణాలోంచి బయటికి వచ్చి మోటార్‌బైక్ ఎక్కి వెడుతుండగా అక్కడ సమీపంలో ఆగి ఉన్న లారీ కదిలింది. శ్యామ్‌లాల్ చూశాడు. ఎందుకో ఆ లారీని అనుమానించి, రోడ్డుపక్కనే మోటార్‌బైక్ ఆపాడు. లారీ కూడా ఆగింది. కచ్చితంగా అనుమానించాల్సిందేనని అనుకున్నాడు. బైక్‌లో ఏదో బాగుచేస్తున్నట్టు నటిస్తూనే లారీలో వారు చూడకుండా సెల్‌లో ఇన్‌స్పెక్టర్‌కు చెప్పాడు.

దగ్గర్లో ఉన్న ఠాణాలోంచి ఇన్‌స్పెక్టర్ కొద్దిదూరంలో ఆగి ఉన్న లారీని పట్టుకుని అందులో ఉన్న వారిని తీసుకురమ్మని మెన్‌కు చెప్పాడు. లారీలో ఉన్న ఇద్దరినీ దించి తీసుకుని వస్తుండగా ఒకడు పారిపోబోయాడు. వాడిని పట్టుకుని నాలుగు కొట్టి తెచ్చి ఇన్‌స్పెక్టర్ ముందు నిలబెట్టారు. "ఎవర్రా మీరు? లారీ డ్రైవర్లలా లేరు. గూండాల్లా ఉన్నారు. మీ లారీ ఓనర్ ఎవడు?"

ఆ ప్రశ్నకు నీళ్లనమిలారు.

"చావగొట్టించుకోకుండా చెప్పండి"

కథ చెప్పక తప్పలేదు. "ప్రస్తుతం జైల్లో ఉన్న అజీజ్ వద్ద మేము రెండులక్షలకు ఒక పని ఒప్పుకున్నాం. కోర్టులో సాక్ష్యం చెప్పకుండా చూడమన్నాడు. అందుకు సిద్ధపడి నయానా భయాన ఈ శ్యామ్‌లాల్‌ను ఫోన్‌లో హెచ్చరించాం. వీడు చెప్పనని మొత్తం చెప్పేశాడు. ఒప్పందం నీరుగారి పోయింది. దాంతో మేము చాలా ఇబ్బందులు పడ్డాం. అనుకున్న డీల్ ఫెయిల్ అయ్యింది. సరేనని మేము వదిలేశాం. అయితే ఈ శ్యామ్‌లాల్ మా సెల్ నెంబర్‌తో ఆరాలు తీసి మమ్మల్ని చంపేయమని గూండాలను కుదుర్చుకున్నాడు. వాళ్లు మా గురించి తెలుసుకునేంత సమీపంలోకి వచ్చారు. ఇప్పుడు మాకు ప్రాణభయం పట్టుకుంది. కనుక వీడిని వదలకూడదని ఒక నిర్ణయానికి వచ్చాం. నాలుగైదు సార్లు ఎటెమ్ట్ చేశాం. వీడు ప్రతిక్షణం అలర్టుగానే ఉంటాడు. మాకు స్పాట్ పెట్టిన వాడంటే ఎలా ఉంటాడో మీకు తెలియంది కాదు. ఇక్కడ మాకు ఒక్కరూపాయి రాలేదు. కానీ, మా ప్రాణాలను అరచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితిలో ఉన్నాం. వీడి పనిపట్టాలని కాపుకాశాం. మీకు దొరికాం. వాస్తవానికి అజీజ్‌కు శిక్షపడడంతో వీడిగురించి ఎవరూ పట్టించుకోలేదు. వీడు మమ్మల్ని లేపేసే కార్యక్రమంలో ఉన్నాడు. ఏం చేయమంటారు సార్?"

శ్యామ్‌లాల్ ఆ మాటలు వింటూనే బిక్కముఖం వేశాడు.

"ఏమిటిదంతా నువ్వు చాలా తెలివైనవాడివే. పడుకున్నవారిని లేపి తన్నించుకోవడమంటే ఇదేనేమో! నీ గూండాలను ఎంత రేటుకు కుదుర్చుకున్నావు? వీరెలా అన్నీ చెప్పేశారో నువ్వూ అలానే చెప్పు. మారాం చేస్తే వదలను" ఇన్‌స్పెక్టర్ గుర్రెత్తిపోయాడు.

"నా ప్రాణభయంతో నేను గూండాలను కుదుర్చుకున్నది నిజమే. వారికి వీరు ఎవరైంది నేటికి తెలిసిపోయింది. డ్రైవర్లుగా ఫలానా లారీకి తిరుగుతున్నారు అని ఈరోజు ఉదయం చెప్పారు. త్వరలో వేసేస్తాం అనికూడా చెప్పారు. ఇప్పుడు నాకు ఒకాలోచన వచ్చింది మర్డర్ డీల్ రెండులక్షలు ఎందుకు ఖర్చు పెట్టడం అని వారిని పోలీసులకు పట్టిద్దామనుకున్నాను. లక్కీగా ఆ లారీ కన్పించింది. నేరుగా పోలీస్‌ఠాణాకు వచ్చాను. మీకు ఫలానా అని చెప్తే కథ మరోలా ఉంటుందని ఎవరో నన్ను చంపాలనుకుంటున్నారు అని పాతకథే చెప్పి నేను బయటికి వచ్చాను. లారీ నన్ను వెంబడించడంతో సెల్‌లో మీకు చెప్పి పట్టించాను. వీళ్లు ఎంతైనా గూండాలు కదా నన్ను మించి ఉన్నారు. నేను చేసిన నిర్వాకం వీరికి తెలిసిపోయింది. నా తెలివితేటల మీద నీళ్లు జల్లారు"

"ఆరిపిడుగా! నీ బుర్ర పాదరసం లాంటిదే' అని ఇన్‌స్పెక్టర్ లారీతో టపీమని కొట్టి ముగ్గుర్నీ సెల్‌లోకి నెట్టేశాడు.

ఇన్‌స్పెక్టర్ ఆ సాయంత్రానికి శ్యామ్‌లాల్ నియమించిన మరో ఇద్దరు గూండాలను అరెస్టు చేసి తీసుకుని వచ్చాడు. వారు కథ విని శ్యామ్‌లాల్‌ను తినేశాలా చూశారు. "మాతో ఆ గూండాలను చంపమని చెప్పి వారి గుట్టు తెలుసుకుని పోలీసులకు అప్పగించి మర్డర్‌డీల్‌ను నీరు గార్చాలనుకున్నావా! నువ్వు సామాన్యుడివి కావు. మమ్మల్ని మించిన గూండావి" అని నోళ్లు తెరిచారు.

★

వేడి ఏడాది



ఉత్తరార్ధగోళంలో అనూహ్యంగా విపరీతమైన మంచుతో శీతాకాలం వణికిస్తోంది. మంచు కొత్త కాని అమెరికా, కాశ్మీర్ వాసులనే ఈ సారి అది గజగజలాడిస్తోంది. ఒక పక్క గ్లోబల్ వార్మింగ్ అని హోరెత్తిస్తుంటే ఇలా చలి చంపుతుందేమిటనే వాదన పెరుగుతోంది. 'కంగారు పడకండి, రాబోయే రోజుల్లో పుష్కలమైన వేడిని అనుభవిద్దురుగాని' అంటున్నారు వాతావరణవేత్తలు.

ఈ సంవత్సరం రికార్డు స్థాయిలో వేడి ఏడాదిగా నమోదు కానుంది. భూగోళంపై పెరుగుతున్న ఉష్ణోగ్రతలను నమోదు చేయడం ప్రారంభించాక 1998లో మాత్రమే అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. మళ్లీ 12 ఏళ్లకు అటువంటి అధిక వేడి ప్రపంచం అనుభవించనుంది. గత దశాబ్దంలో రికార్డు స్థాయి వేడి నమోదు కాలేదు అంటే అసలు భూగోళం వేడెక్కలేదు అని అర్థం కాదు. వాస్తవానికి ఉష్ణోగ్రతలు ఏడాదికేడాది పెరుగుతూనే ఉన్నా అటువంటి వేడిమి కొన్ని ప్రత్యేకమైన ప్రదేశాలలో నిక్షిప్తమై ఉండే అవకాశముంది. ఉదాహరణకు మహా సముద్రాలపై వేడి ఉంటే వాతావరణ అధ్యయనాలకు అందకపోవచ్చు. ఆ విధంగా గత దశాబ్ద కాలంలో ఉష్ణోగ్రతలు పెరిగినా, పెరిగినట్టుగా తెలియలేదు.

నిజానికి ఈ సంవత్సరం గతం కంటే వేడిగా ఉండడానికి కారణం కూడా అదే. పసిఫిక్ మహా సముద్రంపై వేడి కూడుకుంటోంది. ఇలా కొన్ని సంవత్సరాలుగా పేరుకున్న వేడి వాతావరణంలోకి విడుదల అవుతుంది. ఈ ప్రక్రియను ఎల్‌నినో అంటారు. ఇటువంటి శక్తివంతమైన నినోమ వల్లనే 1998లో భూమి మీద వేడిమి పెరిగిపోయింది. కాని, 2007, 2008లో ఎల్‌నినోకి వ్యతిరేక ప్రక్రియ జరిగింది. అది చల్లబరిచే నిన. ఆ కారణంగానే గత దశాబ్ద ప్రమాణాలతో పోల్చితే ఆ రెండు సంవత్సరాలు చాలా చల్లగా ఉన్నట్టే లెక్క.

ఎల్‌నినోకి తోడు సూర్యరశ్మి ఉంది. ప్రతి 11 సంవత్సరాలకు సూర్యకాంతి వ్యత్యాసం చూపుతూ ఉంటుంది. ఒక రకంగా ఈ వ్యత్యాసం అంత పెద్దదేమీ కాకపోయినా గరిష్ట, కనిష్ట పరిమితులలో గమనించదగ్గ మార్పు చూపుతుంది. గత సంవత్సరం, సూర్యుడు 11 సంవత్సరాల చక్రంలో నిమ్న స్థాయిలో ఉన్నాడు. కాబట్టి, మరో అనూహ్య కారణం లేని పక్షంలో ఈ ఏడాది సూర్యరశ్మి పెరుగుతూ పోతుంది.

గత దశాబ్దంలో విపరీతంగా పెరిగిన హరిత గృహ వాయువులు నిక్షిప్తం చేసుకున్న వేడి ఏమై ఉంటుందో నిర్ధారించే వీలు కలిగింది. పెరిగిన వేడిమిని సముద్రాలు సోషించుకున్నాయి. ఆ సమయంలో పెరిగిన సముద్ర మట్టం కూడా ఈ వాస్తవాన్ని బలపరుస్తుంది. అంటే, గ్లేషియర్లు, మంచు పొరలు కరిగిన తరువాత కూడా, వేడి వల్ల సముద్ర జలం వ్యాపించి ఉంటుంది. గత దశాబ్దంలో జరిగిన ఈ పరిణామం తరువాత అసలు సమస్య ప్రారంభమైంది.

సముద్ర మట్టం పెరగడానికి కరుగుతున్న మంచు పాత్ర అధికమై, వేడి నీరు వ్యాపించడం అన్న కారణం బలహీనపడింది. మరి పెరిగిన వేడి సముద్రాలపై కాక మరెక్కడికో వెళ్లి ఉండాలి.

ఒక దారి, ఆ వేడిమబ్బుల వల్ల వాతావరణంలోకి తిరిగి పంపించి ఉండాలి. కాని, మనకు లభించిన సమాచారం ప్రకారం అలా జరగలేదు. భూమి ఎక్కువ వేడిని పీల్చుకుని తక్కువ వేడిని పైకి వదిలిందని అంతరిక్షంలో తిరుగాడుతున్న 6 ఉపగ్రహాలలోని 7 వేర్వేరు సాధనాలు తేల్చాయి.

కోపెన్‌హాగెన్ సదస్సులో ఈ సంవత్సరం ఉష్ణోగ్రతలు సగటున 14.58 డిగ్రీల వరకు ఉంటాయని అంచనా వేశారు. ఇది 1998 సగటు కంటే 0.6 డిగ్రీలు ఎక్కువ, అయితే ఎల్‌నినో ప్రభావం తగ్గినా లేదా ఫిలిప్పైన్స్‌లో 1991లో పినతుబో అనే అగ్ని పర్వతం విస్ఫోటనం వంటిది జరిగినా ఈ సంవత్సరపు వేడిమి తక్కువగానే ఉండే అవకాశం ఉంది. అటువంటి సందర్భాలలో విడుదలైన ధూళి కొన్ని నెలల పాటు వాతావరణంలో ఉండిపోయి సూర్యరశ్మిని అడ్డుకుంటుంది. కాని, అటువంటి అవకాశాలు చాలా తక్కువని వాతావరణవేత్తల అభిప్రాయం.

అయితే ఈ సమతుల్యాల సమస్య కేవలం మన అజ్ఞానం వల్ల ఉద్భవించిందేనని నిపుణులు అంటున్నారు. మరింత మెరుగైన అధ్యయనాలు ఈ సమస్యను పరిష్కరించి వాతావరణ పరిస్థితిని మరింత కచ్చితంగా అంచనా వేసేందుకు దోహద పడతాయని ఆశిస్తున్నారు. ఏదేమైనా, ఈ కొత్త సంవత్సరం వేడి వేడిగా ఉండబోతుందన్నది నిజం. అందుకు కారణం కచ్చితంగా మనమే.

- డా॥కాకర్లమూడి విజయ్

వెయ్యేళ్ల కోవెల

అల్లంత దూరంలో ఉండగానే సందర్శకులు కళ్లార్పకుండా సంభ్రమాశ్చర్యాలతో ఆ గాంభీర్యమైన కట్టడాన్ని చూస్తూ ఉండిపోతారు. అయితే సందర్శనానంతరం అక్కడి నుంచి వెళ్లబోయే ముందు ఓ సుదీర్ఘ నిట్టూర్పు విడుస్తారు. అక్కడ అడుగుపెట్టిన ప్రతి ఒక్కరినీ ఆ ప్రదేశం ప్రకృతి సౌందర్యంతో, ప్రాచీన కట్టడాలతో హత్తుకుంటుంది. ఎన్ని సార్లు చూసినా తనివి తీరని ప్రదేశం అది. అదే తంజావూరులోని లక్ష్మీ విశ్వనాథాలయం. నేటికీ ఇది కళలు, సంస్కృతి, మతం, భాష, పాలన, వ్యాపార సంబంధ, నిర్మాణ సంబంధిత చరిత్ర గ్రంథాలలో పేర్కొన్న అంశాలకు నిలువెత్తు సాక్ష్యంగా నిలిచింది.

తంజావూరు లక్ష్మీ విశ్వనాథాలయానికి ఈ సంవత్సరంతో 1000 సంవత్సరాలు పూర్తయింది. ఈ సుందర ఆలయాన్ని చోళ రాజు అయిన రాజరాజు 1010 సంవత్సరంలో నిర్మించాడు. సరిగ్గా చెప్పుకోవాలంటే తను సింహాసనాన్ని అధిష్టించిన పాతికేళ్లకు ఈ ఆలయ నిర్మాణం తలపెట్టారు. లోకేశ్వరుడిగా భావించే శివుడిని ఈ ఆలయంలో బృహదీశ్వరుడిగా కొలుస్తారు. ప్రాచీన కాలంలోని సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించిన అత్యద్భుత కట్టడం ఇది.

ఆకాశాన్నంటే గోపురం

అసాధారణంగా ఉండే ఈ ఆలయ గోపురం సందర్శకులను ఎంతగానో ఆకర్షిస్తుంది. ఈ ఆలయ గర్భగుడిలో పెద్ద శివలింగం ఉంటుంది. 216 అడుగుల ఎత్తున్న ఈ లింగం ఆకాశాన్ని తాకుతున్నట్టు అనిపిస్తుంది. తమిళుల చరిత్రను చాటి చెప్పే ఆలయమిది. ఈ ఆలయం ఇప్పటికీ చెక్కు చెదరలేదు. నంది, దేవదూతల విగ్రహాలు... భారీ పరిమాణంలో రూపొందించినవే. ఏకశిలా నంది, 12 అడుగుల ద్వారపాలకులు ఇక్కడ కనిపిస్తారు. గర్భగుడి చుట్టూ గూళ్లలో చెక్కిన దేవతల విగ్రహాలు చూడ ముచ్చటగా నిరాడంబరంగా ఉంటాయి. దక్షిణమూర్తి, యోగలక్ష్మి ముఖారవిందాలను చూస్తుంటే నిజంగా వారు ప్రత్యక్షమయ్యారా అన్నట్టు ఉంటాయా శిల్పాలు.

81 నృత్య భంగిమలు

గర్భగుడికి దగ్గరలో గుహను పోలి ఉన్న ఒక వసారా ఉంటుంది. దానిని చాలా అరుదుగా సందర్శనార్థం తెరుస్తుంటారు. ఇక్కడ చోళుల నాటి శిల్పాలు రాజుల చిత్రాలు ఉన్నాయి. చిత్రపటాలు, ప్రజలలో భక్తి భావాన్ని పెంచే పాటలు పాడుతున్న రుషుల చిత్రాలు ఎంతగానో ఆకట్టుకుంటాయి. ఆ చిత్రాలు వివిధ ముఖ కవళికలతో దైనందిన జీవితానికి చాలా దగ్గరగా అనిపిస్తాయి. వీటిలో ఎక్కువగా రాజుకు నచ్చిన, మెచ్చిన అంశాలకు సంబంధించినవే. దక్షిణ మూర్తి, తిల్లైలోని నటరాజు, వేడుకలను జరుపుకుంటున్న నాట్యకారులు, రుషులు, త్రిపురాంతక, యోధుడు వంటి చిత్రాలు చోళుల చిత్ర కళానైపుణ్యానికి తార్కాణాలు. ఒక గోడ మీద సుందరరామమూర్తి నాయనర్ కైలాసకు ఐరావతం మీద వెళ్తున్న కథను దృశ్య రూపంలో కళ్లకు కట్టినట్లుగా వివరించారు. 17వ శతాబ్దపు నాటి రంగులైనప్పటికి నేటికీ ఆ చిత్రాలలో జీవకళ ఉట్టిపడుతుంది. రాజరాజు గురువు కరువూర్ దేవర్. ఈయనే ఈ ఆలయానికి మూలకారకుడు. ముఖ్య ఆలయానికి ముందున్న ఒక ఆలయాన్ని



రాజరాజు

బృహదీశ్వరుడి కోవెల

ఆయనకు అంకితమిచ్చారు. ఆ ఆలయంలో ఆయనకిష్టమైన నాట్యశాస్త్రంలోని శివుని 81 నృత్య భంగిమలు మనం చూడొచ్చు. అవి చూస్తుంటే స్వయంగా శివుని నాట్యం చూసిన అనుభూతి కలుగుతుంది. ఈ శిల్పాలు చిదంబరం, ఇతర ఆలయాల్లోని శిల్పాల కంటే చాలా పెద్దగా ఉంటాయి.

రాజరాజు ప్రత్యేకతలు

రాజరాజు అసాధారణమైన శక్తిసామర్థ్యం, పరాక్రమం కలిగిన రాజు. ఆయన కిరీటంలో వజ్రవైఢూర్యాలు పొదిగి ఉండేవి. ఆయనకు తనదైన ప్రత్యేక శైలి వుండేది. ఆయన కళలు, వాస్తు శిల్పకళా శాస్త్రంలో ప్రావీణ్యులు. ఆయన శివుణ్ణి ఆరాధ్య దైవంగా కొలిచేవాడు. తమిళుల వాస్తు శిల్పకళాశాస్త్రాన్ని అవపోసనపట్టిన ఒక తమిళ రాజు అటువంటి ఆలయాన్ని రూపొందించడం గర్వించదగ్గ విషయం. ఈ ఆలయంలోని శివుణ్ణి బృహదీశ్వరుడు అంటారు.

విశాలమైన ప్రాంగణంలో ఈ ఆలయాన్ని నిర్మించారు. ఆలయం చుట్టూ చక్కటి అగడ్త ఉంటుంది. ఆనాడు అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఆలయ గోపురాన్ని నిర్మించారు. ఆలయ శిఖరాగ్రానున్న రాయి బరువు 80 టన్నులు. అంత బరువైన రాతిని ఆధునిక సాధనాలేవీ లేని కాలంలో అంత ఎత్తుకు ఎలా లేపారనేది ఇప్పటికీ ఇంజనీర్లలో చర్చనీయాంశమే. చిదంబర రహస్యమే. సందర్శకులను అబ్బుర పరిచే ఆలయ గోపురం మీది కళా నైపుణ్యం మాత్రం దక్షిణ భారతీయ కళాకారులదే. శిల్పులు, భవన నిర్మాణ శాస్త్రజ్ఞులు కలిసి తమ కాల్పనిక ఊహలకు రూపమిచ్చారు. త్రికోణాకారంలో కనిపించే ఆలయ గోపురం మీద చెక్కిన డిజైన్లన్నీ పెన్సిల్‌తో గీసినట్టు చక్కగా పేర్చినట్టుంటాయి. అంతేకాదు ఇది కైలాస పర్వతాకారంలో దర్శనమిస్తుంది.

దేవదాసీల పేర్లూ ఆలయగోడలపై...

ఆలయంలోని అధిక శాతం శిలాశాసనాలు రాజరాజచోళుడు, అతని వారసుల పరిపాలనా విశేషాలను తెలిపేవే. వీటిప్రకారం మనకు కొన్ని విషయాలు తెలుస్తాయి. ఈ ఆలయ నిర్వహణ కోసం రాజరాజు అనేక గ్రామాలను, డబ్బును, వజ్రాలను ఇచ్చాడు. రోజూ దైవారాధనకు, పండుగలకు, పాటలు పాడేందుకు, నాట్యాలు చేసేందుకు వాటిని ఉపయోగించేవారు. ఆయన, ఆయన రాణులు కూడా బంగారం, వజ్రవైఢూర్యాలు పొదిగిన నగలు ఆ ఆలయ నిర్వహణ కోసం ఇచ్చారు. ఆయన, ఆయన ప్రియసతి రాణి లోకమహాదేవి, ఆయన సోదరి కుందవి ఇచ్చిన విరాళాలను గర్భగుడికి దగ్గరలోని రాతి మీద నమోదుచేసి ఉన్నాయి. వీటన్నిటి కంటే విచిత్రమైన శాసనమొకటుంది. అది దేవతలకు సంబంధించినది. ఆ ప్రాంతంలోని ఆలయాల్లో పనిచేయడానికి కేటాయించిన 400 మంది దేవదాసీల కోసం రెండు వీధులనే కేటాయించారు. మరో విచిత్రమేమంటే వారందరి పేర్లు, పుట్టిన గ్రామాలు, ఇంటినెంబరు తదితర వివరాలను కూడా ఆలయగోడల మీద చెక్కారు. అంతేకాదు! ప్రజలనుంచి సేకరించిన పన్నులను తిరిగి వారికోసం ఖర్చుచేసేవారు. సాగునీటిపారుదల సౌకర్యాలు, ఆసుపత్రులు, పాఠశాలలు, ధాన్యాగారాలు నిర్మించేవారు. రాజు, రాణి ఈ విషయంలో సైనికులకు, వ్యాపారులకు ఒక నమూనాగా ఉండేవారని కూడా వీటి ద్వారా తెలుస్తోంది.

రాజరాజు కాలంలోని విగ్రహాలలో కంచుతో చేసిన నటరాజు విగ్రహం చాలా అద్భుతంగా ఉంటుంది. దానిని అదవల్లన్ అని అనేవారు. ఆయన పరిపాలనాకాలంలో చెలామణిలో ఉన్న డబ్బును 'అదవల్లన్' అని పిలిచేవారు.

సుబ్రమణ్యస్వామి మఠం

రాజరాజు తతరువాత కాలంలో ఈ ఆలయంలో ఎన్నో మార్పులు చేర్పులు చోటుచేసుకున్నాయి. సేవప్ప నాయక్ కాలంలో ఈ ఆలయం లోపల సుబ్రమణ్యస్వామి మఠాన్ని నిర్మించారు. ఇక్కడ అద్భుతమైన శిల్పసౌందర్యముంది. ఒక్కో స్థంభం మీద చెక్కిన డిజైన్లు చూస్తుంటే మతిపోవాల్సిందే. ఎంతో సృజనాత్మకంగా, విభిన్నంగా, మనోహరంగా ఉంటాయి. ఎవరైనా ఆర్టిస్టు వీటన్నిటినీ కాపీ చేసుకోవాలని అనుకున్నాడనుకోండి! ఆ పని చేయడానికి వారాలు కాదాగదా నెలలు కూడా చాలవు. ఒక్కో శిల్పికి వీటిని చెక్కడానికి ఎంత సమయం పట్టిందో దీన్ని బట్టి ఊహించుకోండి. ఈ ఆలయం ముందు భాగంలో మండపం ఒకటుంది. మారర కాలం నాటి బొమ్మలు అనేకం ఉంటాయి. వాటినే ఇప్పుడు మనం తంజావూర్ పెయింటింగులంటాం. వాటిలో బంగారు ఆకులు, సరఫోజి రాజు, ఆయన రాణి బొమ్మలు కనువిందు చేస్తాయి.

ఇది ఒక రోజు ప్రోగ్రామ్

ఇంత పెద్ద ఆలయాన్ని చూడడానికి ఒక రోజు పూర్తిగా పడుతుంది. మళ్లీ మళ్లీ వెళ్లి వాటి అందాన్ని తనివితీరా చూడాలనిపిస్తుంది. కావేరి నది ఒడ్డున ఎంతో మంది రాజులు శివాలయాలు నిర్మించారు. వాటిలో బృహదీశ్వరాలయం ప్రత్యేకమైనది. ఎందుకంటే చరిత్ర పుటల్లో వేయి వత్సరాల వయసు కలిగిన ఆలయం కదా! ★

బృహదీశ్వరుడి కోవెల లోపలి భాగం...

నవ్వుల్ - పువ్వుల్

జబ్బు కాదు

ఒక లాయర్ డాక్టర్ దగ్గరకు వెళ్ళాడు

లాయర్ : డాక్టర్ గారూ! ఈ మధ్య కోర్టులో వాదిస్తుంటే మాటలు తడబడుతున్నాయి. గొంతు ఎండి పోతుంది.

డాక్టరు : అదేమీ జబ్బు కాదులెండి. అబద్ధాలు చెప్పేటప్పుడు అలాగే జరుగుతుంది.

అసలు వయసెంత?

లేడీస్ క్లబ్‌లో పార్టీ జరుగుతోంది. అందంగా అలంకరించుకున్న వారు కోలాహలంగా తిరుగుతూ కబుర్లు చెప్పేసుకుంటున్నారు.

వనజాక్షి : ఈ డ్రెస్ వేసుకుని, హ్యాట్ పెట్టుకుంటే నేను చాలా చిన్న దానిలా కనిపిస్తానని మా వారు అంటుంటారు.

జయలక్ష్మి : వయసెంత?

వనజాక్షి : ముప్పై

జయలక్ష్మి : నేను అడిగింది ఈ డ్రస్సులో ఉన్నపుడు కాదు మామూలుగా మీ అసలు వయసు ఎంత అని.

పెళ్ళి కానుక

నూతన దంపతులకు పెళ్ళి కానుక ఏదైనా కొని ఇవ్వాలని పెయింటింగ్ షాపు కెళ్ళాడు శ్రీహరి. ఒక చిత్రం అతడిని ఆకర్షించింది.

శ్రీహరి : అదేమిటి?

షాపు యజమాని : అదా! రాబోయే తుఫానుని సూచించే చిత్రం సార్! పెళ్ళి కానుక లివ్వడానికి ఇలాంటివే చాలా బావుంటాయి.

ఇష్టం

టీచర్ : రవీ! నీకు ఏ జంతువంటే ఇష్టం?

రవి : పిల్లి అంటే నాకు ఎంతో ఇష్టం

టీచర్ : ఎందుకని?

రవి : రోజూ రాత్రి అంతా పడుకున్న తర్వాత వంటింట్లో దూరి నేను పాలు తాగుతాను అమ్మ మాత్రం పిల్లిని తిడుతుంది.

బీమా

ఒక భీమా ఏజెంటు దగ్గరకి ఒక వ్యక్తి పరుగెత్తుతూ వచ్చాడు.

వ్యక్తి : మీ ఇల్లు తగలబడిపోతోంది.

బీమా ఏజంటు : మరేం పరవాలేదు. ఇంటిని భీమా చేయించాను.

వ్యక్తి : ఇంట్లో మీ భార్యకూడా ఉంది.

బీమా ఏజంటు : మా ఆవిడకి కూడా బీమా పాలసీ ఉంది.

తలలు నరికేస్తే....

ఫ్రెంచి విప్లవం ఉధృతంగా కొన సాగుతోంది. తమ ఊరికి వచ్చిన ఓ బాట సారిని విప్లవ విశేషాల గురించి ప్రశ్నించాడు. ఓ టోపీల వ్యాపారి.

బాటసారి : పరిస్థితి దారుణంగా ఉంది. కనిపించిన వాడి తల నరికేస్తున్నారు. రక్తం ఏరులై పారుతోంది.

వ్యాపారి : (వెంటనే ఆ వ్యాపారి తల పట్టుకుని కుమిలి పోతూ...) నా టోపీల వ్యాపారం సర్వనాశనం అయిపోయేట్టుందే.

అందుకే!

ఒకతను మెడికల్ షాపుకెళతాడు.

వ్యక్తి : మీ షాపులో ఓ సేల్స్ గర్ల్ వుండేదికదా! ఎక్కడి కెళ్ళింది?

షాపు యజమాని : ఆమెను ఉద్యోగం నుంచి తీసేశాం.

వ్యక్తి : ఎంతపని చేశారండి? ఆమె ఒక్కొక్క చిరునవ్వు ఒక్కొక్క ఔషధంలా వుండేది.

షాపు యజమాని : అందుకేనయ్యా బాబు, ఆవిణ్ణి వుద్యోగం నుంచి తీసేసింది.

పడిశం

శేఖర్: మా మామయ్యకు జబర్దస్తీ పడిశం పట్టింది. నానాహైరానా పడిపోతున్నాడు. నోటెంట మాటే రావడం లేదు.

సుమంత్ : రొంప మరీ ఎక్కువగా వున్నప్పుడు కొంచెం బ్రాందీ ఇస్తే ముక్కు, గొంతు క్లియర్ అయిపోతాయి.

శేఖర్ : రొంపగా వుందని అదే చేశాము. ఇప్పుడు బ్రాందీ ఎక్కువైపోయి మాట రావటం కష్టమైపోయింది.

- బుద్ధిగం పాండురంగారెడ్డి

కరీంనగర్.

షి'కారు' చేసేద్దాం



ఎప్పుడు చూసినా అవే రంగులు, డిజైన్ల కార్లు. అంతా రొటీన్. ఇంక వెరైటీ లేదా? అనుకునేవారికి ఈ కార్లు కనువిందు చేసేస్తాయి. పిల్లి, రాక్షసుడు, కప్ప, బంతి, బూటు... ఇలా రకరకాల జంతువులు, వస్తువుల ఆకారమున్న కార్లు చూస్తుంటేనే ...వాటిలో ఎక్కేయాలనిపిస్తోందికదూ. మనసుకు నచ్చిన పాట పాడుకుంటూ ఊరంతా షికారు కొట్టి రావాలనిపిస్తోంది కదూ.

ఏదో ఒక కొత్త విషయాన్ని కనుగొనాలి లేదా కొత్త వస్తువును తయారుచేయాలి అనే తపన ఉన్నప్పుడే ఇటువంటి సృజనాత్మకత బయటికి వస్తుంది మరి. మీ మనసులో కూడా ఏవైనా ఆలోచనలుంటే ఆచరణలో పెట్టేయండి. ఇలాంటి కార్లే కాదు వాటిని తలదన్నే వెరైటీ విమానాలనే తయారుచేసేయొచ్చు. కాకపోతే కొద్దిగా ఓపిక...సహనం వుండాలి అంతే! ♦



ముసలమ్మ - కుందేలు

వెండి కిరణాల వెన్నెలను తాగి, కాళ్లు ముడిచి పడుకుని చెప్పమన్నట్లు సిద్ధంగా వుంది కుందేలు. ముసలమ్మ నేలరాలిన పూలను ఏరి మాల కట్టసాగింది కూని రాగం తీస్తూ. పాపం తోడు ఆడవాళ్లెవరూ లేరాయె. కట్టిన మాలను తనే తల్లో పెట్టుకుని మురిసిపోయింది. అప్పుడు ముసలమ్మను ఓరకంట చూసి నవ్వుకుంది కుందేలు. మూతిని *కాలితో రుద్దుకుంటూ బాగుందని మెచ్చుకోలు పలికింది. పూర్ణ చంద్రుడు తన కిరణాలను* భూమిపైకి అవిశ్రాంతంగా ప్రసరింపజేస్తున్నాడు. ముసలమ్మ తన చేతి కర్రను చెట్టు మొదలుకు ఆనించి, తనూ కళ్లు మూసుకుని తన యవ్వనంలోని అనుభూతులను తలుచుకోసాగింది. కొద్ది క్షణాల్లోనే ఆమెకు కన్నంటుకుంది. ఆ సమయం కోసమే చూస్తున్నట్లుగా కుందేలు మెల్లగా లేచింది. తన మూతితో ఆమె కాలిని కదిపి చూసింది. ఊహూ కదల్లేదు, మెదల్లేదు. ముసలమ్మ నిద్రలోకి జారుకుంటే. కుందేలుకు హుషారొచ్చింది. అదీరోజు భూలోకం వెళదామని నిర్ణయించుకుంది. కొన్ని యుగాలుగా దానికా చంద్రుని మీద ఉండీ ఉండీ విసుగు పుట్టింది. అదే ముసలమ్మ, అదే పున్నాగ చెట్టు. విరగబూసిన పున్నాగ పూల పరిమళం. భూలోకంలో రంగు రంగుల రాళ్లు, రకరకాల చెట్లు, పూల మొక్కలు, తీరొక్కరుచుల ఆహారం, చిత్ర విచిత్రమైన జంతువులు, తెలివైన మనుషులు ఉంటారని విన్నది. 'ఒక్కసారైనా చూడందే ఈ కుందేలు జన్మ ఎందుకు?' అనుకుంది ఎన్నోసార్లు. చాలా సార్లు వెళ్దామని ప్రయత్నించి ముసలమ్మ అడ్డు తగలడంతో, విరమించుకుంది. కానీ అణుచుకున్న కొద్దీ కోరిక రోజురోజుకు తీవ్రమవసాగింది. ఇంక వెళ్లవలసిందేనని దృఢంగా అనుకుందే తడవు, వెంటనే చంద్ర కిరణాల మీదుగా రివ్వున నల్లమల అడవిలోకి దిగింది. కనపడ్డ చెట్టును, పుట్టను తాకి చూసింది. మనసుపడ్డ దుంపల్ని, కోరుకున్న ఆకుల్ని కొరికి తిన్నది. పరిగెత్తే జంతువుల్ని, గలగలా శబ్దం చేస్తూ పారే సెలయేటి నీటిని తాకి ఆనంద పడ్డది. తన మూతిని నీళ్లలో ముంచి మీసాలతో ఆడుకుంది. తర్వాత పెద్ద బండరాయిని ఎక్కి కళ్లింత చేసుకుని అడవంతా చూసింది. గబాల్న కిందకి దూకి, దట్టమైన పొదలో దూరి నిద్రపోయింది. అలా గంటలకొద్దీ గడిపేసింది.

ఎలుగుబంటి పొదలను వెతుక్కుంటూ తేనె తుట్టెల్ని పట్టుకుని చప్పరిస్తూ రాసాగింది. అది లేపిన తుట్టెలోని ఒక కందిరీగ వచ్చి నిద్రపోతున్న కుందేలు తోకను కుట్టింది. అప్పటి వరకు మంచులా తెల్లగా మెరిసిపోతున్న కుందేలు చర్మం తేనెటీగ కుట్టడంతో ఎర్రగా కందిపోయింది. వెన్నెలను తాగి పెరిగిన కుందేలుకు ఆ నొప్పి భరింపరానిదిగా మారింది. తోక చురుక్కుమనడంతో పొదలోంచి ఒక్క గెంతు గెంతింది.

హఠాత్తుగా కుందేలు ముందుకు దూకడంతో ఉలిక్కిపడింది ఎలుగుబంటి. వెంటనే తమాయించుకుని, కుందేలు వెంటపడ్డది. అది భయంతో ముందుకు పరుగందుకుంది. అంతలో ఆకాశంలోని డేగ ఒకటి రివ్వున వచ్చి అందుకోబోయింది. కుందేలు అమాంతం పక్కనున్న చెట్టు తొర్రలో దూరింది. డేగ కాళ్లకు ఆహారం అందకపోవడంతో పక్కనున్న చెట్టు మీద వాలింది మళ్లీ ప్రయత్నించడం కోసం. కుందేలు కదలకుండా అలాగే కూర్చుంది. డేగ కళ్లు చుట్టూ వెదికాయి. కానీ వెన్నముద్ద లాంటి కుందేలు కనిపించకపోవడంతో రివ్వున ఆకాశంలోకి లేచి, పైనుండి చూడసాగింది. చెట్టు తొర్రలోని కుందేలు గబాల్న పక్కనున్న రెల్లు పొదలోకి దూకింది. రెండు పోచల్ని పెదాలతో పట్టుకుని లాగింది. ఇంకేముంది, అసలే గడ్డిపోచలు చాలా పదునుగా ఉంటాయి గదా దాని పై పెదవి కాస్తా చీలింది. ఇంతలో మచ్చల పామొకటి బుస కొడుతూ తనవైపే రాసాగింది. పసిగట్టిన కుందేలు పొదలోంచి ఒక్క దూకు దూకి వెలుపలకు పరుగందుకుంది. ఆహారం వెదుక్కుంటూ వస్తున్న రెండు నక్కల కంటపడ్డది. అవి ఉత్సాహంగా వెంట పడ్డాయి. వాటకి చిక్కకుండా పరిగెత్తసాగింది. అయినా ఆహారం కదా, వదలకుండా వెంటపడ్డాయి. పొదల మధ్య చిక్కుచిక్కుగా పరిగెత్తి వాటిని తప్పించుకుంది. అవి దూరంగా పొదల్ని గాలించసాగాయి. ఒక పొదలో నిద్రపోతున్న కొండ చిలువ గబాల్న మెడ సాచింది అందుకునేందుకు. తృటిలో తప్పించుకుని బతుకు జీవుడా అనుకుంటూ సత్తువ కొద్దీ పారిపోయాయి నక్కలు.

వంగ పొదలో దూరి చీలిన తన పెదవిని కాలితో తుడుచుకోసాగింది. అప్పుడే భయంకరంగా అరుపులు వినిపించాయి. వేటకుక్కల అరుపులు, వేటగాని కేకలు. అడవి జంతువుల్ని బెదరగొడ్తూ కుక్కలు మూడు సివంగుల్లా కసికొద్దీ పరిగెత్తుకుంటూ రాసాగాయి. వాటిని చూసిన కుందేలుకు పై ప్రాణాలు పైనే పోయాయి. అవి మూడూ పసిగట్టి తనవైపే రావడంతో కాలి సత్తువ కొద్దీ దౌడు తీసింది. వేటగాడు దాని వెనకాల పడ్డాడు. నున్నగా, తెల్లగా, బొద్దుగా వున్న కుందేలును చూసి, తాను ముందు అందుకోవాలంటే తానంటూ కుక్కలు కసికొద్దీ వెంటబడ్డాయి. వాటి వెనకాల వేటగాడు కుక్కలను ఉసి గొలుపుతూ... పాపం కుందేలు శక్తి కొలదీ పరిగెత్తింది. అలా పరిగెత్తీ, పరిగెత్తీ ఒక మైదానంలోకి చేరింది. ఇంకేముంది, కుక్కలు రెట్టించిన ఉత్సాహంతో తమ నోటికి తప్పక చిక్కుతుందనే నమ్మకంతో ఒంట్లోని శక్తినంతా కాళ్లలోకి తీసుకుని నాలుకలు వేలాడేసి కోరలు ముందుకు చాచి బలంగా పరిగెత్తసాగాయి. కుందేలు వాటిని మైదానమంతా తిప్పి తప్పించుకోసాగింది. కుక్కలు రాళ్లు తగిలి, కట్టెలు తగిలి బొక్క బోర్లా పడ్డాయి. అయినా తిరిగి లేచి మళ్లీ పరుగందుకున్నాయి. ఆ కుక్కలు మహా తెలివైనవి. అవి ఎప్పుడూ వేటాడుతుండడంతో వాటికి వేటలోని నైపుణ్యం సహజంగా అబ్బింది. అవి ఉన్నట్టుండి మూడూ మూడువైపులా చీలిపోయాయి. కుందేలును మూడు దిక్కుల నుండి కుక్కలు కమ్ముకోగా మరో వైపు నుండి వేటగాడు ఎదురుగా వచ్చాడు. ఇక కుందేలు భయంతో చావు తప్పదని ఒక్క గావుకేక పెట్టింది. నిద్రపోతున్న ముసలమ్మ దిగ్గున మేలుకుంది. పక్కన కుందేలు కనిపించలేదు. వెంటనే కిందికి చూసింది. అడవిలో కుక్కల మధ్య నోటికి చిక్కబోతున్న కుందేలు కనిపించింది. వెంటనే తన చేతిని కుందేలు ముందుకు చాచింది. తనకు పరిచయమున్న చేయి కనిపించడంతో గబాల్న ఆ చేతిలోకి దూకింది. కుందేలు స్పర్శ తాకిన చేయి అమాంతం ఆకాశంలోకి లేచింది. దగ్గరకొచ్చి అందుకోబోయిన కుక్కలు ఒగరుస్తూ వింతగా చూడసాగాయి ఆకాశం వైపు. చేతి విమానంలో కూర్చుని వెళుతున్న కుందేల్ని వేటగాడు నిర్ఘాంతబోయి చూడసాగాడు. "భూలోకం సుందరమైనదే కాదు. చాలా ప్రమాదమైంది కూడా. నాకు చెప్పకుండా ఎప్పుడూ వెళ్లకు" అని కోప్పడింది ముసలమ్మ కుందేలును. "వెళ్లినందుకు అనుభవమే కాదు, శిక్ష కూడా లభించింది" అనుకుంది చీలిన పెదవిని కాలితో రుద్దుకుంటూ.

- పుప్పాల కృష్ణమూర్తి